PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 356 | విజయవాడ, సోమవారం 28 జులై 2025 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 28 July 2025 | Rs



అజరామరుడు
ప్రేమ్‌చంద్
- హిందీ సాహిత్య ధ్రువతారపై ప్రత్యేక వ్యాసం

4వ పేజీలో

ఇక తేలేది టై బ్రేకర్‌లోనే
- హంపి, దివ్య రెండో గేమ్ సైతం డ్రా
- ఫిడే మహిళల చెస్ ప్రపంచకప్

6

తప్పులు సరిదిద్దేందుకే...

• సింగపూర్‌లో చంద్రబాబు • తొలిరోజు పలువురితో భేటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గత ప్రభుత్వంలో జరిగిన తప్పులను సరిదిద్దడమే తన పర్యటన ప్రధాన లక్ష్యమని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సింగపూర్‌లో అన్నారు. ఆయన సింగపూర్ పర్యటన ఆదివారం ప్రారంభమైంది.చంద్రబాబుకు తొలుత అక్కడ ఉన్న తెలుగు ప్రజలు సంప్రదాయ నృత్యాలతో ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం స్థానికంగా ఉన్న వన్ వరల్డ్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రాంగణంలో తెలుగు డయాస్పోరా ఫ్రం సౌత్ ఈస్ట్ ఏషియా కార్యక్రమంలో చంద్రబాబు ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సింగపూర్ అంటే తనకు చాలా అభిమానమని చెప్పారు. తాను అడిగిన వెంటనే ఉచితంగా అమరావతి కోసం మాస్టర్‌ప్లాన్ తయారుచేయడానికి అంగీకరించిందని తెలిపారు. 2019లో రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో సింగపూర్‌ను తప్పుపట్టే పరిస్థితి తీసుకొచ్చారని అన్నారు. వాటిని సరిదిద్ది, రికార్డులు సరి చేయడమే తన తాజా పర్యటన ఉద్దేశ్యమని చెప్పారు. మన రాష్ట్రంలో ఏ ఒక్కరు తప్పుచేసినా తెలుగు వాళ్లే చేశారంటారని, ఆ అభిప్రాయాన్ని సింగపూర్ ప్రభుత్వంలో, కంపెనీల్లో తొలగించేందుకు ప్రయత్నిస్తున్నానని చెప్పారు. సీడ్ క్యాపిటల్ నిర్మాణానికి సింగపూర్ ప్రభుత్వం మళ్లీ ముందుకు రాకపోవచ్చునని, జరిగిన వాస్తవాలను మాత్రం వారికి తెలియజేస్తానని అన్నారు. 2019లో కూడా టిడిపి ప్రభుత్వమే కొనసాగి ఉంటే అమరావతి సింగపూర్ స్థాయికి చేరేదని అన్నారు. పి4 కార్యక్రమం ద్వారా పేదరికాన్ని తగ్గించేందుకు నో పావర్టీ మిషన్ ప్రారంభించానని చెప్పారు. విదేశాల్లో స్థిరపడిన తెలుగువాళ్లు పి4లో భాగస్వాములుగా ఉంటే తనకు అంతకు మించిన ఆనందం మరోకటి ఉండదన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో విదేశాల్లో ఉన్న తెలుగు వారు తమకోసం పనిచేశారని తెలిపారు. సింగపూర్‌లో తెలుగును కూడా రెండో భాషగా పెట్టాలని కోరతానని చెప్పారు. కొన్ని కారణాల వల్ల రాజధాని ప్రాజెక్టు నుంచి సింగపూర్ వైదొలిగిందని సింగపూర్‌లోని భారతహై కమిషనర్ శిల్పక్ ఆంబులేతో చంద్రబాబు అన్నారు. ఆయనతో చంద్రబాబు మర్యాదపూర్వకంగా ఆదివారం సమావేశమయ్యారు. 2019-24 మధ్య జరిగిన పరిణామాలు దీనికి కారణమయ్యాయని తెలిపారు. ఎపిలో వివిధ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త పాలసీలు, అవకాశాలను వివరించారు. సింగపూర్ నుంచి భారత్‌కు పెట్టుబడులు రావాలని, ఎపి గేట్‌వేగా ఉంటుందని చెప్పారు. భారత్‌లో ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు సింగపూర్ సంస్థలు ఆసక్తిగా ఉన్నాయని హైకమిషనర్ చంద్రబాబుకు వివరించారు. అనంతరం గ్లోబల్ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ సుర్బానా జురాంగ్ సంస్థ ప్రతినిధి చెర్‌ఎక్లో సిఎంతో సమావేశమయ్యారు. ఎపిలో హౌసింగ్ ఫర్ ఆల్ ప్రాజెక్టులో భాగం కావాలని చంద్రబాబు సూచించారు. మొత్తం 20 పోర్టులు, 15 ఎయిర్‌పోర్టులు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. అనంతరం మలేషియాకు చెందిన ప్రముఖ నిర్మాణ సంస్థ ఎవర్సెండై కార్పొరేషన్ బైర్హాద్ చైర్మన్ తాన్ ఏకె నాథన్ సిఎంతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో ఫాబ్రికేషన్ ఫ్యాక్టరీతో పాటు ఇంటిగ్రేటెడ్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు అంశంపై ఇరువురి మధ్య చర్చ జరిగింది. ఈ పర్యటనలో మంత్రులు నారా లోకేష్, పి నారాయణ, టిజి భరత్ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ఉత్పాదనల కంపెనీ 'ఎవర్సెండాయ్' సంస్థ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ శ్రీదత్ నాథన్‌తో చర్చలు జరుపుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, చిత్రంలో మంత్రులు పి నారాయణ, నారా లోకేష్, టిజి భరత్ కూడా ఉన్నారు.

'లూలూ' కు భూ పందేరం
- విజయవాడలో పాత బస్టాండ్
- విశాఖ బీచ్‌రోడ్‌లో ..
- ఉత్తర్వులు జారీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రజా ఆందోళనను బేఖాతరు చేస్తూ విజయవాడలోని పాత ఆర్‌టిసి బస్టాండ్‌ను విదేశీ బహుళజాతి సంస్థ లూలూకు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. అలాగే విశాఖపట్నం బీచ్ రోడ్‌లోనూ హార్బర్ పార్కుకు చెందిన 13.74 ఎకరాల స్థలాన్ని మాల్ కోసం ఆ సంస్థకు అప్పగించింది. ఈ మేరకు ఆదివారం ఉత్తర్వులు విడుదలయ్యాయి. పరిశ్రమలశాఖ ముఖ్యకార్యదర్శి ఎన్ యువరాజ్ పేరిట ఈ ఉత్తర్వులు జారీ అయ్యాయి. విజయవాడ పాత బస్టాండ్‌కు చెందిన 4.15 ఎకరాల భూమిని 65 ఏళ్ల లీజు ప్రాతిపదికన ఇస్తున్నట్లు మరో 33 ఏళ్ల లీజు గడువు పెంచుకోవడానికి అవకాశం ఇస్తున్నట్లు ఉత్తర్వులలో పేర్కొన్నారు. నిర్మాణ ప్రాంతం 2.32 లక్షల చదరపు అడుగులుగా, మూడంతస్తుల షాపింగ్ మాల్ నిర్మించడానికి అనుమతిఇస్తున్నట్లు తెలిపారు. 200 వాహనాల పార్కింగ్ ఏరియా, 120 రిటైల్ షాపులు నిర్మించడానికి అనుమతినిచ్చారు. ఈ నిర్మాణంలో 1.34 లక్షల చదరపు అడుగుల స్థలాన్ని ఇతరులకు లీజుకు ఇచ్చేందుకు అవకాశం ఇస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు కోసం లూలూ సంస్థ రూ.156 కోట్లు పెట్టుబడి పెట్టనుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే విశాఖపట్నం బీచ్ రోడ్‌లో షాపింగ్ మాల్ నిర్మాణం కోసం 13.74 ఎకరాలను 99 ఏళ్ల లీజుకు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఇందులో 13.50 లక్షల చదరపు అడుగుల్లో మెగా షాపింగ్ మాల్, మిగిలిన స్థలంలో లూలూ సూపర్ మార్కెట్, ఫ్యాషన్స్, ఫ్యామిలీ ఎంటర్‌టైన్మెంట్ సెంటర్ వంటివి ఏర్పాటు చేస్తారని తెలిపారు. నిర్మాణం పూర్తయిన అనంతరం, ప్రారంభించిన మొదటి మూడేళ్ల లీజు నుంచి మినహాయింపు కల్పించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

తొక్కిసలాటలో గాయపడినవారిని ఆసుపత్రికి తరలిస్తున్న సహాయక సిబ్బంది

హరిద్వార్‌లో ఘోరం
- మానసాదేవి ఆలయంలో తొక్కిసలాట
- 8మంది మృతి.. 30 మందికి గాయాలు
- రాష్ట్రపతి, ప్రధాని, సిఎం సంతాపం

హరిద్వార్ : ఉత్తరాఖండ్‌లో హరిద్వార్‌లోని మానసాదేవి ఆలయం వద్ద ఘోరం చోటుచేసుకుంది. ఆలయం మెట్ల మార్గంలో ఆదివారం ఉదయం తొక్కిసలాట జరగడంతోబు ఎనిమిదిమంది యాత్రికులు చనిపోయారు. 30 మంది గాయపడ్డారు. ఈ విషయాన్ని హరిద్వార్ జిల్లా కలెక్టర్ మయూర్ దీక్షిత్ ధ్రువీకరించారు. చనిపోయినవారిలో నలుగురు ఉత్తరప్రదేశ్‌కు చెందినవారు కాగా, ఒకరు ఉత్తరాఖండ్, మరొకరు బీహార్‌కు చెందిన వారిగా గుర్తించినట్లు పేర్కొన్నారు. మిగిలిన వారిని గుర్తించాల్సి ఉంది. క్షతగాత్రుల్లో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయని, వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం వారిని ప్రయివేటు ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. మిగతావారికి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలోనే చికిత్స అందిస్తున్నట్లు చెప్పారు. ఆలయం వద్ద సహాయక చర్యలు కొనసాగుతున్నాయని ఉన్నతాధికారి వినయ్ శంకర్ పాండే తెలిపారు. శ్రావణమాసం నేపథ్యంలో ఉత్తరాదిన ఆలయాలను భక్తులు పెద్ద ఎత్తున సందర్శించుకుంటారు. దీంతో మానసాదేవి ఆలయానికి కూడా ఆదివారం భక్తుల తాకిడి ఎక్కువైంది.

కారణమేంటి..?

ఆలయంలో చోటు చేసుకున్న తొక్కిసలాట ఘటన వెనుక గల కారణాలేంటి అనేదానిపై పోలీసులు, అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రాథమికంగా అందిన సమాచారం ప్రకారం.. ఆలయ మెట్ల సమీపంలో ఓ ఓవర్‌హెడ్ విద్యుత్ వైర్ తెగి నడకదారిపై పడినట్లు ఒక పుకారు వ్యాపించింది. అప్పటికే అక్కడ భక్తులు కిక్కిరిసి ఉన్నారు. దీంతో ఈ పుకారుతో వారిలో గందరగోళం, ఆందోళన నెలకొన్నది. అది కాస్తా తొక్కిసలాటకు దారి తీసినట్లు తెలుస్తున్నది. విద్యుత్ వైర్ తెగిపడి విద్యుద్ఘాతం జరిగిందా? లేక అది పుకారేనా? అన్న విషయంపై అధికారులు దర్యాప్తు జరుపుతున్నారు. ఒకరు మాత్రం కరెంట్ షాక్‌కు గురై కాలిన గాయాలతో మిగతా 5లో

మాధవరావుకు 'ఎంహెచ్' అవార్డు
- ప్రజాశక్తి సాహితీ సంస్థ కార్యదర్శి ఎంవిఎస్ శర్మ
- ఆగస్టు 1న గుంటూరులో ప్రదానం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రజాశక్తి సాహితీ సంస్థ ప్రతిష్టాత్మకంగా అందించే మోటూరు హనుమంతరావు(ఎంహెచ్) స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డుకు ఆంధ్రజ్యోతి విలేకరి గేదెల మాధవరావు ఎంపికయ్యారు. ఈ మేరకు ప్రజాశక్తి సాహితీ సంస్థ కార్యదర్శి ఎంవిఎస్ శర్మ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజాశక్తి వ్యవస్థాపక సంపాదకులుగా సుదీర్ఘకాలం బాధ్యతలు నిర్వహించిన మోటూరు హనుమంతరావు స్మారకార్థం ప్రతిఏటా ఉత్తమ జర్నలిస్టును అవార్డును ఇస్తున్న విషయాన్ని ఆ ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. ఈ ఏడాది మాధవరావుకు ఇవ్వాలని అవార్డు కమిటీ నిర్ణయించిందని తెలిపారు. శ్రీకాకుళం జిల్లా ఏజన్సీ ప్రాంతమైన మెళియాపుట్టిలో ఆంధ్రజ్యోతి విలేకరిగా పనిచేస్తున్న మాధవరావు గిరిజనుల దుర్భర జీవిత పరిస్థితులు, విద్య, వైద్యం, సమాచార సంబంధాలు రాకపోకలు ... ఇలా ప్రతి రంగంలోనూ ఎడతెగని సమస్యలను కళ్లకు కట్టేలా వర్ణిస్తూ ఇచ్చిన కథనాలకు గాను ఈ అవార్డు ఇస్తున్నట్లు వివరించారు.. "ఈ కష్టాలు ఇంకెప్పుడు తీరేను?", "కౌలు రైతుల కష్టాలు", "వసతి గృహాల పరిస్థితి మారేనా", "కూరగాయలు ఇవ్వట్లే", "బిడ్డకు అభయమేదీ?", "అమలు కాని గిరిజన చట్టాలు", "హలో హలో వినిపించడం లేదు", "ఒకే వూరు రెండు రాష్ట్రాలు", "భూములున్నా హక్కు లేదు" వంటి శీర్షికలతో వివిధ కోణాలను స్పృశిస్తూ మాధవరావు వార్తలను రాశారని తెలిపారు. ఈ కథనాల్లో సంఖ్యా వివరాలు, క్షేత్రస్థాయి అనుభవాలు మేళవించి వాస్తవాలను వెలుగులోకి తెచ్చినందున ఆయనకు ఈ అవార్డు ఇవ్వడం సముచితమని కమిటీ భావించిందని పేర్కొన్నారు. సీనియర్ సంపాదకులు తెలకపల్లి రవి అధ్యక్షతన ప్రొఫెసర్ అనిత (నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం), నల్లి ధర్మారావు (సీనియర్ పాత్రికేయులు)తో కూడిన ఎంపిక కమిటీ వచ్చిన ఎంట్రీలను పరిశీలించి మాధవరావును ఎంపిక చేసిందని వివరించారు. ఆగస్టు 1న గుంటూరులోని రెవెన్యూ భవనంలో జరిగే సభలో ఈ పురస్కారం మాధవరావుకు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.

మాధవరావు

తుంగభద్రకు పెరిగిన నీటి ఉధృతి
- 30 గేట్ల ద్వారా 1.40 లక్షల క్యూసెక్కులు విడుదల
- నదీతీర ప్రాంత ప్రజలకు ప్రమాద హెచ్చరికలు జారీ

3

రూట్ మార్చిన గంజాయి వ్యాపారులు
- విచ్చలవిడిగా అమ్మకాలు

3

పి-4 భారాన్ని ఉద్యోగులపై నెట్టొద్దు

సిపిఎం రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పి-4 భారాన్ని ఉద్యోగులపై నెట్టొద్దని సిపిఎం రాష్ట్ర కమిటీ కోరింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో పి-4 పేరుతో పేదరికాన్ని నిర్మూలిస్తామని, సంపన్నులు ముందుకొచ్చి మార్గదర్శకులుగా నిలబడాలని, పేదవాళ్లను బంగారు కుటుంబాలు చేస్తామంటూ రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాలుగైదు మాసాలుగా ఊదరగొడుతున్నారని తెలిపారు. కానీ వారికి కార్పొరేట్లు, సంపన్నుల నుంచి ఆశించిన స్పందన రాలేదని, ఇప్పుడు ఆ భారాన్ని ఉద్యోగులపై నెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని పేర్కొన్నారు. టీచర్లందరూ ఒక్కొక్కరు ఐదుగురిని దత్తత తీసుకోవాలని డిఇఒల ద్వారా ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. మరోవైపు ప్రతి సచివాలయ కార్యదర్శి తప్పనిసరిగా ఇద్దరిని దత్తత తీసుకోవాలని ఆదేశాలు జారీ చేస్తున్నారని పేర్కొన్నారు. తాజాగా విజయనగరం జిల్లా సాలూరు మున్సిపాల్టీ విడుదల చేసిన మెమోనూ జత చేశారు. కార్మికులకు, ఉద్యోగులకు జీతభత్యాలు ఇవ్వకుండా, వారి హక్కులను హరిస్తూ, వారిపై భారాలు మోపుతూ లేబర్ కోడ్స్ వంటి దుర్మార్గ చట్టాలను రుద్దుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు వారిపై పి-4 భారాన్ని నెట్టటం అమానుషమని, తక్షణమే ఈ ప్రతిపాదన ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్లు, పెద్దపెద్ద కంపెనీలు ఎగ్గొట్టిన పన్నులు, బ్యాంకు రుణాలను ప్రభుత్వం పట్టుదలతో చట్టాన్ని ఉపయోగించి వసూలు చేస్తే 20 లక్షల మంది పేదలకు అవసరమైన అన్ని సౌకర్యాలూ సులభంగా ఏర్పాటు చేయొచ్చని సూచించారు. దానికి బదులుగా వారికి రాష్ట్రాన్ని, రాష్ట్ర సంపదను ధారాదత్తం చేస్తూ వారి నుంచి దయతో దానాలు స్వీకరించాలని ప్రభుత్వం భావించటం సముచితం కాదని పేర్కొన్నారు.

ఇప్పటికైనా ప్రభుత్వం వాస్తవిక దృక్పథంతో ముందుకొచ్చి పేదరిక నిర్మూలనకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, ఉపాధి కల్పన, జీతాల పెంపుదల, భూ పంపిణీ వంటి చర్యల ద్వారా పేదరిక నిర్మూలన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రూ.4500కోట్లతో ....
- జనవరిలో కడప స్టీల్ ప్లాంట్ తొలిదశ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైఎస్‌ఆర్ కడప జిల్లా సున్నపురాళ్లపల్లెలో ఏర్పాటు చేయనున్న స్టీల్‌ప్లాంట్ తొలిదశ పనులు 2026 జనవరిలో ప్రారంభం కానున్నాయి. ప్లాంట్ ఏర్పాటుపై జెఎస్‌డబ్ల్యూ ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది.తొలిదశ పనులు రూ.4,500కోట్లు, రెండో దశ పనులు రూ.11,850 కోట్లతో జరుగునున్నాయి. స్టీల్‌ప్లాంట్ కోసం సంస్థకు ఎకరా రూ.5లక్షల వంతున సున్నపురాళ్లపల్లెలో 1,100 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించింది. వచ్చే ఏడాది జనవరిలో పనులు ప్రారంభించి ఏప్రిల్‌నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. రెండోదశ పనులు 2031 జనవరి నాటికి పనులు ప్రారంభించి 2034 ఏప్రిల్ నాటికి ఉత్పత్తి ప్రారంభించాలని స్పష్టం చేసింది. గతంలో ప్లాంట్‌కు భూమి పూజ జరిగినా వివిధ కారణాలతో ప్లాంట్ పనులు ఆలస్యమవుతూ వచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పటికే సున్నపురాళ్లపల్లెలో ప్రభుత్వ అధికారులు, జెఎస్ డబ్ల్యూ సంస్థ ప్రతినిధులు సర్వే నిర్వహించారు.

సిసిఆర్‌సి కార్డు ఉన్నా 'అన్నదాతా సుఖీభవ'కు దూరం
- కౌలు రైతులపై సర్కార్ నిర్లక్ష్యం
- కార్డుల జారీలోనూ తీవ్ర జాప్యం

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి, బూర్జ

కౌలు రైతులను అన్నదాతా-సుఖీభవ పథకానికి ప్రభుత్వం దూరం చేసింది. ప్రస్తుతం పంట సాగు హక్కుదారుల పత్రం (సిసిఆర్‌సి కార్డు) ఉన్న వారు, గతంలో రైతు భరోసా అందుకున్న వారు సైతం ఇప్పుడు ప్రభుత్వ సాయానికి నోచుకోలేకపోతున్నారు. గత వైసిపి ప్రభుత్వం రైతు భరోసా పథకాన్ని కౌలు రైతులకు వర్తింపజేసినా ప్రస్తుత టిడిపి కూటమి ప్రభుత్వం వారిని పరిగణనలోకి తీసుకోలేదు. కార్డుల జారీ ప్రక్రియ పూర్తి కాలేదనే సాకుతో వారికి ఈ పథకాన్ని వర్తింపజేయడం లేదు. కౌలు కార్డులు దక్కినా, దాని ఫలితం మాత్రం కౌలు రైతులు పొందలేకపోతున్నారు. విత్తనాల పంపిణీ దాదాపు పూర్తయిన తర్వాత కార్డులు ఇవ్వడం వల్ల ప్రయోజనం లేకుండా పోతోంది. బ్యాంకు రుణాలూ దక్కడం లేదు. భూ యజమానులు అప్పటికే ఆ భూమిపై రుణం తీసుకోవడంతో కౌలు రైతులకు బ్యాంకర్లు రుణం మంజూరు చేయడం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఏడాది పది లక్షల మంది కౌలు రైతులకు సిసిఆర్‌సి కార్డులను జారీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. జూన్ రెండో వారంలో కార్డుల జారీ ప్రక్రియ మొదలు పెట్టింది. కౌలు రైతులకు రెండు కేటగిరీల్లో కార్డులను జారీ చేసింది. ఇప్పటివరకు మొత్తం 4,58,987 మందికి జారీ అయ్యాయి. సర్వే నంబర్ల ఆధారంగా 2,86,383 మందికి, భూ సమగ్ర సర్వే జరిగిన మిగతా 5లో

కార్డు కోసం మూడేళ్లుగా తిరుగుతున్నాను

కౌలు గుర్తింపు కార్డు కోసం మూడేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నాను. భూ యజమాని సంతకం చేయకపోవడంతో కార్డు ఇవ్వలేమని చెప్పారు. సాగు ఖర్చుల కోసం వడ్డీ వ్యాపారుల వద్ద నూటికి రూ.2 చొప్పున రూ.30 వేలు తీసుకున్నాను.

- లుకలాపు కామినాయుడు, బూర్జ మండలం, అన్నంపేట గ్రామం,

గతంలో మంజూరైనా..

గత ప్రభుత్వంలో కౌలు కార్డు మంజూరైంది. రైతు భరోసా కూడా అందింది. ఇప్పుడు కౌలు గుర్తింపు కార్డు ఇచ్చినా అన్నదాతా-సుఖీభవ పథకంలో పేరు రాలేదు.

- టంకాల జగ్గునాయుడు, బూర్జ మండలం, అల్లెన గ్రామం, శ్రీకాకుళం జిల్లా

అనిల్ అంబానీది కార్పొరేట్ దోపిడీయే!
- పారు బకాయిలుగా మారిన వేల కోట్ల రుణాలు
- తొలుత మోసం అంటూ ఆ తర్వాత మాటమార్చిన ఎస్‌బిఐ, కెనరా బ్యాంక్
- ప్రభుత్వ మౌనంపైనా అనుమానాలు
- లోతుగా విచారణ జరపాలంటూ ప్రభుత్వానికి ఆఫీ లేఖ

5

కార్మిక సమ్మెతో ఆశా వర్కర్లకు ప్రోత్సాహకాలు పెంపు

ఇది ఐక్య పోరాట విజయం : ఎడబ్ల్యుఎఫ్ఎఫ్ఐ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఈ నెల 9న జరిగిన కార్మిక సమ్మెతో ఆశా వర్కర్లకు ప్రోత్సాహకాలు పెంచారు. ఇది సార్వత్రిక సమ్మె విజయమని ఆశా వర్కర్ల యూనియన్ ఎడబ్ల్యుఎఫ్ఎఫ్ఐ పేర్కొంది. ఈ మేరకు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పిపి ప్రేమ, మధుమితా బందోపాధ్యాయ ఆదివారం ప్రకటన విడుదల చేశారు. ఆశా వర్కర్ల నిరంతర పోరాటాలు, జులై 9 సార్వత్రిక సమ్మెతో కేంద్ర ప్రభుత్వం ఆశా వర్కర్ల ప్రోత్సాహకాల పెంపును ప్రకటించాల్సి వచ్చిందన్నారు. పార్లమెంట్లో సిపిఎం ఎంపి జాన్ బ్రిట్టాస్ అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ సహాయ మంత్రి ప్రతాపరావు జాదవ్ సమాధానం ఇస్తూ.. ఆశా వర్కర్లకు రూ.3,500 ప్రోత్సాహకాన్ని పెంచినట్లు తెలిపారని పేర్కొన్నారు. జులై 9న కేంద్ర కార్మిక సంఘాలు, సమాఖ్యలు నిర్వహించిన విజయవంతమైన అఖిల భారత సార్వత్రిక సమ్మె దాదాపు 80 శాతం మంది ఆశా కార్మికులు పాల్గొన్నారని తెలిపారు. ఇది దేశంలోని ఆశా కార్మికులు, సహాయకుల స్థిరమైన పోరాటాలకు స్పష్టమైన విజయమని అన్నారు. ఆశా వర్కర్లు, ఫెసిలిటేటర్ల ఐక్య పోరాటాలకు అభినందనలు తెలిపారు. ఆగస్టు 18న కేరళలోని తిరువనంతపురంలో జరిగే జాతీయ ర్యాలీలో ఎడబ్ల్యుఎఫ్ఎఫ్ఐ భవిష్యత్తు కార్యాచరణను ప్రకటిస్తుందన్నారు.

అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తులు వర్మ, శేఖర్ యాదవ్‌లపై అభిశంసన!

5



ఫర్నీచర్ షాపు యజమానితో మాట్లాడుతున్న విద్యుత్ శాఖ అధికారులు

పరుగులు తీసిన విద్యుత్ అధికారులు

- 'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్మార్ట్ మీటర్ల వల్ల ప్రజలపై పడుతున్న భారాలపై 'ప్రజాశక్తి'లో ఆదివారం ప్రచురితమైన "స్మార్ట్‌గా వాత" అనే కథనానికి విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. ఆ కథనంలో పేర్లు ఉన్న విజయనగరంలోని వినియోగదారుల షాపుల వద్దకు ఎడిఇ కిరణ్‌కుమార్, ఎఇ నారాయణరావు పరుగులు పెట్టారు. దుర్గమ్మ టైలరింగ్ షాపు, అశోక్‌కుమార్ ఫర్నీచర్ షాపు, నర్సింహమూర్తి ఫ్రూట్ జ్యూస్, అబ్దుల్ షహీద్ పాన్‌షాపు వద్దకు వెళ్లి, వారి బిల్లులు పరిశీలించారు. కేవలం స్మార్ట్ మీటర్ల వల్ల బిల్లులు పెరగలేదని వారికి వివరణ ఇచ్చారు. దీంతో గతం కన్నా యూనిట్ల వాడకం తగ్గినా బిల్లు ఎందుకు పెరిగిందని వినియోగదారులు వారిని ప్రశ్నించారు. గతంలో ఎన్ని యూనిట్లు వాడితే బిల్లు ఎంత వచ్చింది? స్మార్ట్ మీటర్లు వినియోగించాక వచ్చిన బిల్లు మొత్తంలో వ్యత్యాసాన్ని అధికారులు.. వినియోగదారులకు వివరించే ప్రయత్నం చేశారు. సర్‌ఛార్జీల వల్ల బిల్లులు పెరిగాయని, అదనంగా విద్యుత్ ఛార్జీ మొత్తం పెరగడం లేదని నచ్చజెప్పేందుకు చూశారు. వినియోగదారులు అసంతృప్తి వ్యక్తం చేయడంతో అధికారులు వెనుతిరిగారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

సంతానం ముసుగులో మోసం

- సృష్టి టెస్ట్‌ట్యూబ్ సెంటర్ బండారం బయటపెట్టిన పోలీసులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంతానంలేని దంపతులకు మాయమాటలతో ఆశచూపి లక్షల రూపాయలు దండుకుంటున్న సికింద్రాబాద్‌లోని సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ బండారాన్ని పోలీసులు బైటపెట్టారు. సరైన అనుమతులు లేకుండా సెంటర్ నిర్వహిస్తున్నారని సికింద్రాబాద్ డిసిపి రష్మీ పెరుమాళ్ తెలిపారు. ఆ ఆస్పత్రి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లకు 2021లోనే గడువు తీరిందని చెప్పారు. టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ వ్యవహారంపై ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో పలు విషయాలను డిసిపి వెల్లడించారు. డిసిపి తెలిపిన వివరాల ప్రకారం.. ఆస్పత్రి నిర్వాహకులు డాక్టర్ నమ్రత పలువురిని మోసగించారని చెప్పారు. 'సంతానం కలగని విశాఖకు చెందిన దంపతులకు పలు పరీక్షలు నిర్వహించి ఐవిఎఫ్ సాధ్యం కాదని.. సరోగసీ ద్వారా పొందవచ్చని, దానికి రూ.30 లక్షలు ఖర్చు అవుతుందంటూ వారిని ఒప్పించానని నమ్రత చెప్పారు. దంపతుల నుంచి అండం, వీర్యం సేకరించి సరోగసీ చేస్తున్నామని నమ్మబలికారు. విశాఖలోని ఓ గర్భిణిని సరోగసీ మదర్ అని చూపించారు. కొన్నాళ్ల తర్వాత విశాఖ ఆస్పత్రిలో ఓ బాబును ఆ దంపతులకు ఇచ్చారు. సరోగసీకి అంగీకరించిన మహిళ అదనంగా డబ్బు అడుగుతున్నారనడంతో మరికొంత డబ్బులు కూడా ఆ దంపతులు ఇచ్చారు. ఈ కేసులో నమ్రత అసలు సరోగసీ చేయకుండా శిశువు వద్దనుకున్న అస్సాంకు చెందిన ఒక మహిళకు రూ.90 వేలు చెల్లించారు. ఆమెకు శిశువు పుట్టగానే ఆ దంపతులకు ఇచ్చారు. ఆ తర్వాత దంపతులకు అనుమానం వచ్చి డిఎన్ఎ టెస్టు చేయించారు. ఈ క్రమంలో శిశువు ఆ దంపతులకు చెందినది కాదని తేలింది'.

'సృష్టి' లో డాక్టర్లు నిపుణులు కాదు

"సృష్టి టెస్ట్ ట్యూబ్ సెంటర్ నిర్వాహకులు చాలా నిబంధనలు ఉల్లంఘించారని డిసిపి తెలిపారు. మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ లేకుండా అక్రమంగా నిర్వహిస్తున్నారని, దీనిపై కోర్టులో కేసులు నడుస్తున్నాయని, ఆస్పత్రిని మూసివేస్తున్నట్లు కోర్టుకు చెప్పారని వివరించారు. ఆస్పత్రిని చాటుమాటుగా నిర్వహిస్తున్నందున అధికారులు గుర్తించలేకపోయారన్నారు. ఇది సరోగసీ కాదు.. చైల్డ్ ట్రాఫికింగ్. న్యాయవాదినని చెప్పుకొని నమ్రత కుమారుడు జయంత్ కృష్ణ బాధితులను బెదిరించారని తెలిపారు. ఈ వ్యవహారంపై కేసు నమోదు చేశామని,ఎనిమిది మంది నిందితులను అరెస్ట్ చేశామని డిసిపి రష్మీ పెరుమాళ్ వివరించారు.

ఇళ్లకూ ఎడాపెడా స్మార్ట్ మీటర్లు

- గుట్టుగా మార్చుతున్న అదాని సిబ్బంది
- పరిశ్రమలకు, వాణిజ్య కనెక్షన్లకే పెట్టాలని ఆదేశాలిచ్చాం : విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి

ప్రజాశక్తి- ఒంగోలు బ్యూరో

స్మార్ట్ మీటర్లు. ఇవి ఇప్పుడు అందరిలో పెద్ద చర్చగా మారాయి. ఇప్పటికే పెట్టిన చోట్ల బిల్లులు భారీగా వస్తున్నట్లు వినియోగదారులు గగ్గోలుపెడుతున్నారు. స్మార్ట్ మీటర్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం వ్యూహాత్మకంగా ముందుకుపోతోంది. వాణిజ్య, పరిశ్రమల కనెక్షన్లకు మాత్రమే ముందుగా వీటిని పెట్టాలని ఆదేశించినట్లు చెప్తోంది. స్మార్ట్ మీటర్ల కాంట్రాక్టును అదాని సంస్థకు ఇచ్చింది. ఇప్పుడు ఆ కంపెనీ మీటర్లను మార్చుతోంది. ఇందుకోసం సిబ్బందిని పెట్టుకుంది. వీళ్ల వాణిజ్యం, పరిశ్రమల కనెక్షన్లను గుర్తించి వాటికి స్మార్ట్ మీటర్లు పెట్టేశారు. ఇప్పుడు ఒంగోలు నగరంలో ఇళ్లకూ స్మార్ట్ మీటర్లు పెడుతున్నారు. ఈ నగరం కేంద్ర ప్రభుత్వ అమృత్ పథకంలో ఉంది. ఈ పథకం కింద ఉన్న పట్టణాల్లో స్మార్ట్ మీటర్లు పెట్టాలని కేంద్రం షరతులు ఉన్నాయి. అదాని సిబ్బంది ఇళ్లకు వచ్చి గుట్టుగా మీటర్లు పెట్టిపోతున్నారు. ఇళ్లలో జనం ఉంటే సమాచారం ఇస్తున్నారు. లేకుంటే మీటర్లు తీసుకొచ్చి బిగించేస్తున్నారు. ఒంగోలు నగరంలో ఇప్పటికే 15 వేల ఇళ్లకు స్మార్ట్ మీటర్లు పెట్టారు. ఒకవైపు వీటి ప్రమాదాన్ని వామపక్షాలు ఇప్పటికే ప్రజల్లోకి తీసుకుపోయాయి. వీటిని వ్యతిరేకించాలని పిలుపునిచ్చాయి. టిడిపి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించింది. ఇప్పుడు అధికారంలో వచ్చాక అప్పట్లో తాము వ్యవసాయ కనెక్షన్లనే వద్దన్నామని ఇప్పుడు బుకాయిస్తోంది. వాటికి మినహాయించి ఇప్పుడు వాణిజ్య పరిశ్రమలతోపాటు ఇళ్లకూ పెట్టాలని నిర్ణయించింది. స్మార్ట్ మీటర్లు పెట్టిన కొన్ని వాణిజ్య కనెక్షన్లకు బిల్లులు ఎక్కువగా వస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదులు అందుతున్నాయి. అధికారులకు కూడా వీటిని ఏంచేయాలో తెలియడం లేదు. స్మార్ట్ మీటర్లను పరిశీలించే యంత్రాంగం గానీ, పర్యవేక్షణగానీ ఇప్పుడు విద్యుత్ శాఖ పరిధిలో ఎంతమేరకు ఉందనేదీ స్పష్టత లేదు. అంతా స్మార్ట్ మీటర్లు



పెట్టే అదాని కంపెనీనే చూసుకుంటుందని చెబుతున్నారు.

వాణిజ్యం, పరిశ్రమలకే పెట్టాలని ఆదేశాలిచ్చాం : విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి

స్మార్ట్ మీటర్లను తొలుత వాణిజ్యం, పరిశ్రమల కనెక్షన్లకే పెట్టాలని ఆదేశాలు ఇచ్చామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్... 'ప్రజాశక్తి'కి తెలిపారు. ఇళ్లకు పెట్టే విషయమై ఇంకా పూర్తి స్థాయిలో ఆదేశాలు ఇవ్వలేదన్నారు. ఒకవేళ పెట్టినా వినియోగదారులు, విద్యుత్ శాఖ సిబ్బందితో కలిసి సమావేశం ఏర్పాటు చేసి వారికి అవగాహన కల్పించాకే పెట్టాలని సూచించామని చెప్పారు. అయితే, అలా చేయడం లేదని తమ దృష్టికి వచ్చిందన్నారు. వీటిపై పరిశీలించాలని విద్యుత్ శాఖ ఉన్నతాధికారులకు సూచించామని తెలిపారు. వ్యవసాయ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు పెట్టడం లేదన్నారు.

అమృత పథకంలో ఉన్నందునే పెడుతున్నాం : విద్యుత్ శాఖ ఎస్ఇ

ఒంగోలు నగరం కేంద్రం అమలు చేస్తో అమృత్ పథకంలో ఉన్నందునే ఇక్కడ ఇళ్లకూ స్మార్ట్ మీటర్లు పెడుతున్నామని విద్యుత్ శాఖ ఎస్ఇ కట్టా వెంకటేశ్వర్లు తెలిపారు. అయితే, తొలుత సంపన్న కాలనీల్లోనే పెట్టాలని సూచించామన్నారు. స్మార్ట్ మీటర్లు పెట్టే కంపెనీ సిబ్బంది కొన్ని మురికివాడల్లోనూ పెట్టారని తెలిపారు. విషయం తెలుసుకుని పేదల కాలనీల్లో నిలుపుదల చేశామన్నారు. అధిక బిల్లులు వస్తున్నాయనే ఫిర్యాదులపైనా పరిశీలన చేస్తున్నామని తెలిపారు. వాణిజ్య కనెక్షన్లలో పిండి మరలు పెట్టుకున్న వారికి ప్యానల్ బోర్డులు, కెపాసిటర్లు సరిగాలేక కొంతమందికి బిల్లులు ఎక్కువగా వచ్చాయని ఫిర్యాదులు అందాయన్నారు. వాటిని పరిశీలిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే స్మార్ట్ మీటర్లు పెట్టిన కొన్ని కనెక్షన్లకు పాత మీటర్లను కూడా ఉంచి బిల్లుల్లో తేడాలేమైనా ఉన్నాయా? అనేది గమనిస్తున్నామన్నారు. స్మార్ట్ మీటర్లు నగరంలో అభివృద్ధి చెందిన కాలనీల్లోనే ప్రస్తుతం పెట్టాలని ఆదేశాలు ఇచ్చామని చెప్పారు.

నెల్లూరు జిల్లా తోటపల్లి గూడూరు మండలం ఇసుకపాలెం సబ్‌స్టేషన్ల వద్ద నిరసన తెలుపుతున్న సిపిఎం శ్రేణులు

తిరుమలకు కృష్ణా జలాలు

- మంత్రి నిమ్మల

ప్రజాశక్తి- తిరుమల

కృష్ణా జలాలను తిరుమలకు తరలిస్తామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. తిరుమల శ్రీవారిని ఆదివారం తెల్లవారుజామున కుటుంబ సభ్యులతో కలిసి ఆయన దర్శించుకున్నారు. అలిపిరి మెట్ల మార్గం ద్వారా కాలినడకన తిరుమల కొండకు చేరుకొని స్వామివారిని దర్శనం చేసుకున్నారు. అనంతరం మంత్రి నిమ్మల మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం వచ్చాక తిరుమల ఆధ్యాత్మికతను, పవిత్రతను కాపాడేలా చర్యలు తీసుకుంటోందన్నారు. అమరావతి, పోలవరం ప్రాజెక్టులు త్వరితగతిన పూర్తి కావాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని స్వామి వారిని కోరుకున్నట్లు తెలిపారు. హంద్రీనీవా ద్వారా 3850 క్యూసెక్కుల కృష్ణా జలాలతో అడివిపల్లి రిజర్వాయర్‌ను నింపి, హంద్రీనీవా కాలువ ద్వారా భవిష్యత్తులో తిరుపతికి తాగునీరు, పారిశ్రామిక అవసరాలకు నీటిని అందిస్తామని పేర్కొన్నారు. 25 ఏళ్ళ చరిత్రలో మొదటి సారి జులైలో శ్రీశైలం నుంచి కృష్ణా జలాలు విడుదల చేశామని తెలిపారు. శ్రీశైలం నుంచి కృష్ణా జలాలను తీసుకొచ్చి బాలాజీ రిజర్వాయర్లను నింపుతామని, తిరుమలకు వచ్చే యాత్రికులకు తాగునీటి కొరత లేకుండా గోవిందుని చెంతకు తరలిస్తామని మంత్రి నిమ్మల వెల్లడించారు.

ఆలయం ఎదుట మంత్రి నిమ్మల రామానాయుడు

వసతి గృహాల అభివృద్ధిపై చర్చకు సిద్ధమా?

- మంత్రి సవిత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో బిసి వసతి గృహాల అభివృద్ధిపై చర్చకు రావాలని వైసిపి నాయకులకు బిసి సంక్షేమశాఖ మంత్రి ఎస్ సవిత సవాల్ చేశారు. గత ఐదేళ్లలో వసతి గృహాలను నిర్వీర్యం చేశారని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాదిలోనే వసతి గృహాలను అభివృద్ధి చేసినట్లు చెప్పారు. గత ఐదేళ్లలో పెండింగ్‌లో ఉన్న పనులను కూటమి ప్రభుత్వం పూర్తి చేసి, సమస్యలను పరిష్కరించిందని తెలిపారు. డైట్ బిల్లులు, కాస్మోటిక్స్ ఛార్జీలు, వసతి గృహాల మరమ్మతు బిల్లులు చెల్లించామన్నారు. పిల్లలకు యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, వసతి గృహాల విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. ఐదేళ్లపాటు బిసి వసతి గృహాలను గాలికి వదిలేసిన మాజీ సిఎం జగన్‌కు అధికారం కోల్పోగానే అవి గుర్తుకొచ్చాయని ఎద్దేవా చేశారు.

పి-4లో నిర్బంధిస్తే బహిష్కరిస్తాం : యుటిఎఫ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జిరో పావర్టీ (పి-4) కార్యక్రమంలో విద్యార్థి కుటుంబాలను తప్పనిసరిగా ఉపాధ్యాయులు దత్తత తీసుకోవాలంటూ విద్యాశాఖ అధికారులు నిర్బంధం చేయడాన్ని యుటిఎఫ్ తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో పేదరిక నిర్మూలన పేరుతో ముఖ్యమంత్రి ప్రారంభించిన ఈ పి-4 కార్యక్రమంలో సంపన్నులు ముందుకొచ్చి పేద కుటుంబాలను దత్తత తీసుకోవాలని తెలిపారు. అయితే ఈ కార్యక్రమానికి పెద్దగా స్పందన రాకపోవడంతో ఇప్పుడు ఆ భారాన్ని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులపై నెడుతోందని పేర్కొన్నారు. పి-4 విధానంలో భాగంగా ప్రతి ప్రధానోపాధ్యాయుడు కనీసం 5 కుటుంబాలను, ఉపాధ్యాయుడు 2 కుటుంబాలను తప్పనిసరిగా దత్తత తీసుకుని ఆన్‌లైన్ రిజిస్టర్ చేయాలని ఉపాధ్యాయులకు విద్యాశాఖ అధికారులు లింకులు పంపి రెండు రోజుల్లో ప్రక్రియ పూర్తి చేయాలని పదే పదే ఒత్తిడి చేస్తున్నారని వివరించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా ఇప్పటి వరకు ఒక్క డిఎ కూడా మంజూరు చేయలేదని తెలిపారు. 12వ పిఆర్‌సి కమిషనర్‌ను నియమించలేదని, ఉద్యోగులకు చెల్లించాల్సిన రూ.20 వేల కోట్ల బకాయిలు అంచేందుకు రూట్ మ్యాప్ ప్రకటించలేదని విమర్శించారు.

కనీసం ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై సంఘాలతో చర్చించింది లేదని పేర్కొన్నారు. ఇటీవల బదిలీల్లో సర్దుబాటుకు గురై దాదాపు 2 నెలలుగా జీతాలు పొందలేకపోతున్న ఉపాధ్యాయుల సమస్యను పరిష్కరించలేదని తెలిపారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులు ముందుగా పేద కుటుంబాలను దత్తత తీసుకుని ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఆ తర్వాత మాత్రమే కిందిస్థాయి ఉద్యోగులను అడగాలన్నారు. ఇప్పటి వరకు ఏ ఒక్కరూ ఏ ఒక్క కుటుంబాన్ని దత్తత తీసుకున్న దాఖలాలు కనబడటం లేదని పేర్కొన్నారు. కానీ ఉద్యోగులు, ఉపాధ్యాయులను పేద కుటుంబాలను దత్తత తీసుకోవాలని ప్రభుత్వం నిర్బంధించడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. ప్రభుత్వం పిలుపునిచ్చినా.. ఇవ్వకపోయినా ఉపాధ్యాయుల్లో అనేక మంది పేద విద్యార్థుల అభ్యున్నతికి పాటుపడుతున్నారని, ఉపాధ్యాయ సంఘాలు కూడా వరదలు, అగ్ని ప్రమాదాలు, కోవిడ్ వంటి వివిధ సందర్భాల్లో ప్రజలకు ప్రభుత్వం కంటే ఎక్కువ సహకారం అందించిన సందర్భాలు ఉన్నాయని గుర్తు చేశారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఎవరైనా స్వచ్ఛందంగా పి-4 కార్యక్రమంలో భాగస్వాములైతే హర్షిస్తామని తెలిపారు. అంతే తప్ప ఉపాధ్యాయులపై ఒత్తిడి చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ఉపాధ్యాయులపై నిర్బంధం చేస్తే పి-4 కార్యక్రమాన్ని బహిష్కరించాలంటూ పిలుపు ఇవ్వడానికి వెనుకాడబోమని హెచ్చరించారు.

బలవంతపు రిజిస్ట్రేషన్లు నిలిపివేయాలి : పిడిఎఫ్ ఎమ్మెల్సీ గోపిమూర్తి

పి-4 మార్గదర్శకులుగా ఉపాధ్యాయుల బలవంతపు రిజిస్ట్రేషన్లను నిలుపుదల చేయాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ బి గోపిమూర్తి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పి-4లో వలంటీర్‌గా మార్గదర్శకులుగా రిజిస్టర్ అవ్వొచ్చని తెలిపారని పేర్కొన్నారు. కానీ రాష్ట్రంలో కొంతమంది కలెక్టర్లు, డిఇఒలు.. ఉపాధ్యాయులు మార్గదర్శకులుగా రిజిస్టర్ కావాలని మెసేజులు, సర్క్యులర్ల రూపంలో ఒత్తిడి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బలవంతంగా రిజిస్టర్ చేసుకోవాలనడం సరికాదని, వెంటనే అటువంటి వాటిని నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఉపాధ్యాయ సంఘాలను కలుపుకుని ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

నిర్మాణ కార్మికుల సంక్షేమానికి కొరవడిన చిత్తశుద్ధి

- ఎపి బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని, సంక్షేమ పథకాలు చిత్తశుద్ధితో అమలు చేయాలని ప్రభుత్వాన్ని ఎపి బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టియు) డిమాండ్ చేసింది. ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి జి హరికృష్ణారెడ్డి అధ్యక్షతన విజయవాడ గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్ర సదస్సు ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఐఎఫ్‌టియు రాష్ట్ర కార్యదర్శి ఎం రామకృష్ణ మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను చిత్తశుద్ధితో అమలు చేస్తామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. 1996లో ఏర్పడిన సంక్షేమ బోర్డులో నేటికీ 29.56 కోట్ల మంది కార్మికులు సంక్షేమ బోర్డుకు కట్టిన డబ్బులు రూ.98 వేలకో ట్లయితే వాటిలో కేవలం రూ.38 వేల కోట్లు ఖర్చు పెట్టినట్లు పార్లమెంట్లో కార్మికశాఖ మంత్రి ప్రకటించారన్నారు. రాష్ట్రంలో కార్మికులు సంక్షేమ బోర్డుకు చెల్లించిన నిధులు వందల కోట్లు ఉన్నా.. సంక్షేమ పథకాలు అమలు చేయడంలో చిత్తశుద్ధి కొరవడిందని విమర్శించారు. ఈ సదస్సులో రాష్ట్ర నాయకులు షేక్ మీరావళి, కెవి రమణ, కొప్పుల కుమార్, రవీంద్ర, చారి, కాళీ, మధు, మోహన్, అరుణోదయ శ్రీను, పిబోడబ్ల్యు నగర అధ్యక్షులు ఆసియా, కనకారావు, నాని, క్రాంతి పాల్గొన్నారు.

వడ్డెర్లు అన్ని రంగాల్లో ఎదగాలి..

వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రథమ మహాసభలో వక్తలు

ప్రజాశక్తి - నెల్లూరు ప్రతినిధి

వడ్డెరులు విద్య, వ్యాపారం, రాజకీయం, సామాజిక, ఆర్థిక రంగాల్లో ఎదగాలని వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ గుంజి దయాకర్ అన్నారు. రెండు రోజులపాటు జరగనున్న ఆ సంఘం రాష్ట్ర ప్రథమ మహాసభ నెల్లూరులో నగరంలో ప్రారంభమైంది. ఆదివారం ఉదయం స్థానిక విఆర్‌సి సెంటర్ నుంచి ఆర్‌టిసి సమీపంలోని ఏనుగు సుందరామిరెడ్డి ఆడిటోరియం వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ జరిగిన సభకు రాష్ట్ర నాయకులు చల్లా వెంకటయ్య అధ్యక్షత వహించారు. అనంతరం జరిగిన ప్రారంభ సభలో దయాకర్ మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు పూర్తయినా వడ్డెరలపై సామాజిక దాడులు, దౌర్జన్యాలు కొనసాగుతూనే ఉన్నాయన్నారు. ఇటీవల చిత్తూరులో వడ్డెర కుటుంబానికి చెందిన మహిళపై అత్యాచారం చేసి, హత్య చేసి బావిలో పడేసిన ఘటన, నెల్లూరు జిల్లా అల్లూరులో డిగ్రీ చదివిన ఓ బాలికపై అత్యాచారం చేసి హత్య చేసి చెరువుల్లో పూడ్చి పెట్టిన ఘటన, గుంటూరులో నాలుగేళ్ల చిన్నారిపై అత్యాచార ఘటనలను ఆయన ప్రస్తావించారు. వీటిని అరికట్టేందుకు వడ్డెర వృత్తిదారుల భద్రతకు సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యమాల పురిటిగడ్డ నెల్లూరులో తొలి రాష్ట్ర మహాసభ జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఎం భాస్కరయ్య మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో టిడిపి కూటమి నేతలు ఇచ్చిన హామీల అమలు కోసం నేడు వృత్తిదారులు ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఒసిసిఐ జాతీయ గౌరవ సలహాదారులు గుంజి నరసింహారావు, వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షులు కె. వెంకటేశ్వర్లు, ఆహ్వాన సంఘం అధ్యక్షులు ఎం. రామ్ ప్రసాద్, ప్రొఫెసర్ శివరాం, మహిళా నాయకురాలు లక్ష్మీదేవమ్మ, ఒసిసిఐ రాష్ట్ర అధ్యక్షులు శీనయ్య, బెల్లంకొండ శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

మహాసభ ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న రాష్ట్ర కన్వీనర్ గుంజి దయాకర్

సిపిఎం నాయకులు జివిబి కుమార్‌ను అరెస్ట్ చెస్తున్న పోలీసులు

కరేడులో కొనసాగుతున్న అరెస్టులు

- ఖండించిన ప్రజా సంఘాలు

ప్రజాశక్తి-కందుకూరు, ఉలవపాడు (నెల్లూరు జిల్లా)

నెల్లూరు జిల్లా కరేడులో అక్రమ అరెస్టులు కొనసాగుతున్నాయి. బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమంలో ఉన్న ప్రజా సంఘాల నాయకులు, సిపిఎం ఉలవపాడు ప్రాంతీయ కమిటీ కార్యదర్శి జివిబి కుమార్‌ను ఆదివారం తెల్లవారుజామున పోలీసులు అరెస్టు చేశారు. ఉలవపాడు మండలం కరేడులోని రామకృష్ణాపురంలో ముగ్గురు గిరిజన మహిళలను శుక్రవారం అర్ధరాత్రి అక్రమంగా అరెస్టు చేసి జైలుకు పంపిన విషయం తెలిసిందే. కరేడు ఉద్యమానికి మద్దతు తెలిపేందుకు బిసివైఎం పార్టీ అధినేత బోడే రామచంద్ర యాదవ్ ఆదివారం కరేడు పర్యటనకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ఆ కార్యక్రమానికి సిపిఎం నాయకులు జివిబి కుమార్ జనాన్ని సమీకిస్తున్నారనే కారణంతో కందుకూరు పోలీసులు ఆయనను తెల్లవారుజామున 4.30 గంటలకు అరెస్టు చేసి సాయంత్రం 6 గంటల వరకు పోలీసు స్టేషన్‌లోనే ఉంచారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

రామచంద్ర యాదవ్‌ను నిర్బంధించిన పోలీసులు

కరేడు ఉద్యమానికి మద్దతు తెలపడానికి ఆదివారం ఉదయం తన ఇంటి నుంచి బయలుదేరిన బిసివైఎం అధ్యక్షులు బోడే రామచంద్రయాదవ్‌ను పోలీసులు నిర్బందించారు. గిరిజన మహిళలను అరెస్ట్ చేసి జైలుకు పంపిన నేపథ్యంలో అక్కడ రైతుల్లో మనోధైర్యం నింపేందుకు ఆయన తన అనుచరులతో కలిసి బయలు దేరారు. నెల్లూరు సమీపంలోని వెంకటాచలం టోల్ ప్లాజా వద్ద రామచంద్రయాదవ్‌ను పోలీసులు అడ్డుకున్నారు. తాను రైతులను కలవడానికి వెళుతున్నానని, అనుమతించాలని కోరినా పోలీసులు ఒప్పుకోలేదు. దీంతో కొద్దిసేపు పోలీసులకు, రామచంద్రాయాదవ్‌కు మధ్య వాగ్వివాదం జరిగింది. అనంతరం అక్కడ నుంచి ఆయనను తన స్వగ్రామానికి పంపారు.

పోలీస్ నిర్బంధాన్ని ఆపండి

- నాయకులను వెంటనే విడుదల చేయండి
- సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నెల్లూరు జిల్లా కరేడులో పోలీస్ నిర్బంధాన్ని ఆపాలని సిపిఎం రాష్ట్రకమిటీ డిమాండ్ చేసింది. ఇండోసోల్ కంపెనీకి బలవంతంగా రైతుల భూములను ధారాదత్తం చేయాలన్న రాష్ట్రప్రభుత్వ నిర్ణయాన్ని ప్రతిఘటిస్తున్న రైతులు, వ్యవసాయ కార్మికులు, గిరిజనులు, దళితులపై పోలీసులు విధించిన నిర్బంధాన్ని ఆ పార్టీ రాష్ట్రకార్యదర్శి వి శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. 30(ఎ) యాక్ట్‌ను తక్షణమే ఉపసంహరించుకొని అరెస్టు చేసిన నాయకులను విడుదల చేయాలని కోరారు. ఇప్పటికే ఒకసారి ప్రజాభిప్రాయ సేకరణ జరిగిందని, ప్రజలు ఏకగ్రీవంగా తిరస్కరించారని తెలిపారు.అయినా దొడ్డిదారిన తిరిగి ఆ ప్రజాభిప్రాయాన్ని తారుమారు చేసేందుకు తెరవెనుక కుట్రలు సాగుతున్నాయనియ పేర్కొన్నారు. అందులో భాగంగానే ఎవరికి తెలియకుండా మరో ప్రజాభిప్రాయ సేకరణ చేసే ప్రయత్నాన్ని ప్రజలు వమ్ము చేశారని తెలిపారు. దీన్ని సహించలేని ఎమ్మెల్యే కంపెనీ ప్రతినిధులతో కలిసి ప్రజల మధ్య ప్రలోభాలు, తగాదాలు పెట్టి చీల్చేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. కరేడు గ్రామపంచాయతీ పరిధిలోని రామకృష్ణాపురంలో జరిగిన మహిళల మధ్య చిన్న వివాదాన్ని ఆసరా చేసుకొని గ్రామ మహిళా నాయకులపై దుర్మార్గంగా హత్యాప్రయత్నం కేసు పెట్టి రిమాండ్‌కు పంపారని తెలిపారు. శనివారం ప్రజలందరూ ఐక్యమై ధర్నా చేయటంతో సెక్షన్ మారుస్తామని హామీ ఇచ్చారన్నారు. ఆ ఘటన ముగిసినప్పటికీ ఆదివారం తెల్లవారుజామున సిపిఎం మండల నాయకులు కుమార్‌తో సహా కొంతమంది ఉద్యమ నాయకులను అరెస్టు చేశారని తెలిపారు. గ్రామంలో 30ఏ పోలీస్ యాక్ట్ పెట్టి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ మైక్ ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. సభలు, సమావేశాలు, నిషేధించారని పేర్కొన్నారు. బయట నుంచి రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నాయకలు ఆ ప్రాంతాన్ని సందర్శించకుండా కట్టడి చేస్తున్నారని వివరించారు. ఈనిర్బంధ చర్యలను సిపిఎం తీవ్రంగా ఖండిస్తున్నట్లు వెల్లడించారు. ఈ అప్రజాస్వామిక పద్ధతులకు స్వస్తి చెప్పి గ్రామ ప్రజల మనోభావాలను పరిగణనలోకి తీసుకొని తక్షణం ఇండోసోల్ కంపెనీకి ఇవ్వదలచిన భూముల అక్రమ కేటాయింపులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

అక్రమ కేసులు తొలగించాలి : రైతు సంఘం డిమాండ్

నెల్లూరు జిల్లా కరేడు గిరిజన మహిళలపై పెట్టిన అక్రమ కేసులు రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. కరేడు భూ పోరాట ఉద్యమాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రజలను చీల్చే ప్రయత్నంలో భాగంగానే ప్రభుత్వం చేస్తున్న కుట్రలను తిప్పి కొట్టండని సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వి కృష్ణయ్య, కె ప్రభాకరరెడ్డి.. కరేడు ప్రజలకు ఆదివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఈ కేసులను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

పాలిటెక్నిక్‌లో 34,084 సీట్లు ఖాళీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పాలిసెట్-2025లో 34,084 సీట్లు భర్తీ కాలేదు. అడ్మిషన్లకు సంబంధించిన కౌన్సెలింగ్ తుది దశ ప్రక్రియ ముగిసింది. తుది దశ అడ్మిషన్ల వివరాలను పాలిసెట్ అడ్మిషన్ల కన్వీనర్ జి గణేష్‌కుమార్ ఆదివారం విడుదల చేశారు. మొత్తం 79,367 కన్వీనర్ సీట్లకు 45,283 సీట్లు భర్తీ అయ్యాయి. రాష్ట్రంలో మొత్తం 253 పాలిటెక్నిక్ కళాశాలలున్నాయి. వీటిల్లో 84 ప్రభుత్వ, 165 ప్రైవేట్ కళాశాలలు డిప్లమో కోర్సులు అందిస్తున్నాయి.

ప్రశ్నించే గొంతులను నులిమే యత్నం

- అత్యాచార వ్యతిరేక ఐక్య వేదిక ఆందోళన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పెద్దాపురంలో లైంగిక వేధింపులకు గురై 5 నెలలుగా విముక్తి కోసం పోరాడుతున్న యువతికి అండగా నిలబడే ప్రశ్నించే గొంతులను నులిమే ప్రయత్నం ప్రభుత్వం చేస్తుండటం దుర్మార్గమని అత్యాచార వ్యతిరేక ఐక్యవేదిక పేర్కొంది. ఈ మేరకు ఆదివారం ఐక్య వేదిక నాయకులు డి రమాదేవి, పి దుర్గా భవాని, సుంకర పద్మశ్రీ, సల్మా, పి పద్మ ఒక ప్రకటన విడుదల చేశారు. బాధితురాలి తరపున గొంతు వినిపించిన యూట్యూబర్‌పై అధికారపక్ష నేతలకు ఆగ్రహం కలిగిందన్నారు. వ్యభిచార గృహ నిర్వాహకులతో చేతులు కలిపిన ఇద్దరు కానిస్టేబుల్స్‌ను సస్పెండ్ చేశారని తెలిపారు. బాధిత యువతికి రక్షణ కల్పించాలని, కేసు విచారణ కోసం సిట్ వేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లైంగిక దోపిడీకి గురైన యువతులు గౌరవంగా జీవించేందుకు ఉద్యోగాలు కల్పించాలన్నారు.

నిలకడగా గోదావరి వరద

ప్రజాశక్తి - యంత్రాంగం

గత రెండు రోజులుగా పెరుగుతూ వచ్చిన గోదావరి నిలకడగా ప్రవహిస్తోంది. భద్రాచలం వద్ద శనివారం రాత్రి 35.60 అడుగుల నీటిమట్టం ఉన్న గోదావరి స్వల్పంగా తగ్గుతూ ఆదివారం సాయంత్రానికి 35.20కి చేరింది. ఎగువున, స్థానికంగా వర్షాలు తగ్గుముఖం పట్టడంతో గోదావరి నది ప్రవాహం ప్రస్తుతం స్థిరంగా ఉంది. అయితే, కుక్కునూరు-దాచారం మధ్య గుండేటి వాగుపై ఉన్న కాజ్‌వే ఇంకా ముంపులోనే ఉంది. దీంతో గత రెండు రోజులుగా వాగు అవతల ఉన్న 12 గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వేలేరుపాడు మండలంలో లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఎడవల్లి వద్ద ఉన్న కాజ్ వే మునిగిపోవడంతో సుమారు 20 గ్రామాలకు రహదారులు దిగ్బంధమై రవాణా సౌకర్యం లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. పోలవరం ప్రాజెక్టు వద్ద 6,89,259 క్యూసెక్కుల గోదావరి జలాలను జలవనరుల శాఖాధికారులు స్పిల్ వే నుంచి దిగువకు విడుదల చేశారు.

ప్రస్తుతం పోలవరం వద్ద నీటిమట్టం 10.41 మీటర్లుగా నమోదైనట్లు అధికారులు తెలిపారు. వరద ప్రవాహం పెరగకున్నా పోలవరం నిర్వాసిత మండలాల వాసుల్లో మాత్రం భయాందోళన తొలగిపోలేదు. విఆర్.పురం మండలంలోని శ్రీరామగిరి, వడ్డిగూడెం, వడ్డిగూడెం కాలనీ, ధర్మతాళ్లగూడెం ప్రాంతాల వాసులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. వరద పెరిగితే గుట్టలపైకి, సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోయేందుకు వారంతా ఇప్పటికే పాకలు, గుడారాలు సిద్ధం చేసుకున్నారు. దేవీపట్నం మండలంలోని గండి పోచమ్మ ఆలయ శిఖరం వరకూ గోదావరి నీరు చేరింది.

జయంతి ఎక్స్‌ప్రెస్ రైలులో పొగలు

ప్రజాశక్తి - నందలూరు (అన్నమయ్యజిల్లా)

కన్యాకుమారి నుంచి పూణే వెళ్తున్న జయంతి ఎక్స్‌ప్రెస్ రైలు కింద భాగంలో పొగలు వచ్చాయి. రైల్వే, ఫైర్ సిబ్బంది గుర్తించి పొగలను అదుపులోకి తెచ్చారు. ఈ సంఘటన అన్నమయ్య జిల్లా నందలూరు వద్ద ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. ప్రయాణికులు, రైల్వే సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. జయంతి ఎక్స్‌ప్రెస్ రైలు కన్యాకుమారి నుంచి పూణేకు బయలు దేరింది. నందలూరు సమీపంలోని హస్తవరం వద్దకు చేరుకోగానే థర్డ్ ఏసి కోచ్ నెంబర్ (22324) భోగి కింద పొగలు రావడాన్ని స్టేషన్ సిబ్బంది గమనించి వెంటనే నందలూరు స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. అప్రమత్తమైన నందలూరు స్టేషన్ మేనేజర్ కమలాకర్, స్టేషన్ మాస్టర్ మురళీమోహన్ రైలును నందలూరు రైల్వే గేట్ వద్ద నిలిపివేశారు. రైల్వే సిబ్బంది రైలును క్షుణ్ణంగా తనిఖీ నిర్వహించారు. రాజంపేట అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పొగలను అదుపు చేశారు. బి-2 ఎసి కోచ్ బ్రేక్‌లు సరిగా రిలీజ్ కాకపోవడం వల్ల పొగలు వస్తున్నాయని గమనించి మరమ్మతులు చేశారు. రైలుకు ప్రమాదం లేదని చెప్పడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

రూట్ మార్చిన గంజాయి వ్యాపారులు

- విచ్చలవిడిగా అమ్మకాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గంజాయి సాగు చేసే వారితో పాటు రవాణా చేసే వారిపై ఈగల్ టీమ్ నిఘాను తీవ్రతరం చేయడంతో గంజాయి అమ్మకందారులు, రవాణా దారులు రూట్ మార్చారు . గతంలో రవాణాను గతంలో లారీలు, స్కార్పియో లాంటి ప్రైవేట్ వాహనాల్లో ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి తరలిస్తుండగా, ఇప్పుడు కొరియర్ వ్యవస్థ, పార్శిల్స్ రూపేణా రైళ్ల ద్వారా తరలింపు ఎక్కువైనట్లు సమాచారం. ఇందుకు తాజా ఉదాహరణగా విజయవాడ రైల్వే స్టేషన్‌లో ఈనెల 11న ఈగల్ టీమ్, రైల్వే, జిపిఎస్ పోలీసులు కోరమాండల్ ఎక్స్‌ప్రెస్‌ను తనిఖీలు చేయడంతో జార్కండ్‌కు చెందిన ఓ యువకుడు వద్ద ఉన్న గంజాయి చాక్లెట్లను పట్టుకున్నారు. దీంతో ఈగల్ టీమ్, రైల్వే పోలీసులు ఒక్క సారిగా ఉలిక్కిపడ్డారు. మత్తు కలిగించే ఈ చాక్లెట్లు ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, గుజరాత్ నుంచి విజయవాడ, విశాఖపట్టణం, గుంటూరు, తిరుపతి లాంటి నగరాలతో పాటు జిల్లా కేంద్రాల్లోనూ విచ్చలవిడిగా అమ్మకాలు సాగించేందుకు తరలిస్తున్నట్లు సమాచారం. ఈ రకం చాక్లెట్లను విజయవాడ వన్‌టౌన్‌లోని బ్రాహ్మణవీధిలోని ఓ కిరాణా షాపుపై ఈనెల 23న దాడులు నిర్వహించి సుమారు 20 కిలోల బరువు ఉండే 111 ప్యాకెట్లను (ఒక్కో ప్యాకెట్‌లో 40 చాక్లెట్లు) పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

విజయవాడ రైల్వే స్టేషన్‌లో పట్టుకున్న గంజాయి చాక్లెట్లను మీడియాకు చూపిస్తున్న 'ఈగల్' అధిపతి, ఐజి అకె రవికృష్ణ, ఇతర పోలీసు అధికారులు (ఫైల్ ఫోటో)

ఈ కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. ఈనెల 24న వన్‌టౌన్‌లోని రాంగోపాల్ వీధిలో కూడా దాడులు చేసి సుమారు 80 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎవరికి అనుమానం రాకుండా చిన్న చిన్న దుకాణాల్లో సైతం చిన్న పొట్లాలుగా ప్యాక్ చేసి విక్రయిస్తున్నట్లు పోలీస్ దాడులతో వెలుగులోకి వచ్చింది.

కార్పొరేట్ కళాశాలల సమీపాల్లో గంజాయి చాక్లెట్లు అమ్మకాలు

రాష్ట్ర వ్యాప్తంగా గంజాయి చాక్లెట్లు, గంజాయి నింపిన సిగరెట్లు కార్పొరేట్ కళాశాలల సమీపంలోని బడ్డీ కొట్లు కేంద్రంగా జోరుగా అమ్మకాలు సాగుతున్నట్లు సమాచారం. ముఖ్యంగా రాత్రి 8 దాటిన తర్వాత ఆయా బడ్డీకొట్ల వద్ద కళాశాలల్లో చదువుకునే యువకులు గుంపులు గుంపులుగా చేరుతున్నట్లు సమాచారం. గంజాయి అమ్మినా, కొనుగోలు చేసినా కఠిన శిక్షలు ఉంటాయని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పాఠశాలలు , కళాశాలలు, గ్రామాల్లో ఆశించిన స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం లేదనే విమర్శలు వినవస్తున్నాయి.

పొలిటికల్ ఇంటెలిజెన్సే ...

రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో సివిల్ పోలీస్‌తో పాటు స్పెషల్ బ్రాంచ్, ఇంటెలిజెన్సీ వింగ్స్‌కు సంబంధించిన సిబ్బంది ఆయా స్టేషన్ పరిధిలో జరిగే అసాంఘిక కార్యకలాపాల గురించి ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి సమాచారం అందిస్తుంటారు. అయితే, కొంత కాలంగా కీలకమైన . ఆ రెండు విభాగాలు ప్రతిపక్ష నేతలు కదలికలు, రాజకీయ ఆందోళనలపైనే దృష్టి సారిస్తున్నాయని చెబుతున్నారు.

తుంగభద్ర డ్యామ్ నుంచి 30 గేట్ల ద్వారా దిగువకు నీటి విడుదల

తుంగభద్రకు పెరిగిన నీటి ఉధృతి

- 30 గేట్ల ద్వారా 1.40 లక్షల క్యూసెక్కులు విడుదల
- నదీతీర ప్రాంత ప్రజలకు ప్రమాద హెచ్చరికలు జారీ

ప్రజాశక్తి - హోళగుంద/ శ్రీశైలం ప్రాజెక్టు

తుంగభద్ర డ్యామ్‌కు వరద ఉధృతి పెరిగింది. దీంతో డ్యామ్ 30 గేట్ల ద్వారా 1.40 లక్షల క్యూసెక్కుల నీటిని అధికారులు ఆదివారం విడుదల చేశారు. నదీతీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రమాద హెచ్చరికలు జారీ చేశారు. కర్ణాటక రాష్ట్రం శృంగేరి, వర్నాడు, శివమొగ్గ తదితర ప్రాంతాల్లో గత వారం రోజులుగా అధిక వర్షాలు కురుస్తుండడంతో భారీగా వరద నీరు వచ్చి చేరింది. దీంతో, వచ్చిన నీటిని వచ్చినట్టు తుంగభద్ర డ్యామ్ 30 గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం డ్యామ్‌లో నీటి నిల్వ 76 టిఎంసిలుగా ఉంది. అంతకుమించి నీటిని నిల్వ ఉంచుకోకపోవడానికి కారణం డ్యామ్ గేట్లు బలహీనంగా ఉండడమే. డ్యామ్ నీటి నిల్వ సామర్థ్యం 105 టిఎంసిలుగా ఉండగా నీటి పారుదల నిపుణుల సూచనలతో 75 టిఎంసిలకే పరిమితం చేశారు. సోమవారం నాటికి తుంగభద్ర నీరు శ్రీశైలం జలాశయానికి చేరనుంది.

శ్రీశైలం ఆనకట్ట వద్ద సందర్శకుల తాకిడి

శ్రీశైలం జలాశయం నుండి ఒక గేటు ద్వారా నీటిని విడుదల చేస్తుండడంతో శ్రీశైలం డ్యామ్ వద్ద సందర్శకుల తాకిడి పెరిగింది. ఆదివారం సెలవు రోజుతోపాటు శ్రావణమాసం కావడంతో స్వామి అమ్మవార్ల దర్శనార్థం రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్రకు చెందిన యాత్రికులు తరలి వచ్చారు. మల్లన్న దర్శనం అనంతరం తిరుగు ప్రయాణంలో శ్రీశైలం జలాశయం వద్ద కృష్ణమ్మ సోయగాలను తిలకిస్తూ, సెల్ఫీలు తీసుకుంటూ సరదాగా గడిపారు.

త్వరలో వ్యవసాయ యంత్రాల సర్వే

- డైరెక్టర్ ఢిల్లీరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ యంత్రాల సర్వేను త్వరలో ప్రారంభించనున్నట్లు ఆ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. ఈ సర్వేను రైతు సేవా కేంద్రాల్లోని వ్యవసాయ సహాయకులు నిర్వహించనున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో రైతులు, ఎఫ్‌పిఒలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, ప్రైవేటు సంస్థల వద్ద ఉన్న యంత్రాలను సర్వే చేస్తారన్నారు. రాయితీపై లేక సొంత ఖర్చుతో కొనుగోలు చేసిన యంత్రాలైనా సర్వేలో నమోదు చేయనున్నట్లు తెలిపారు. ఈ సర్వేలో వివరాల ఆధారంగా పంట విస్తీర్ణం, పంట కాలం ఆధారంగా గ్రామ స్థాయిలో అవసరమయ్యే వ్యవసాయ యంత్రాల లభ్యతను అంచనా వేయనున్నట్లు చెప్పారు. మూస ధోరణిలో కేటాయింపు విధానం కాకుండా, గ్రామ అవసరాల ఆధారంగా ప్రత్యేక బడ్జెట్ ప్రణాళికలు రూపొందించేందుకు ఈ సర్వే దోహదం చేస్తోందన్నారు. సర్వేలో నమోదు చేసిన వివరాలు వ్యవసాయ సమాచార యాజమాన్య వ్యవస్థ (ఎఫ్ఎంఐఎస్)లో ఎనాలసిస్ చేసి ఫలితాల ఆధారంగా యంత్రాల ప్రణాళిక, పర్యవేక్షణ, బడ్జెట్ కేటాయింపులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇ-సిహెచ్‌సి ఫ్లాట్‌ఫాంలో ఈ సర్వే సమాచారాన్ని అనుసంధానం చేసి, రైతులు యంత్రాలను ఉబెర్ తరహాలో బుక్ చేసుకునే విధానాన్ని అమలు చేయడంపై దృష్టి కేంద్రీకరించామని తెలిపారు.

'పిఆర్‌సి'పై ఉలుకు పలుకు లేని ప్రభుత్వం : ఎస్‌టియు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రభుత్వ ఉద్యోగ, పెన్షనర్లకు పిఆర్‌సి అమలు చేస్తామన్న ప్రభుత్వం ఉలుకు పలుకు లేకుండా ఉందని ఎస్‌టియు విమర్శించింది. 2023 జులై నుంచి రావాల్సిన 12వ పిఆర్‌సి ఇప్పటికే 25 నెలలు ఆలస్యమైందని ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్ సాయిశ్రీనివాస్, మల్లు రఘునాథరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్యోగ, పెన్షనర్లకు 2024 జనవరి నుంచి ఇప్పటి వరకు నాలుగు డిఎలు బకాయి పడిందని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు అయినప్పటికీ ఒక్క డిఎ కూడా మంజూరు చేయకుండా మొండిచేయి చూపిస్తోందని విమర్శించారు. ఆర్థిక బకాయిల చెల్లింపుపై ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని కూడా నిలబెట్టుకోవడం లేదని పేర్కొన్నారు. సిపిఎస్ ఉద్యోగులకు మెరుగైన పెన్షన్ విధానం అమలు చేస్తామని ప్రతి ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇచ్చి అధికారంలోకి రాగానే మొండిచేయి చూపిస్తున్నాయని పేర్కొన్నారు. 2003 డిఎస్‌సి ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలుపై ఆర్థికశాఖ ఉత్తర్వులు ఇవ్వకుండా మీనమేషాలు లెక్కిస్తోందని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి 12వ పిఆర్‌సి కమిటీ ఏర్పాటు చేయాలని, 30 శాతం మధ్యంతర భృతిని చెల్లించాలని, ఆర్థిక బకాయిల చెల్లింపుపై రోడ్ మ్యాప్ ప్రకటించాలని, సిపిఎస్ రద్దు, 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలుపై నిర్ణయం ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఉద్యమ కార్యాచరణకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు.

22 మంది వైద్యులు, నర్సులపై విచారణ

- మంత్రి సత్యకుమార్ ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో: విధి నిర్వహణలో అక్రమాలకు పాల్పడిన వైద్యులు, నర్సులపై చర్యలు తీసుకునేందుకు శాఖాపరమైన విచారణకు వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఆదేశించారు. ఈ మేరకు ఆదివారం ఉన్నతాధికారులకు ఆదేశాలిచ్చారు. అనకాపల్లిలోని ఎన్‌టిఆర్ ప్రభుత్వాస్పత్రిలో 2020లో జరిగిన అవినీతి నిరోధకశాఖ ఆకస్మిక తనిఖీల్లో అక్రమాలు జరిగినట్లు ప్రాథమికంగా వెల్లడైంది. ఆస్పత్రిలో రికార్డులను పూర్తి స్థాయిలో పరిశీలించిన ఎసిబి అధికారులు ఇందుకు సంబంధించి పూర్తి నివేదికను ఈ ఏడాది జూన్‌లో సమర్పించగా, దానిని పరిగణనలోకి తీసుకుని అవినీతి, పాలనా వైఫల్యాలు, పర్యవేక్షణ లోపాలు ఉన్నట్లు మంత్రి పేర్కొన్నారు. ఇన్‌పేషెంట్లపై తప్పుడు లెక్కలు నమోదు చేసినట్లు, మందుల వినియోగాన్ని నర్సులు సరిగ్గా చూపలేదని తేలిందన్నారు. డిసిహెచ్ఎస్‌తోపాటు మరో 9 మంది వైద్యులు, 12 మంది హెడ్ నర్సులపై తక్షణమే విచారణకు ఆదేశించినట్లు తెలిపారు.

తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో యాత్రికులతో కలిసి అన్నప్రసాదం స్వీకరిస్తున్న టిటిడి ఛైర్మన్ బిఆర్. నాయుడు, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు

తిరుమలలో ప్రముఖుల సందడి

శ్రీవారిని దర్శించుకున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, గవర్నర్ నజీర్, సిఎస్ విజయానంద్

ప్రజాశక్తి- తిరుమల

తిరుమల శ్రీవారిని రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, పలువురు ప్రముఖులు ఆదివారం సందర్శించారు. గవర్నర్‌కు టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు, ఇఒ శ్యామలరావు స్వాగతం పలికారు. ఆదివారం ఉదయం విఐపి విరామ సమయంలో ఆయన కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ స్వామివారిని సందర్శించారు. భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు.. టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడుతో కలిసి తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో యాత్రికులతో కలిసి అన్నప్రసాదం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ టిటిడి అందిస్తున్న అన్నప్రసాదం ఎంతో శుచిగా, రుచిగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జె శ్యామలరావు, అదనపు ఇఒ సిహెచ్ వెంకయ్య చౌదరి, డిప్యూటీ ఇఒ లోకనాథం, ఇతర అధికారులు పాల్గొన్నారు. స్వామివారి సేవలో హీరో విజయ్ దేవరకొండతో పాటు నటి భాగ్యశ్రీ భోర్సే కింగ్‌డమ్ టీమ్ పాల్గొంది. అనంతరం విజయ్ మీడియాతో మాట్లాడుతూ స్వామి వారి సన్నిధిలో సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్ చేసుకోవడం సంతోషంగా ఉందని అన్నారు.

రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు స్వాగతం పలుకుతున్న టిటిడి ఈవో జె.శ్యామలరావు

రంగనాయక మండపంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌కు తీర్థప్రసాదాలు అందిస్తున్న టిటిడి ఈవో

ఇండియన్ ఆర్మీలో చేరాలనుకుంటున్నారా...!

పోటీ పరీక్షల ప్రత్యేకం

కె.ఎస్.లక్ష్మణరావు,
మాజీ శాసనమండలి సభ్యులు,
సెల్ : 8309965083

భారత సైన్యం 66వ షార్ట్ సర్వీస్ కమిషన్ (టెక్) ఏప్రిల్ 2026 కోసం రిజిస్ట్రేషన్ ప్రారంభించింది. దరఖాస్తు చేసుకోవడానికి ఆసక్తి ఉన్న అభ్యర్థులు (పురుషులు, మహిళలు) joinindianarmy.nic.in ఈ వెబ్ సైట్‌కు వెళ్లి అప్లై చేయొచ్చు. ఆగస్టు 14, 2025 దరఖాస్తులను సమర్పించడానికి చివరి తేదీ. 379 ఖాళీలను భర్తీ చేయడానికి ఈ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ జరుగుతుంది. అకడమిక్ మెరిట్ ఆధారంగా ఈ ఎంపిక జరుగుతుంది. ముందు అభ్యర్థులు అర్హతలు, వయసు పరిమితి, విద్యార్హతలు, ఎంపిక విధానం వంటి ఇతర ముఖ్యమైన సూచనలు వంటి వివరాలను పూర్తిగా తెలుసుకుంటే మంచిది.

అర్హతలు ఇవే...

- అభ్యర్థులు భారతీయులై ఉండాలి.
- గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుండి ఇంజనీరింగ్ డిగ్రీ పూర్తి చేసి ఉండాలి.
- చివరి సంవత్సరం చదువుతున్న వారు కూడా అర్హులే.
- ఏ రాత పరీక్ష ఉండదు. అకడమిక్ మెరిట్ (మార్కులు, సిజిపిఎ) ఆధారంగా ఎంపిక ఉంటుంది.
- ఎంపికైన అభ్యర్థులకు ఎస్ఎస్‌బి ఇంటర్వ్యూ ఉంటుంది.

వయోపరిమితి: ఏప్రిల్ 1, 2026 నాటికి 20 నుండి 27 సంవత్సరాలు ఉండాలి.

దరఖాస్తులు : షార్ట్ సర్వీస్ కమిషన్ (ఎస్ఎస్‌సి) కోసం అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించండి - www.joinindianarmy.nic.in

- 'ఆఫీసర్ ఎంట్రీ అప్లికేషన్, లాగిన్' పై క్లిక్ చేయండి.
- కొత్తవారైతే 'రిజిస్ట్రేషన్' పై క్లిక్ చేసి వివరాలు నింపి రిజిస్టర్ చేసుకోవాలి.
- ఇప్పటికే రిజిస్టరై ఉంటే లాగిన్ చేయాలి.
- రిజిస్టర్ అయిన తర్వాత, డాష్‌బోర్డ్ కింద 'ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోండి' పై క్లిక్ చేయండి.
- 'ఆఫీసర్స్ సెలక్షన్- అర్హత' అనే పేజీ ఓపెన్ అవుతుంది.
- దరఖాస్తు చేయాలనుకుంటున్న కోర్సు దగ్గర కనిపించే అప్లై బటన్‌పై క్లిక్ చేయాలి.

ఫారం నింపే విధానం :

- ముందుగా సూచనలు జాగ్రత్తగా చదవాలి. తరువాత, కొనసాగించుపై క్లిక్ చేసి అందులోని విభాగాల్లో వివరాలు నింపండి:
- వ్యక్తిగత సమాచారం
- సంప్రదింపు వివరాలు
- విద్యార్హత వివరాలు
- గతంలో ఎస్ఎస్‌బికి హాజరైతే వాటి వివరాలు

- ప్రతి సెక్షన్ పూర్తి చేసిన తర్వాత 'సేవ్ అండ్ కంటిన్యూ' బటన్‌పై క్లిక్ చేయండి.

ఎంపిక విధానం:

- దరఖాస్తుల షార్ట్‌లిస్టింగ్
- ఎస్ఎస్‌బి ఇంటర్వ్యూ - ఇది 5 రోజుల ప్రక్రియ వైద్య పరీక్ష
- ఎంపికైన అభ్యర్థులకు నియామక ఉత్తర్వులు
- మీరిచ్చే వివరాలు పూర్తిగా కరెక్ట్‌గా ఉండాలి.
- అవసరమైన సర్టిఫికెట్లు స్కాన్ చేసి సిద్ధంగా ఉంచుకోండి.

చివరి తేదీ ఆగస్టు 14, 2025.

వాయుసేన ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

భారత ప్రభుత్వానికి చెందిన సికింద్రాబాద్ కమాండింగ్ ఆఫీసర్, అగ్నిపథ్ వాయు కమాండింగ్ నోటిఫికేషన్ విడుదలయ్యింది. మహిళలు, పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు 2005 జూలై రెండో తేదీ నుంచి 2009 జనవరి రెండో తేదీ మధ్య జన్మించిన వారై ఉండాలి. ఇంటర్మీడియట్, డిప్లమో (పాలిటెక్నిక్), ఇంటర్మీడియట్ ఒకేషనల్‌లో 50 శాతం, ఇంగ్లీష్ సబ్జెక్టులో కనీసం 50 శాతం మార్కులు కలిగి ఉన్న వారు అర్హులు. జులై 31వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉంది.ఆసక్తి గల అభ్యర్థులు https://airmenselection.cdac.in, https://agnipatvayu.cdac.in వెబ్‌సైట్ల ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

ఇంటెలిజెన్స్ బ్యూరోలో 3700 ఖాళీలు

కేంద్ర హోంమంత్రిత్వ శాఖ పరిధిలోని ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబి) భారీ నోటిఫికేషన్ విడుదల చేసింది. జులై 19, 2025 నుంచి 3,717 అసిస్టెంట్ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్ (ఎసిఐఒ) గ్రేడ్-2 ఎగ్జిక్యూటివ్ పోస్టుల నియామకానికి దరఖాస్తు ప్రక్రియను ప్రారంభించింది. కేవలం డిగ్రీ అర్హత ఉంటే చాలు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ www.mha.gov.in ని సందర్శించడం ద్వారా 10 ఆగస్టు, 2025 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థులు ఆగస్టు 12, 2025 వరకు ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించొచ్చు.

కేటగిరీల వారీగా ఖాళీల వివరాలు

- జనరల్ - 1,537
- ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారు - 442
- ఓబీసీ - 946
- ఎస్సీ- 566
- ఎస్టీ- 226
- మొత్తం పోస్టులు-3717

విద్యార్హత-వయోపరిమితి :

-అసిస్టెంట్ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్ (ఎసిఐఒ) రిక్రూట్‌మెంట్ 2025కి దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి ఏదైనా విభాగంలో గ్రాడ్యుయేషన్ డిగ్రీని కలిగి ఉండాలి.

- అభ్యర్థులు ఆఫీస్ సంబంధిత పనికి అవసరమైన ప్రాథమిక కంప్యూటర్ పరిజ్ఞానం కూడా కలిగి ఉండాలి.
- అభ్యర్థుల కనీస వయస్సు 18 సంవత్సరాలు.
- గరిష్ఠ వయస్సు 27 సంవత్సరాలు.
- వయస్సు 10 ఆగస్టు 2025 తేదీ ఆధారంగా లెక్కిస్తారు.
- రిజర్వేషన్ అభ్యర్థులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం గరిష్ట వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.

ఫీజు చెల్లింపులు :

జనరల్, ఇడబ్ల్యుఎస్, ఒబిసి వర్గాలకు చెందిన పురుష అభ్యర్థులు దరఖాస్తు రుసుంగా రూ. 650 చెల్లించాల్సి ఉంటుంది. మిగిలిన అన్ని తరగతుల వారికి దరఖాస్తు రుసుం రూ. 550.

ఎంపిక ప్రక్రియ ఇలా :

- అభ్యర్థుల ఎంపిక మూడు దశల్లో జరుగుతుంది.
- టైర్-1 (ఆబ్జెక్టివ్ టెస్ట్)
- టైర్-2 (డిస్క్రిప్టివ్ టెస్ట్)
- టైర్-3 (ఇంటర్వ్యూ).
- టైర్-1లో 100 మార్కుల బహుళైచ్ఛిక ప్రశ్నాపత్రం ఉంటుంది.
- ఇందులో జనరల్ అవేర్‌నెస్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, లాజికల్ రీజనింగ్, ఇంగ్లీష్, జనరల్ స్టడీస్ నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఈ పరీక్షకు అభ్యర్థులకు 60 నిమిషాలు సమయం ఇస్తారు.
- టైర్-2 పరీక్ష 50 మార్కులకు ఉంటుంది. ఇందులో వ్యాస రచన (30 మార్కులు), ఇంగ్లీష్ కాంప్రహెన్షన్, ప్రెసిస్ రైటింగ్ (20 మార్కులు) ఉంటాయి. దీని తరువాత, టైర్-3 ఇంటర్వ్యూ దశ 100 మార్కులకు ఉంటుంది.

- **జీతం భత్యాలు :** అసిస్టెంట్ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్ గ్రేడ్-2 (ఎగ్జిక్యూటివ్) ఉద్యోగానికి ఎంపికైన అభ్యర్థులకు లెవల్-7 కింద నెలకు రూ.44,900 నుంచి రూ.1,42,400 వరకూ జీతం లభిస్తుంది. ఇది కాకుండా కేంద్ర ప్రభుత్వం ఇతర అన్ని అలవెన్సులు విడిగా అందిస్తుంది.

దరఖాస్తు చేసే విధానం :

- ముందుగా www.mha.gov.inకి వెళ్లండి.
- ఇప్పుడు IB ACIO Recruitment 2025" లింక్‌పై క్లిక్ చేయండి.

నమోదు చేసుకుని లాగిన్ అవ్వండి.

- దరఖాస్తు ఫారంను జాగ్రత్తగా పూరించండి.
- అవసరమైన పత్రాలను అప్‌లోడ్ చేయండి.
- దరఖాస్తు రుసుం చెల్లించండి.
- ఫారంను సమర్పించి దాన్ని ప్రింట్ తీసుకోవాలి.

సిసిఆర్ఎఎస్‌లో 394 ఉద్యోగాలు

న్యూఢిల్లీ కేంద్రంగా ఉన్న సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ ఆయుర్వేదిక్ సైన్సెస్ (సిసిఆర్ఎఎస్) 2025లో గ్రూప్-ఎ, గ్రూప్-బి, గ్రూప్-సి కేడర్‌లోని మొత్తం 394 పోస్టుల భర్తీకి తాజా నోటిఫికేషన్ విడుదల చేసింది. పదో తరగతి నుంచి పిజి, వైద్య విభాగాల్లో విద్యార్హత కలిగిన అభ్యర్థులు ఈ ఉద్యోగాలకు అర్హులు.

మొత్తం పోస్టులు: 394.

- **విభాగాలు:** ఆయుర్వేద, ఫార్మసీ, ల్యాబ్ టెక్నీషియన్, అడ్మినిస్ట్రేటివ్, డేటా ఎంట్రీ, క్లరికల్, టెక్నికల్ తదితర విభాగాలు.
- **అర్హతలు ఇవే :** ఆయా పోస్టులను అనుసరించి 10వ తరగతి, ఇంటర్, ఐటిఐ, డిగ్రీ, ఎంఎస్‌సి, ఎంఎ, ఎంఫార్మసి, ఎండి, ఎంఎస్ చదివిన వారు అర్హులు. సంబంధిత ఫీల్డులో పని అనుభవం ఉన్నవారు ప్రాధాన్యత పొందొచ్చు.
- **వయస్సు :** 27 నుంచి 40 ఏళ్ల లోపు ఉండాలి (పోస్టులను బట్టి ఉంటుంది)
- **చివరి తేదీ: 31-08-2025**
- వెబ్‌సైట్ : https://ccras.nic.in

బిహెచ్‌ఇఎల్‌లో ఉద్యోగాలు

10వ తరగతితోపాటు ఐటిఐ చేసిన అభ్యర్థులకు భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (బిహెచ్‌ఇఎల్ రిక్రూట్‌మెంట్ 2025) 515 ఆర్టిసన్ పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది. వీటికి ఎంపికైన అభ్యర్థులను దేశవ్యాప్తంగా ఉన్న బిహెచ్‌ఇఎల్ యూనిట్లలో నియమిస్తారు.

- జూలై 16 నుంచి దరఖాస్తు ప్రక్రియ మొదలైంది.
- ఆగస్టు 12వ తేదీ తుది గడువు.
- పరీక్ష సెప్టెంబర్ రెండోవారంలో

నర్సింగ్ అప్రెంటిస్ పోస్టులు

శ్రీ వేంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (స్విమ్స్), తిరుపతి సంస్థలో నర్సింగ్ అప్రెంటిస్‌ల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. తిరుమల తిరుపతి దేవస్థానాల ఆధ్వర్యంలోని టెర్షియరీ కేర్ మెడికల్ సెంటర్లలో ఆయా పోస్టులను భర్తీ చేస్తారు.

- మొత్తం పోస్టుల సంఖ్య 100.
- దరఖాస్తు ఫీజు రూ.590.
- ఆఫ్‌లైన్ దరఖాస్తుల సమర్పణకు చివరి తేదీ 4 ఆగస్టు

ఇఎస్ఐసి హైదరాబాద్‌లో..

ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఇఎస్ఐసి) హైదరాబాద్ ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో 46 సీనియర్ రెసిడెంట్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- అర్హులైన అభ్యర్థులు జులై 28, 29, 30, 31, ఆగస్టు 1, 4, 5, 6 తేదీల్లో ఇంటర్వ్యూకు హాజరుకావొచ్చు.

ఎయిర్‌ఫోర్స్‌లో 1446 ఖాళీలు

10వ తరగతి, ఇంటర్ పాసై, జాబ్ కోసం చూస్తున్న అభ్యర్థుల కోసం ఇందిరా గాంధీ ఇంటర్నేషనల్ (ఐజిఐ) ఏవియేషన్ సర్వీసెస్ ఎయిర్‌పోర్ట్ గ్రౌండ్ స్టాఫ్, లోడర్ పోస్టుల కోసం 1,446 ఖాళీలను (ఐజిఐ యావిగేషన్ జాబ్స్ 2025) ప్రకటించింది.

- వీటికి 10వ తరగతి, ఇంటర్ పాసైన అభ్యర్థులు జులై 10, 2025 నుంచి ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవచ్చు. సెప్టెంబర్ 21, 2025 తుదిగడువు.
- ఎయిర్‌పోర్ట్ గ్రౌండ్ స్టాఫ్ ఉద్యోగాలకు దరఖాస్తు చేయాలంటే 12వ తరగతి లేదా తత్సమాన గుర్తింపు పొందిన అర్హత ఉండాలి.
- 18-30 సంవత్సరాల వయస్సు గల వారు దరఖాస్తు చేసుకోవచ్చు.
- లోడర్ ఉద్యోగాలకు కేవలం పురుషులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.
- 10వ తరగతి లేదా తత్సమాన గుర్తింపు పొందిన బోర్డు నుంచి పాసైన 20-40 ఏళ్ల వారు వీటికి దరఖాస్తు చేసుకోవచ్చు.
- వీటిలో ఎయిర్‌పోర్ట్ గ్రౌండ్‌స్టాఫ్ ఉద్యోగాలు 1,017 ఉండగా, లోడర్‌లో 429 ఉన్నాయి.
- అభ్యర్థులు మొదట రాత పరీక్షలో ఉత్తీర్ణులైతే, తర్వాత వ్యక్తిగత ఇంటర్వ్యూ కోసం పిలుస్తారు.
- ఈ రెండు దశల్లో విజయం సాధించిన అభ్యర్థులు చివరకు ఎంపిక చేయబడతారు.

"మానవుడు శాస్త్ర జ్ఞానాన్ని తప్ప మరే జ్ఞానాన్ని కోరనవసరం లేని పరిస్థితి ఏర్పడుతుంది. దానికి విరుద్ధంగా ఉన్న అన్ని అపోహలను, నమ్మకాలను పూర్వపక్షం చేయడం పురోగామి సాహిత్య లక్ష్యం."
– కొడవటిగంటి కుటుంబరావు

యుద్ధోన్మాదం

రెండు వర్గాలు తలపడినా
ఇరు దేశాలు ఘర్షణ పడినా
జరిగేది యుద్ధమే
మిగిలేవి– శవాలు, శకలాలే!
కత్తులు, కటార్లు
తుపాకులు, ఫిరంగులు
క్షిపణులు, బాంబులు
ఆయుధమేదైతేనేం?
ఆయువు తీసే పాశమే కదా!
ఆధిపత్యమో, ఆత్మరక్షణో
దురాగతమో, దురాక్రమణో
కారణమేదైతేనేం
చంపేవాడు మనిషే
చచ్చే వాడూ మనిషైనప్పుడు
అది ఉన్మాదమే, యుద్ధోన్మాదమే!
విచక్షణ కోల్పోయి
విజ్ఞత మరిచిపోయి
విధ్వంసానికి తెగబడ్డాక
చిందిన నెత్తురుతో తడిసిన నేల
ఎర్రబడకుండా వుంటుందా?
మరుభూమిగా మారిన రణభూమి
విషాదంలో మినహాయింపునిస్తుందా?
ప్రవహించే నెత్తుటి ధారలతో
గొంతు తడుపుకొని
కళేబరాలతో కడుపు నింపుకొనే
రాబందులకు విజేత, పరాజితులనే
మీమాంస వుంటుందా?
పీక్కు తినడానికి
నిర్జీవ దేహం ఏదైనా ఒక్కటే కదా!?
ఇలాతలం కంపించేలా
ఆయుధ విస్ఫోటనాలతో
మహోపద్రవం జరిగిపోయాక
శిథిలాల ఆనవాళ్ల మధ్య
శవాల గుట్టలపై గెలుపు చిహ్నంగా
రక్తసిక్త పతాకాన్ని ఎగరేస్తే హర్షించేదెవరు?
అమానవీయ దాడిలో
హతమైన అమాయకులు
విడిచిన ఆఖరి శ్వాస
విలాపమై, విషాద గీతమై
పరివ్యాపించదా?
ప్రపంచాన్ని ప్రశ్నించదా?

– ధవళేశ్వరపు రవికుమార్
98487 12197

మరో పొద్దు కోసం ...

భారమైన బతుకుకు
సాధ్యం కాని చావుకు మధ్య
చావ లేక బతుకుతున్న
మానవత్వాన్ని చూసి
గడ్డ కట్టిన గాలి
ఊపిరాడక ఏడుస్తుంది!

పారే నీరు ఆవిరై
హాహాకారాలు చేస్తుంది
రాజుకున్న నిప్పు కణం
నివురు కప్పుకొని మూల్గుతుంది

గడ్డి పరకలు గడ్డ పారలై
సరైన సమయం కోసం
నిక్క బొడుచుకొని చూస్తున్నాయి
వాడి పడి పోయిన
పూల సుగంధం మౌనమైపోయింది

మానవత్వం కలకాలం నిలవాలని
దిక్కులన్నీ ఒక్కటై
కాలాన్ని మొక్కుతున్నాయి!

– కన్నెకంటి నాగేశ్వరరావు, 99667 37695

కన్నీటి వారధి

నేను మామిడి రైతుని...

ఇన్ని మామిడి పూలు
కళ్ళలో మెరిసినపుడు
నాలో ఉదయాలు నిండిపోయేవి
ఆనందాలు పక్షులై ఎగిరేవి!

ఈ చెట్ల చుట్టూ
ఎన్ని ప్రదక్షిణలు చేశాను!
చేతులూపే మొక్కలన్నా
ఊపిరిలూదే చెట్లన్నా
ఇష్టం కళ్ళలో ఇట్టే ఉట్టి పడుతుంది

ఎంతయినా ప్రకృతిలో జీవితాన్ని
జీవితంలో ప్రపంచాన్ని చూస్తున్న వాణ్ణి.
మామిడి కాయల్ని లెక్కిస్తూ
ధరలు పోగేసుకుంటున్న వాడ్ని ...

ఈ ఆనంద సమయంలో
పండేదంతా లాభమని తలుస్తాను

కాలం కదులుతుంది
సిండికేట్ సామ్రాజ్యం సైరన్ మోగిస్తుంది
దళారుల దగా ప్రత్యక్షమౌతుంది.
గిట్టుబాటు ధర మౌనం వహిస్తుంది

ఇప్పుడు ఆకాశం విరిగి
పిడుగులు పడ్డట్టు
రెక్కలు విరిగిన పక్షిలా నేను ...
ధరలు లేక
కదలలేని మామిడి కాయలు, పళ్ళు
గుండెలో బాధ ఎగబాకుతుంది
ఆశలు చతికిల బడుతుంటాయి.

అమావాస్య చీకటిలో
కమిలి పోతూ కుమిలి పోతూ
కన్నీళ్ళ వారధిపై పయనిస్తుంటాను!

– గవిడి శ్రీనివాస్, 70192 78368

దేవదానం రాజుకు రావిశాస్త్రి సాహితీ పురస్కారం

రావిశాస్త్రి సాహితీ పురస్కారం–2025 సభ జులై 30 తేదీ బుధవారం విశాఖ పౌర గ్రంథాలయం, ద్వారకానగర్‌లో సాయంత్రం 6 గంటలకు జరుగుతుంది. ప్రముఖ కథకుడు దాట్ల దేవదానం రాజు రావిశాస్త్రి సాహితీ పురస్కారాన్ని స్వీకరిస్తారు. డా.గండికోట రఘు రామారావు అధ్యక్షతన జరిగే సభలో రాచకొండ ఉమా కుమార శాస్త్రి, డా. ప్రయాగ సుబ్రహ్మణ్యం, డా. టి.రవిరాజు, డా. డి.వి.సూర్యారావు, డా. శిఖామణి ప్రసంగిస్తారు. పురస్కార ప్రదాత డా.రాచకొండ నృసింహ శర్మ.

– విశాఖ రసజ్ఞ వేదిక, రావిశాస్త్రి లిటరరీ ట్రస్ట్

అజరామరుడు ప్రేమ్‌చంద్

సందర్భం



ఆధునిక భారతీయ సాహిత్యంలోని అగ్రశ్రేణి రచయితల్లో ప్రేమ్‌చంద్ ఒకడు. హిందీ సాహిత్యంలో ఆయన ధ్రువతార వంటివాడు. ప్రేమ్‌చంద్ హిందీ సాహిత్యంలోనే కాక సమస్త భారతీయ సాహిత్యంలో ప్రసిద్ధ రచయిత. విశ్వ సాహిత్యంలో భారతీయ సాహిత్యానికి గౌరవాన్ని పెంచిన మేటి నవలాకారుడు, కథారచయిత. హిందీలో 'నవలా సమ్రాట్'గా కీర్తించబడ్డ శ్రేష్ఠ రచయిత. ప్రేమ్‌చంద్ రచనలు 20వ శతాబ్దపు ప్రారంభంలో భారతీయ సాహిత్యాన్ని గణనీయంగా ప్రభావితం చేశాయి.

ప్రేమ్‌చంద్ అసలు పేరు ధనపతరాయ్. ఆయన 1880 జూలై 31వ తేదీన ఉత్తర్ ప్రదేశ్‌లో కాశీకి నాలుగు మైళ్ళ దూరంలో ఉన్న లామహీ అనే గ్రామంలో జన్మించాడు. తండ్రిపేరు మున్షీ అజాయబ్ లాల్. ఆయన పోస్టాఫీసులో గుమాస్తా. ఆర్థిక ఇబ్బందుల్లో వారి కుటుంబం సతమతం అవుతూ ఉండేది. ప్రేమ్‌చంద్‌కి ఎనిమిదేళ్ల వయసప్పుడే తల్లి ఆనంది మరణించింది. సవతి తల్లి పెంపకంలో అనేక ఇబ్బందులు పడ్డాడు. మాతృప్రేమకు నోచుకోలేదన్న బాధ ఆయన్ని జీవితాంతం వెంటాడింది. విద్యార్థిగా ఉన్నప్పుడే కుటుంబానికి ఆర్థికంగా సాయపడటానికి 4 మైళ్ళు నడిచి వెళ్ళి ఒక విద్యార్థికి పాఠాలు చెప్పేవాడు. ప్రేమ్‌చంద్‌కి 15వ ఏట ఆయన ప్రమేయం లేకుండానే తండ్రి వివాహం జరిపించాడు. భార్యతో అతనికి సఖ్యత కుదరలేదు. దానితో ఆమె శాశ్వతంగా పుట్టింట్లోనే ఉండిపోయింది. బి.ఏ. చదివి వకీల్ అవుదామనుకున్న ప్రేమ్‌చంద్, లేమి కారణంగా మెట్రిక్ పాసవ్వగానే, 1898లో ఉపాధ్యాయునిగా ఉద్యోగం ప్రారంభించాడు. పిదప పాఠశాలల డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ అయ్యి జీవనయానం సాగించాడు. 1906లో శివరాణీ దేవి అనే బాల వితంతువును ద్వితీయ వివాహం చేసుకుని ఆదర్శాన్ని ఆచరణలో చూపాడు. సాహిత్య సేద్యంలోను, కుటుంబ నిర్వహణలోను ఆమె భర్తకు ఎంతో అనుకూలవతిగా, ప్రోత్సహకారిగా ఉండేది.

స్వతహాగా ప్రేమ్‌చంద్‌కి పఠనాసక్తి, సాహిత్యాభిలాష ఎక్కువ. చిన్నప్పుడు నాయనమ్మ చెప్పిన కథలు ఆయనకు కథలంటే అమిత ఆసక్తిని కలిగించాయి. తరువాత రవీంద్రనాథ్ టాగూర్ కథల ప్రభావం గాఢంగా పడింది. వాటిని ఉర్దూలోకి అనువదించి 'జమానా' అనే పత్రికలో ప్రచురించాడు. దేశ, విదేశాల రచనల్ని, ప్రఖ్యాత రచయితల నవలల అనువాదాల్ని విస్తృతంగా చదివి, స్వీయ రచనా వ్యాసంగాన్ని ఆరంభించాడు. 1901లో ప్రేమ్‌చంద్ 'అస్ రారేమ అబిద్' (దేవస్థాన రహస్యం) అనే తొలి నవలను ఉర్దూలో రాశాడు. ప్రేమ్‌చంద్ తొలుత 'నవాబ్ రాయ్' పేరుతో ఉర్దూలో రచనలు ఆరంభించాడు. ఆయన రాసిన మొట్టమొదటి కథ 'దునియా కా సబ్ సే అన్ మోల్ రతన్' – అంటే ప్రపంచంలోకెల్లా విలువైన రత్నం. ఆ రత్నం దేశం కోసం ప్రాణాలర్పించే వీరుని నెత్తుటి బొట్టు అని తీర్మానిస్తాడు రచయిత. ఈ కథ 1907లో కాన్పూర్ నుంచి వెలువడిన 'జమానా' పత్రికలో ప్రచురితమైంది. 5 కథల్ని 1909లో 'సోజేవతన్' అనే పేరుతో సంపుటిగా వెలువరించాడు. ఈ కథల్లో దేశభక్తి భావాలు మెండుగా ఉండటంతో ఆంగ్లేయ ప్రభుత్వం ఆ పుస్తక ప్రతుల్ని కాల్చి వేసి, ఆ సంపుటిని నిషేధించింది. ఈ నవాబ్ రాయ్ ఎవరని ప్రభుత్వం ఆరా తియ్యసాగింది. అప్పటికే ఉర్దూలో మంచి పేరు సంపాదించిన ఆయన ఉర్దూని వీడి, ఇకపై 'ప్రేమ్‌చంద్' అనే పేరుతో హిందీలో సాహిత్య వ్యాసంగం సాగించాలని నిర్ణయించుకున్నాడు.

ప్రేమ్‌చంద్ హిందీ సాహిత్యంలో అడుగుపెట్టే సమయానికి గారడీ, ఇంద్రజాల మహేంద్రజాల విద్యలతోను, భూతప్రేతాలు, మాంత్రికులు, రాజకుమారిని పెళ్ళాడేందుకు ఒక సాహసికుడైన రాజకుమారుడు– వెరసి నవలా సాహిత్యం అంతా కల్పనా జనితమైన ప్రపంచం చుట్టూనే తిరిగేది. కథలు కూడా అపరాధ పరిశోధన, చవకబారు శృంగార సన్నివేశాలతో నిండి ఉండేవి. ఈ ధోరణికి ప్రేమ్‌చంద్ అడ్డుకట్ట వేశాడు. సమాజాన్ని పట్టించుకోవాలనే కట్టుబాటును నవలలు, కథల ద్వారా తెచ్చాడు.

ప్రేమ్‌చంద్ ఆగమనం ఆధునిక హిందీ సాహిత్యంలో నవ శకానికి నాంది పలికింది. మధ్య తరగతి, వెనుకబడిన ప్రజల దుర్భర జీవన స్థితిగతులను, వారి సమస్యలను వాస్తవిక దృక్పథంతో చిత్రించిన ఘనత ప్రేమ్‌చంద్‌కు దక్కుతుంది. కార్మిక, కర్షక వర్గాల ఆర్థిక దుస్థితిని చూసి కలత చెందిన ప్రేమ్‌చంద్ తన రచనల్లో ఆర్థిక అసమానతల్ని రుపుమాపాల్సిన అవసరాన్ని చాటిచెప్పాడు. ఆయన కలం సమాజాన్ని అద్దంలో పట్టి చూపింది. ప్రజల మనసులో నైతిక చైతన్యాన్ని తట్టిలేపింది. మహిళల హక్కులు, సాధికారత కోసం గొంతెత్తటంలో ప్రేమ్‌చంద్ తన కాలం వారి కంటే ఎంతో ముందున్నాడు. గాంధీజీ పిలుపు మేరకు ప్రేమ్‌చంద్ 1921లో ప్రభుత్వోద్యోగానికి రాజీనామా చేసి, రచనలనే జీవనాధారంగా చేసుకున్నాడు.

ప్రేమ్‌చంద్ హిందీలో యథార్థవాద సాహిత్యానికి ఆద్యుడు. ఆయన 13 నవలలు, దాదాపు 300 కథలు రాశాడు. పలు నాటకాలు, సంపాదకీయాలు రాశాడు. పెక్కు అనువాదాలు కూడా చేశాడు. ప్రేమ్‌చంద్ నవలలు భారతీయ గ్రామీణ జీవనానికి దర్పణంగా నిలిచాయి. సంఘంలో పాతుకుపోయిన వేశ్యావృత్తిని నిరసిస్తూ, 'సేవాసదన్' నవల రాశాడు. 'ప్రేమాశ్రమ్'లో కర్షక, కార్మిక వర్గాలపై జరుగుతున్న దోపిడీని వ్యతిరేకించాడు. మహాత్మా గాంధీజీచే ప్రభావితుడై 'రంగభూమి'లో పారిశ్రామీకరణ కారణంగా దెబ్బతింటున్న మానవ సంబంధాలను చిత్రించాడు. 'నిర్మల' నవలలో వయోభేదంతో జరిగే వివాహాల్లోని సమస్యలను చూపించాడు. 'కాయాకల్ప్', 'గబన్', కర్మభూమి' వంటి నవలల్లో గ్రామీణ, పట్టణ ప్రజల స్థితిగతులను, సమస్యలను కళ్ళకు కట్టినట్టు చిత్రించాడు. కర్షక జీవితంలోని దైన్యాన్ని, రైతుల ఆత్మవేదనను అక్షరబద్ధం చేసిన గొప్ప నవల 'గోదాన్'. ఇందులోని ప్రధాన పాత్ర హోరీ సన్నకారు రైతుల ప్రతినిధి. అప్పులబాధ, వెనుకబాటుదనం, నైతిక సంఘర్షణ, పెట్టుబడిదారీ వర్గాల చేతుల్లో నలిగిపోయే రైతులకు ప్రతిరూపం.

ప్రేమ్‌చంద్ రాసిన ప్రతి కథా ఒక ఆణిముత్యం. పల్లెపట్టుల జీవిత విధానం అంతా ఆయన కథల్లో కనిపిస్తుంది. బడే ఘర్ కీ బేటీ, పూస కీ రాత్, కఫన్, పంచ పరమేశ్వర్, సవా సేర్ గేహూ, బడే భాయీ సాహబ్, ఈద్ గాహ్, బలిదాన్, శతరంజ్ కే ఖిలాడీ, ఈశ్వరీయ్ న్యాయ్, ఠాకుర్ కా కువా మొదలైనవి విశేష ప్రాచుర్యం పొందిన కథలు. ప్రేమ్‌చంద్ కేవలం సమస్యలను చిత్రించటమే కాదు, ఆ సమస్యల పరిష్కార మార్గాల వైపు కూడా సాహిత్యాన్ని నడిపించారు. 'హంస్', 'జాగరణ్' అనే పత్రికలు నెలకొల్పి హిందీ సాహిత్యానికి దారి చూపే దిక్సూచి లాంటి కథలను, సామాజిక స్పృహ గల రచనలను ప్రచురించాడు. ఆయన రాసిన ఎన్నో కథలు నాటకాలుగా, సినిమాలుగా రూపొందించబడ్డాయి. మరికొన్ని దూరదర్శన్‌లో టెలీఫిల్ములుగా ప్రసారం చెయ్యబడ్డాయి. ప్రేమ్‌చంద్ రచనలు భారతీయ భాషలన్నింటిలోనే కాక రష్యన్, స్పానిష్, పోలిష్, చైనీస్, కొరియన్, పోర్చుగీసు, జర్మన్, ఫ్రెంచి, ఇంగ్లీష్ వంటి విదేశీ భాషలలోకి అనువాదాలుగా వెళ్ళాయి.

ప్రేమ్‌చంద్‌ని విమర్శకులు ఆదర్శోన్ముఖ యథార్థవాద రచయిత అని నిర్ధారించారు. ఆయన రచనలు ఒక రకమైన ఆదర్శవాద వాస్తవికత (ఆదర్శోన్ముఖ యథార్థవాదం) అనే పరిపక్వత పొందినవిగా చెప్పుకోవచ్చు. ప్రేమ్‌చంద్ మాత్రం తనను తాను మానవతావాదినని చెప్పుకున్నాడు. ప్రేమ్‌చంద్ తన రచనల్లో చాలా సహజమైన, వాడుక హిందీ భాషను ఉపయోగించారు. ఆయన వాక్యాల్లో గ్రామీణ సుగంధం, నిష్కళంకమైన అభిప్రాయాలు, దేశీయ పదజాలం నిండి ఉంటాయి. ఈ భాషే ఆయన విజయ రహస్యం. సంస్కృత పదభూయిష్ఠమైన పండిత గ్రాంథిక హిందీ శైలికి, పూర్తిగా విదేశీ పదజాలంతో కూడిన ఫారశీ శైలికీ మధ్యేమార్గంగా హిందూస్తానీ పలుకుబడిని ఉపయోగించాడాయన.

ప్రేమ్‌చంద్ తన సాహిత్యాన్ని సామాజిక విప్లవానికి సాధనంగా ఉపయోగించాడు. సమాజంలో అభ్యుదయ భావాలు విస్తరింపజెయ్యటం కోసం, సాంఘిక దురాచారాలు, వెనుకబాటుతనం, అన్యాయం, పీడన, దోపిడీల నిర్మూలనే ధ్యేయంగా 'రాష్ట్రీయ్ ప్రగతిశీల్ లేఖక్ సంఘ్' 1936లో ఏర్పడింది. ఏప్రిల్ 9–10 తేదీల్లో లక్నోలో జరిగిన దాని తొలి సమావేశానికి ప్రేమ్‌చందే అధ్యక్షత వహించాడు. సంఘం స్థాపనకు సహకరించటమే కాక, తన ఆరోగ్యాన్ని కూడా లెక్కించక ఊరూరా తిరిగి అభ్యుదయ సాహిత్య సృజన దిశగా రచయితలను ప్రోత్సహించాడు. అనారోగ్యం కారణంగా 1936, అక్టోబర్ 8వ తేదీన 56 ఏళ్ల వయసులోనే కన్నుమూశాడు. ఆయన ఇంకా కొన్ని దశాబ్దాలు జీవించి ఉంటే హిందీలో ఎంతో అభ్యుదయ సాహిత్యం ఆయన కలం ద్వారా వెలువడి ఉండేది. ప్రేమ్‌చంద్ వ్యక్తిత్వం ఎంతో ఉన్నతమైనది. ఆయన జీవితం చాలా సరళము, నిరాడంబరమైనది. నమ్రత, నిరహంకారం, కలుపుగోలుతనం అయన స్వభావంలో పెనవేసుకుని ఉండేవి. మాట తీరు సామాన్య రైతును తలపించేది. హిందీ సాహిత్యంలో శిఖరసమానుడు ప్రేమ్‌చంద్. హిందీ సాహిత్యం, ముఖ్యంగా హిందీ నవల, కథా సాహిత్యం తీసుకుంటే గనక 'ప్రేమ్‌చంద్ కి ముందు– ప్రేమ్‌చంద్ తరవాత' అన్నంతగా ప్రభావితం చేసిన యుగకర్త ప్రేమ్‌చంద్. హిందీ సాహిత్యంలో ప్రేమ్‌చంద్ కీర్తి అజరామరంగా నిలిచి ఉంటుంది.

(జులై 31 : ప్రేమ్‌చంద్ జయంతి)

– డా. వెన్నా వల్లభరావు
94903 37978

సంస్కారాన్ని నింపే కథలు

పుస్తకం

ఇంద్రగంటి నరసింహమూర్తి గత కొన్ని సంవత్సరాలుగా వందకుపైగా కవితలు, రెండు వందలు దాకా కథలు రాసి, తనదైన ముద్రవేసి మంచి రచయితగా పేరు సంపాదించుకొన్నారు. ఇటీవలే ఆయన వెలువరించిన 'జీవనరేఖలు' కథల సంపుటిని కాకినాడ సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో ఆవిష్కరించటం జరిగింది. ఇంద్రగంటి నరసింహ మూర్తి గారి కథలన్నీ మధ్య తరగతి మానవతా విలువల్ని తట్టిలేపుతాయి. సమాజంలో నిత్యం మనకు కనిపించేవీ, ఎదురయ్యేవీ మాత్రమే ఈ కథల్లో వస్తువులుగా మారాయి.

'హరికథావైభవం' కథ చదుతుంటే మనసు ఒకవిధమైన ఉద్విగ్నతకు లోనవుతుంది. మూడు తరాల పాటు రాజ్యమేలిన హరికథ కళ క్రమేపీ అడుగంటి పోవటాన్ని భరించలేక బాధపడు తున్న తండ్రికి అమెరికాలో ప్రదర్శనను ఏర్పాటు చేసి హరికథకు పూర్వవైభవాన్ని తీసుకు వస్తాడు కొడుకు. ఈ ముగింపు హరికథాప్రియులకెంతో ఊరట నిస్తుంది. మనిషి సంఘజీవి అని, ఎల్లకాలం ఎవరి అవసరం లేకుండా ఒంటరిగా అతడు బతకలేడని, ఎప్పుడో ఒకప్పుడు సాటివారి సాయం అవసరమవు తుందని 'జ్ఞానోదయం' కథ చెపుతుంది. ఈ కథలో రచయిత చక్కని హాస్యాన్ని పండిస్తారు. ఉపాధ్యాయులందరూ కలిసి కార్తీక వనభోజనాలకు వెళతారు. అక్కడ సుభద్ర కేరట్ హల్వా చప్పరిస్తూ తన్మయత్వంతో తింటూంటే రాఘవరావు అసూయగా చూసాడు. అతను డయాబెటిక్! ఈ చివరి వాక్యం చదవగానే ఒంటరిగా ఉన్నా మనలో మనమే నవ్వుకోకుండా ఉండలేం. 'మాతభాషకు నీరాజనం' అనే ఒక చిన్నకథను భలే ఆసక్తికరంగా ముగించి, అమ్మయ్య! అనిపించారు. మాతభాషాభిమానులు ఎప్పటికీ ఉంటారన్న నమ్మకాన్ని, ధైర్యాన్ని కలుగజేశారు. ఈ కథలో ఎంతో అందంగా ఉండే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అయిన అమ్మాయిని కాదని, ఎంఏ., తెలుగు చేసిన అమ్మా యిని పెళ్ళిచేసుకొంటాడు వేదవ్యాస్. అల్పాక్షరముల అనల్పార్థరచన కథకూ వర్తిస్తుందనిపిస్తుంది ఈ చిన్న కథను చదివితే. పిల్లల్ని, అందునా మగపిల్లల్ని విపరీతమైన గారంపెట్టి, వాళ్ళు అడిగిందల్లా కాదనకుండా అమర్చి పెడుతూ వాళ్ళలో అహంకారం, నిర్లక్ష్యం లాంటి లక్షణాల్ని పెంచి పోషించే తల్లిదండ్రులకి కనువిప్పు కలిగించే కథ 'నేరము– శిక్ష'.

ఎవ్వరికైనా హృదయం బరువెక్కించే కథ 'అనాయాసేన మరణం'. కథ చదువుతుంటే కన్నీటిచుక్కలు రాలతాయి. నిరంతరం మరణ భయంతో కొట్టుమిట్టాడే వానికి మరణం అంత త్వరగా రాదని, చివరికి వార్ధక్యం వల్లో, అనారోగ్యం వల్లో అతడే మరణాన్ని ఆహ్వానించే స్థితికి చేరుకొంటాడని ఈ కథ చెపుతుంది. అవినీతిని వ్యతిరేకించే కవితలు రాస్తూ కూడా లంచం తీసుకొంటూ దొరికిపోయిన తహసీల్దార్ గతి ఏమయిందో చెప్పే కథే సంఘర్షణ. ఉద్యోగం చెయ్యాలన్న కోరిక ఉన్నవాళ్ళు ఉద్యోగం చెయ్యలేకపోవచ్చు. ఉద్యోగంపై ఆసక్తిలేని వాళ్ళకి ఉద్యోగం చేసే అవసరం, అవకాశం రావచ్చు. ఎవరి జీవితాలు ఎప్పుడు ఎలాంటి మలుపులు తిరుగుతాయో ఎవ్వరూ ఊహించలేరన్న సత్యాన్ని 'ఆటుపోట్లు' కథ చెపుతుంది. ఆడపిల్లనన్న కారణంగా పుట్టినప్పటి నుండి, తనను నిరంతరం ద్వేషించే తండ్రికి ఆ కూతురే తన అవయవాన్ని దానం చేసి కన్నతండ్రి కళ్ళు తెరిపించే కథ 'అభ్యుత్థానం'. మద్యపానం కుటుంబాల్లో ఎలా చిచ్చుపెడుతుందో, మద్యపానానికి బానిసలైన మగవాళ్ళు భార్యలను చంపైనా డబ్బులాక్కోవాలని ఎలాచూస్తారో 'ధనవి న్యాసం' కథలో చెపుతారు రచయిత.

ఈ రచయిత సునిశితమైన, ఆరోగ్యకరమైన హాస్యాన్ని పండించటంలో దిట్ట. 'అత్తాకోడళ్ళు' కథలో ఎప్పుడూ దెబ్బలాడుకొనే అత్తాకోడళ్ళలో కోడలు భర్తతో వేరే కాపురానికి వెళ్ళిపోతే అత్త నేనీ ప్రశాంతతను తట్టుకోలేకపోతున్నానంటూ తిరిగి కొడుకు దగ్గరకి వెళ్ళిపోవాలనుకోవటం భలే నవ్వు తెప్పిస్తుంది. బతికినన్నాళ్ళూ గొప్పగా బతికిన తండ్రి నుంచి స్ఫూర్తిని పొంది అప్పటిదాకా లంచగొండిగా, అవినీతిపరునిగా బతికిన కొడుకు తన పంథాను మార్చుకొని నీతిపరునిగా బతకాలని నిర్ణయించుకొన్న కొడుకు కథే 'జీవిత కర్తవ్యం'. కరోనా నేపథ్యంతో రాసిన 'సర్వేజనా స్సుఖినో భవంతు' కథ కుటుంబ వ్యవస్థ గొప్పదనాన్ని చెపుతుంది. 'ధనబంధాలు' కథలో పిల్లల్ని మనం పెంచే విధానాన్ని బట్టే వాళ్ళకి మన మీద ఆప్యాయతానుబంధాలు, ప్రేమలు ఏర్పడతాయని చెప్పటం జరిగింది.

'తరాల అంతరం'లో ఒంటరితనం ఫీలవుతూ తననెవ్వరూ పట్టించుకోవటం లేదని బాధపడే గోపాలరావు, తన మిత్రుడు ఆనందరావుతో జరిగిన సంభాషణ వల్ల, తన ఆలోచనా విధానంలో మార్పు తెచ్చుకొంటాడు. మారుతున్న కాలంతో మారలేకపోవడమే నేటి వృద్ధుల అసలు సమస్య అనే అంశాన్ని ఈ కథ స్పష్టం చేస్తుంది. ఇక ఫోటోషూట్ కథ మొత్తం హ్యూమరస్‌గా సాగుతుంది. పెళ్ళంటే ఫోటోషూట్‌గా మార్చేసిన వైనాన్ని భలే చమత్కారంగా వర్ణిస్తారు ఈ కథలో రచయిత. ఒక్కోసారి పరిసరాల ప్రభావం కంటే జీన్స్ ప్రభావమే బలీయంగా పనిచేస్తుందని తెలిపే కథే 'జీన్స్'. స్త్రీలు తలచుకొంటే వ్యాపారాన్ని పురుషులకంటే తెలివిగా నడపగలరనే సత్యాన్ని చాటిచెప్పే కథ 'వాణిజ్యే వర్తతే లక్ష్మీ'. దినఫలాల్ని, తాయెత్తుల్నీ నమ్మికోవటం అవివేకం, దానివల్ల ఆశాభంగం తప్పదని కూడా ఈ కథ ద్వారా వివరించారు రచయిత. సెన్సాఫ్ హ్యూమర్ ని అక్షరమక్షరంలోనూ పండించిన కథ 'కలగూరగంప'. నేటి సినిమాలలోని కథ, కథనం, డైరెక్షన్, స్క్రీన్ ప్లే,సీన్స్ వంటివి ఇంచుమించు మూసలో పోసినట్లు ఒకే విధంగా ఉండటాన్ని ఇందులో ఎండగడతారు రచయిత.

ఇలా మరికొన్ని కథల పొత్తమైన ఈ సంపుటి చదువరులకు ఆహ్లాదాన్ని కలిగిస్తుంది. ఆలోచనా రగిలిస్తుంది. ఇవి కాలక్షేప కథలు కావు; ప్రయోజనాత్మక కథలు. జీవిత సమస్యలను చిత్రించే కథలు. వాటికి పరిష్కారాలను సూచించే కథలు. వివిధ మనస్తత్త్వాలను, మానవ సంబంధాలను ఆవిష్కరించే కథలు. సామాజిక స్పృహతో నిండిన కథలు. మానవతా విలువల్ని తట్టిలేపే ఒకసంస్కారం, ఆశావహ జీవితాలకు ఒక భరోసా, ఇవీ.. ఇంద్రగంటివారి కథల్లో కనిపించే అంశాలు. మరిన్ని గొప్ప కథలు వారి కలం నుంచి రావాలని ఆశిద్దాం.

– డాక్టర్ జోస్యుల కృష్ణబాబు
98664 54340

రంగస్థలంపై సమధర్మ ప్రబోధం

నాటకం

భారతీయ బౌద్ధ మహాసభ వ్యవస్థాపకులు బోధిసత్వ డా.బి.ఆర్.అంబేద్కర్ ఆత్మచేతనను, బుద్ధధర్మంలోని మానవతా విలువలను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయోగం– 'బుద్ధునితో నా ప్రయాణం' నాటకం. ఈ నెల 1 నుంచి 31 వరకూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఈ నాటక ప్రదర్శనలు జరుగుతున్నాయి. దీని రచయిత దేవేంద్ర కాగా, ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా జగ్గరాజు వ్యవహరిస్తున్నారు. ఈ నాటకం ఒక కళాత్మక ప్రదర్శన మాత్రమే కాదు; మానవజాతికి మార్గదర్శకంగా నిలిచే ధర్మబోధనల తాత్విక అభివ్యక్తి. నాటకరంగంలోకి బౌద్ధ ధర్మాన్ని సజీవంగా తీసుకువచ్చిన ఒక ప్రయోగం. అంబేద్కర్ జీవితం, బుద్ధిజం మధ్య సంబంధాన్ని స్పష్టంగా తెలియజేస్తూ, ఈ నాటకం ప్రజల్లో అవగాహన పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. అంబేద్కర్ బౌద్ధ ధర్మదీక్షకు దారితీసిన ఆత్మ తపన, సామాజిక పోరాటం, చరిత్రలో చోటుచేసుకున్న ఘట్టాలు ఈ నాటకంలో అత్యంత ప్రతిభావంతంగా ప్రదర్శితమయ్యాయి. ఈ నాటక రూపకల్పనలో 'విద్య, సంఘటన, పోరాటం' అనే అంబేద్కర్ నినాదానికి దృశ్యరూపం లభించిందని చెప్పవచ్చు.

బౌద్ధుని దార్శనికత, బౌద్ధతత్వంలో ఉన్న సమానత్వం, అహింసా మార్గం ... అంబేద్కర్ జీవితంలో ఎలా ప్రతిబింబించాయో అత్యంత శక్తివంతమైన సన్నివేశాల రూపంలో ఈ నాటకం కళ్లకు కడుతుంది. తద్వారా ఒక మానవతావాదిగా, దార్శనికునిగా అంబేద్కర్‌వీక్షించే అవకాశం ప్రేక్షకులకు లభించింది. బౌద్ధులు, బౌద్ధాభిమానులకు మాత్రమే కాదు; సామాజికంగా మార్పును కోరే ప్రతి ఒక్కరికీ ఇదొక జ్ఞాన పాఠశాల. ఈ నాటకం ద్వారా 'ధర్మం జీవన పద్ధతి', 'న్యాయం ఒక సాధికారత', 'మానవతా విలువలు ఒక మార్గదర్శకం' అన్న విషయాలు స్పష్టంగా వినిపిస్తున్నాయి. బౌద్ధ ధర్మంలోని విలువల్ని పునర్నిర్మించేందుకు ఈ నాటకం ఒక శక్తివంతమైన కళా మాధ్యమంగా నిలుస్తోంది. 'బుద్ధునితో నా ప్రయాణం' అన్న పేరుకే తగినట్టు, ఇది ప్రతి ఒక్కరికీ తమలోని బుద్ధుని పునరుజ్జీవింపజేసే ఒక అంతర్ముఖ ప్రయాణం. ఈ నాటకాన్ని భారతదేశంలో వేలాది ప్రదర్శనలు అందించాలన్న లక్ష్యంతో ముందుకెళుతున్న ఈ బృందం ఆలోచన గొప్పది.

బౌద్ధ ధర్మ ప్రచారానికి తన జీవితాన్ని అంకితం చేసిన మహాశయుడు కె.కె.రాజా. The Latha Raja Foundation వ్యవస్థాపక ట్రస్టీగా ఆయన సమాజహితం, మానవతా విలువలు, కళా ప్రేరణ కలగలిపిన విశిష్ట దారిలో ముందుకెళ్తూ, నూతన మార్గదర్శిగా నిలిచారు. ఆయన స్థాపించిన అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ ద్వారా బౌద్ధ సాహిత్యం, నాటకరంగం, సంగీతం, సామాజిక చైతన్యం వంటి విభాగాల్లో ఎన్నో విప్లవాత్మక కార్యక్రమాలు చేపట్టి, బౌద్ధ ధర్మాన్ని ప్రజలకు సులభంగా అర్థమయ్యేలా సమర్పిస్తున్నారు."బుద్ధునితో నా ప్రయాణం" నాటకం – ఈయన ఆశయాలకు నాటకీయ రూపం. బౌద్ధుని అహింసా సిద్ధాంతం, విశ్వమానవీయ మూల్యాలు, కారుణ్యంతో కూడిన జీవన మార్గం ... ఇవన్నీ అంబేద్కర్ జీవన తత్త్వాలలో ఎలా ఆవిష్కృతమయ్యాయో ఈ నాటకం ద్వారా శక్తివంతంగా చిత్రీకరించారు. కెకె రాజా దష్టిలో బౌద్ధ ధర్మం సమాజ మార్పుకు సాధనం, సమానత్వ సమాజ నిర్మాణానికి మార్గదర్శనం. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల బౌద్ధ సొసైటీ శాఖల సహకారంతో ఈ కళా ప్రదర్శన గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ కళామందిరాల వరకు విస్తరించి, ప్రజల్లో ధర్మబద్ధత, న్యాయ ప్రాధాన్యత, మానవతా విలువలపై చైతన్యం నింపుతోంది. అహింస, సమానత్వం, సహనశీలత వంటి బౌద్ధ సిద్ధాంతాలు అంబేద్కర్ జీవితంలో ఎలా ప్రతిబింబించాయో ఈ నాటకంలో హృద్యంగా, భావోద్వేగభరితంగా చూపారు. ప్రేక్షకులు ఈ ప్రదర్శనను చూసి ఒక చైతన్యయుతమైన తాత్విక ప్రయాణాన్ని అనుభవించారు. సంభాషణలు, భావగర్భిత గీతాలు, ఆధ్యాత్మిక సంగీత నిర్మాణం – ఇవన్నీ కలసి, మానసిక వికాసానికి నూతన బాట వేస్తున్నాయి. కెకె రాజా గారి దూరదష్టి, సమాజాన్ని ఆలోచింపజేసే శక్తివంతమైన ప్రదర్శనలను అందించే కషి – ఇవన్నీ ఈ నాటకంలో ప్రతిఫలించాయి.

'బుద్ధునితో నా ప్రయాణం' అనే ఈ కళా ప్రయోగం కళకు కర్తవ్యాన్ని, ప్రదర్శనకు పరమార్థాన్ని ఇచ్చిన గొప్ప ఉదాహరణ. బుద్ధుని ధర్మబోధనలు, అంబేద్కర్ జీవన వైఖరి ఈ రెండింటినీ సమన్వయంగా ఆవిష్కరించిన విధానం చూసి ప్రేక్షకులు చాలామంది భావావేశానికి లోనయ్యారు. ఈ ప్రదర్శనలోని ప్రతి దృశ్యం ఒక ఆలోచనను, ప్రతి సంభాషణ ఒక సందేశాన్ని, ప్రతి పాత్ర ఒక సత్యాన్ని ప్రతిబింబించాయని వారు అభిప్రాయపడ్డారు. 'బుద్ధునితో నా ప్రయాణం' నాటకం ప్రతి వ్యక్తికీ ఆత్మ పరిశీలనకు, సమాజాన్ని మార్చే దిశగా తొలి అడుగు వేసే అవకాశం. సమాజంలో మార్పు కోరుకునే ప్రతి ఒక్కరూ చూడవలసిన నాటకం ఇది.

– రేగుళ్ళ మల్లికార్జునరావు
సంచాలకులు, భాషా సాంస్కృతిక శాఖ

అనిల్ అంబానీది కార్పొరేట్ దోపిడీయే !

- పారు బకాయిలుగా మారిన వేల కోట్ల రుణాలు
- తొలుత మోసం అంటూ ఆ తర్వాత మాటమార్చిన ఎస్‌బిఐ, కెనరా బ్యాంక్
- ప్రభుత్వ మౌనంపైనా అనుమానాలు
- లోతుగా విచారణ జరపాలంటూ ప్రభుత్వానికి బెఫీ లేఖ



న్యూఢిల్లీ : వ్యాపారవేత్త అనిల్ అంబానీ రుణాలకు సంబంధించి ఇటీవల వెలుగులోకి వచ్చిన కథనాలను గమనిస్తే మన బ్యాంకింగ్, న్యాయ వ్యవస్థలో ప్రశ్నార్థకమైన ఆర్థిక లావాదేవీలు, నియంత్రణ లోపాలు, వ్యవస్థాగత వైఫల్యాలు కొట్టొచ్చినట్టు కన్పిస్తాయి. అనిల్ అంబానీ యాజమాన్యంలోని వివిధ కంపెనీలు దేశీయ, విదేశీ బ్యాంకుల నుంచి రూ.48,216 కోట్ల మేర రుణాలు తీసుకున్నాయి. బ్యాంకులపై ఒత్తిళ్లు, అలసత్వంతో ఇప్పుడవి పారు బకాయిలు (ఎన్‌పిఎ)గా మారిపోయాయి. అనిల్ కంపెనీలను తొలుత మోసపూరిత సంస్థలుగా గుర్తించిన ఎస్‌బిఐ, కెనరా బ్యాంక్ ఆ తర్వాత మాట మార్చడం వెనుక ఏం జరిగిందన్నది తేలాల్సి ఉంది. అనిల్ కంపెనీలు దేశ విదేశీ బ్యాంకులను మోసం చేసి వేల కోట్ల రూపాయలు కొల్లగొడుతుంటే కేంద్ర పెద్దలు ఎందుకు చేష్టలుడిగి చూస్తూ ఉండిపోయారో, దాని వెనుక మతలబు ఏమిటో కూడా తెలియాల్సి ఉంది. దివాలా తీసినట్లు ప్రకటించినప్పటికీ దస్సాల్ట్ రిలయన్స్ ఏరోస్పేస్ వంటి బడా వ్యాపార దిగ్గజాలతో అనిల్ తన సంబంధాలను కొనసాగించారు.

పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయండి : బెఫీ డిమాండ్

అనిల్ అంబానీ వ్యవహారాలపై లోతుగా విచారణ జరపాలంటూ భారతీయ బ్యాంక్ ఉద్యోగుల సమాఖ్య (బెఫీ) అధ్యక్షుడు ఎస్ఎస్ అనిల్ ప్రభుత్వానికి లేఖ రాశారు.

మాటమార్చిన ఎస్‌బిఐ, కెనరా బ్యాంక్

గత నెల 30న ఎస్‌బిఐ నుంచి అనిల్ అంబానీకి నోటీసు అందింది. రిలయన్స్ కమ్యూనికేషన్స్ లిమిటెడ్ (ఆర్ కామ్) ఖాతా మోసపూరితమైనదని అందులో ఎస్‌బిఐ తెలిపింది. కంపెనీతోపాటు దాని మాజీ డైరెక్టర్ అనిల్ అంబానీ పేరును రిజర్వ్‌బ్యాంక్‌కు పంపానని పేర్కొంది. దీనికి అనిల్ తన న్యాయవాది ద్వారా సమాధానం పంపారు. తన వాదనను వినిపించేందుకు ఎస్‌బిఐ అవకాశం ఇవ్వలేదని, ఇది సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని ఆయన అందులో ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ రంగంలోని కెనరా బ్యాంక్ గత నవంబరులో ఆర్ కామ్ ఖాతాను మోసపూరితమైనదిగా గుర్తించింది. ఎస్‌బిఐ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేసిన తర్వాత 18 రోజుల వ్యవధిలోనే కెనరా బ్యాంక్ మాట మార్చింది. గతంలో అంబానీ కంపెనీపై వేసిన మోసపూరిత సంస్థ ట్యాగ్‌ను తొలగించినట్లు అఫిడవిట్ సమర్పించింది.

రుణ సంతర్పణ చేసిన బ్యాంకులివే

అనిల్ అంబానీ నేతృత్వంలోని ఆర్ కామ్, రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ సంస్థలు 2015లో ఎస్‌బిఐతో పాటు పలు దేశీయ, అంతర్జాతీయ బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్నాయి. రుణాల పంపకం 2016లోనే పూర్తయింది. ఎస్‌బిఐ అత్యధికంగా రూ.3,628.68 కోట్ల రుణం ఇచ్చింది. రూ.1,832.91 కోట్లతో ఇండస్ట్రియల్ అండ్ కమర్షియల్ బ్యాంక్ ఆఫ్ చైనా రెండో స్థానంలో నిలిచింది. అంబానీకి రుణ సంతర్పణ చేసిన బ్యాంకులు, ఆర్థిక సంస్థలలో కెనరా బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, శుభా హోల్డింగ్స్, ఎస్‌ఎస్ లోవి అసెట్ మేనేజ్‌మెంట్, దోహ బ్యాంక్, స్టాండర్డ్ ఛార్టర్డ్ బ్యాంక్, ఎమిరేట్స్ బ్యాంక్, చైనా డెవలప్‌మెంట్ బ్యాంక్, ఎక్స్‌పోర్ట్ అండ్ ఇంపోర్ట్ బ్యాంక్ ఆఫ్ చైనా మొదలైనవి ఉన్నాయి. అంబానీ ఈ సంస్థల్ని మోసం చేసి రూ.48,216 కోట్ల విలువైన ప్రజల డిపాజిట్లను దోచుకున్నారు. ఈ మొత్తాన్ని బ్యాంకులు 2020లో పారు బకాయిలుగా ప్రకటించాయి. అంబానీ ఆర్థిక లావాదేవీలను పరిశీలించిన ఎస్‌బిఐ 2020 నవంబర్ 10న తన రికార్డులలో ఆయన కంపెనీని మోసపూరిత సంస్థగా ముద్ర వేసింది.

ఆరోపణ ఏం చెబుతోంది?

రుణాలను దుర్వినియోగం చేయడం, నేరపూరిత నమ్మక ద్రోహం, నకిలీ ఆర్థిక సాధనాలను ఉపయోగించి దుర్వినియోగానికి పాల్పడడం, ఖాతా పుస్తకాలను తారుమారు చేసి మోసానికి పాల్పడడం, అక్రమంగా రుణాలు పొందడం, కృత్రిమ ద్రవ్య సంక్షోభాన్ని చూపడం, రికార్డులను మసిబూసి మారేడుకాయ చేయడం, విదేశీ కరెన్సీతో చట్టవిరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడడం...ఆర్‌బిఐ నిబంధనల ప్రకారం ఇలాంటి చర్యలకు పాల్పడితే మోసపూరిత సంస్థగా గుర్తిస్తారు. అంటే అనిల్ అంబానీ కంపెనీలు ఈ చర్యలకు పాల్పడినట్లేనని స్పష్టమవుతోంది. ఎస్‌బిఐ కూడా కెనరా బ్యాంక్ మాదిరిగానే అనిల్ కంపెనీలను మోసపూరిత సంస్థల జాబితా నుండి తొలగించింది. మోసపూరిత ట్యాగ్‌పై సెంట్రల్ రిపాజిటరీ ఆఫ్ ఇన్ఫర్మేషన్ ఆన్ లార్జ్ క్రెడిట్స్ (సిఆర్ఐఎల్‌సి)కి తెలియజేయాల్సి ఉంటుంది. ఆ పని కూడా చేయలేదు.

అనిల్ మొసలి కన్నీరు

మోసపూరిత సంస్థ ముద్ర నుంచి తొలగించిన తర్వాత రిలయన్స్ ఇన్‌ఫ్రాటెల్‌ను దివాలా కింద వేలానికి పెట్టారు. అనిల్ సోదరుడైన ముకేష్ యాజమాన్యంలోని జియో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థ వేలంలో దానిని కొనుగోలు చేసింది. కానీ తాము ఇచ్చిన రుణాల కింద బ్యాంకులు పొందింది నామమాత్రపు మొత్తమే. అనిల్ కంపెనీలు మూడు చైనా బ్యాంకుల నుంచి కూడా రుణాలు పొందాయి. రుణాలు ఎగవేసిన తర్వాత అవి బ్రిటన్ కోర్టులో రికవరీ కోసం కేసులు పెట్టాయి. అనిల్ వాదనలను న్యాయస్థానం తోసిపుచ్చుతూ చైనా బ్యాంకులకు రూ.5,448 కోట్లు చెల్లించాలని తీర్పు చెప్పింది. మన దేశీయ బ్యాంకులు మాత్రం రుణాలను ఎన్‌పిఎగా ప్రకటించి చేతులు దులుపుకున్నాయి. బ్రిటన్ కోర్టు విచారణకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరైన అనిల్ మొసలి కన్నీరు కార్చారు. తాను పూర్తిగా దివాలా తీశానని, తన ఖర్చులను భార్య, ఇతర కుటుంబ సభ్యుల భరిస్తున్నారని, కుమారుడు అన్మోల్ అంబానీ నుంచి కోట్లాది రూపాయల అప్పు తీసుకున్నానని చెప్పారు. చట్టపరమైన ఖర్చుల కోసం తన వద్ద ఉన్న ఆభరణాలన్నింటినీ రూ.తొమ్మిది కోట్లకు అమ్మేశానని, ఇక తన వద్ద విలువైనవేవీ లేవని తెలిపారు.

ఈ ప్రశ్నలకు జవాబులేవి?

ఈ కేసు అనేక నాటకీయ మలుపులు తిరిగిన తర్వాత 2020 అక్టోబర్ 12న ఢిల్లీ హైకోర్ట్ చైనా బ్యాంకులకు నోటీసులు జారీ చేసింది. భారత్‌లో తాను వేసిన కేసు విచారణ సందర్భంగా చైనా కంపెనీని వాదనలు వినాలని అనిల్ కోర్టును అభ్యర్థించడంతో ఈ నోటీసులు జారీ అయ్యాయి. లండన్ కోర్టులో చైనా బ్యాంకులు దాఖలు చేసిన కేసు విచారణ సందర్భంగా అనిల్ అంబానీ వినిపించిన వాదనలను పరిశీలిస్తే ఎస్‌బిఐ, కెనరా బ్యాంక్ ముందుగా వేసుకున్న పథకం ప్రకారమే ఆయన కంపెనీని మోసపూరిత సంస్థ ట్యాగ్ నుంచి తొలగించాయన్న అనుమానాలు కలుగుతున్నాయి. 2020లో అనిల్ కంపెనీలను మోసపూరిత సంస్థల జాబితా నుంచి ఎందుకు తొలగించారు? దానిని కొత్త యజమాని అయిన అనిల్ సోదరుడు ముఖేష్ అంబానీకి ఎందుకు అప్పగించారు? ఇప్పుడు మళ్లీ అనిల్‌ను నిజాయితీ లేని వ్యక్తిగా ఎందుకు చూస్తున్నారు? వివిధ బ్యాంకుల నుంచి పొందిన రుణాన్ని అనిల్ దుర్వినియోగం చేశారని కేంద్ర ప్రభుత్వంలోని పెద్దలు ఎందుకు గుర్తించలేదు? ఈ ప్రశ్నలకు సమాధానాలు దొరకాల్సిన అవసరం ఉంది.

డస్సాల్ట్ ఒప్పందంలోనే వివాదం

అనిల్ అంబానీ స్థాపించిన రిలయన్స్ ఏరోస్ట్రక్చర్ లిమిటెడ్ (ఆర్ఎఎల్), ఫ్రాన్స్‌లో ప్రధాన కార్యాలయం ఉన్న డస్సాల్ట్ ఏవియేషన్ కంపెనీ సంయుక్త భాగస్వామ్యాన్ని ఏర్పాటు చేసుకొని నాగపూర్‌లో జెట్ విమానాల ఫాల్కన్ సిరీస్ ఉత్పత్తిని ప్రారంభించింది. దీనికి ఏయే బ్యాంకులు ఎంత మొత్తంలో రుణాలు సమకూర్చిందీ ఇంకా తెలియలేదు. 2015లో మోడీ ఫ్రాన్స్‌లో పర్యటించినప్పుడు డస్సాల్ట్ నుంచి రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలుకు ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందంలో రిలయన్స్ ఏరోస్ట్రక్చర్‌ను భారత భాగస్వామిగా చేర్చాలని చేసిన ప్రయత్నాలు వివాదానికి దారితీసిన విషయం తెలిసిందే. భారతీయ బ్యాంకులను కొల్లగొట్టి రూపాయల మేర దోచుకొని విదేశాలకు పలాయనం చిత్తగించిన విజయ్ మాల్యా, లలిత్ మోడీలు ఓ విలాసవంతమైన వేడుకలో పాల్గొని సంబరాలు చేసుకున్న దృశ్యాలు ఇటీవల సామాజిక మాధ్యమాలలో వైరల్ అయ్యాయి. ఆ వేడుకలో అమెరికా గాయకుడు ఫ్రాంక్ సినాత్రా ఓ పాట పాడారు...'ఇప్పుడు ముగింపు దగ్గర పడింది' అనే పదాలు ఆ పాటలో విన్పిస్తాయి. మరి ఆ ముగింపు ఎవరికి వర్తిస్తుందో వేచి చూడాల్సి ఉంది.

అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తులు వర్మ, శేఖర్ యాదవ్‌లపై అభిశంసన !

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

అలహాబాద్ హైకోర్టుకు చెందిన ఇద్దరు న్యాయమూర్తులపై అభిశంసన తీర్మానాన్ని ప్రభుత్వం, ప్రతిపక్షం సిద్ధం చేస్తున్నాయి. ఈ సంవత్సరం బీహార్‌లో కీలకమైన ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సీనియర్ న్యాయమూర్తులను తొలగించడంతో తనపై ఉన్న అవినీతి ముద్రను తగ్గించుకునేందుకు, 'అవినీతి వ్యతిరేక' సానుకూలతను పెంచుకునేందుకు దోహదపడుతోందని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది.

ఇద్దరు న్యాయమూర్తులు.. రెండు వివాదాలు

అప్పటి ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో కాలిపోయిన నగదు కుప్పలు కనిపించిన తరువాత, ప్రభుత్వం, ప్రతిపక్షం రెండూ ఆయనపై అభిశంసనకు సిద్ధమయ్యాయి. ఇటీవల లోక్‌సభలో అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టారు. అయితే న్యాయమూర్తి తనను తొలగించాలని సిఫార్సు చేసిన న్యాయ వ్యవస్థ అంతర్గత నివేదికను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. మితవాద సంస్థ విశ్వ హిందూ పరిషత్ కార్యక్రమంలో వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన తరువాత జస్టిస్ శేఖర్ యాదవ్‌పై అభిశంసన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయనను తొలగించాలని కోరుతూ 55 మంది ఎంపిల బృందం రాజ్యసభకు లేఖ రాసింది.

రేవ్ పార్టీ భగ్నం .. 9 మంది అరెస్ట్

- 4 కార్లు, 11 సెల్ ఫోన్లు, గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లిలో రేవ్ పార్టీ నిర్వహించిన వారిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండాపూర్‌లోని ఎస్‌వి సర్వీస్ అపార్ట్‌మెంట్‌లో ఎపిలోని విజయవాడకు చెందిన నాయుడు, శివం నాయుడు మారు పేర్లతో పార్టీలు నిర్వహిస్తున్నారు. శనివారం అర్ధరాత్రి కూడా పార్టీ నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్, ఎక్సైజ్ పోలీసులు రేవ్ పార్టీని భగ్నం చేశారు. తొమ్మిది మందిని అరెస్టు చేశారు. ముగ్గురిపై కేసు నమోదు చేశారు. వారి నుంచి 2.08 కేజీల గంజాయి, 50 ఓ జీ కుష్ గంజాయి, 11.57 మ్యూజిక్ మష్రూమ్, 1.91 గ్రాముల చెరస్ డ్రగ్స్, 4 కార్లు, 11 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు అరెస్ట్ చేసినవారిలో కగార్ రాహుల్, ఇమ్మాన్యుయేల్, అప్పికట్ల అశోక్ నాయుడు, సమ్మెట సాయికృష్ణ, నాగళ్ల లీలా మణికంఠ, కాజా, హిల్టన్ జోసెఫ్ రోల్ఫ్, అడపా యస్వంత్ శ్రీ దత్తా, తోట కుమార్ స్వామి, నందం సుమన్ తేజ ఉన్నారు. శ్రీనివాస్ చౌహరి, అఖిల్ వర్మ పరారీలో ఉన్నట్టు పోలీసులు తెలిపారు.

టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్
TATA
రిజిష్టర్డు ఆఫీసు: 11వ అంతస్తు, టవర్ ఎ, పెనిన్సుల బిజినెస్ పార్క్, గణపత్రావ్ కదం మార్గ్, లోయర్ ప్యారెల్, ముంబయి-400013. CIN No.U67190MH2008PLC187552.
సంప్రదించు నెం.(022) 61827414, (022) 61827375

స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)
(సెక్యూరిటీ ఇంటెరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002లోని రూల్ 8(1) ప్రకారం)

ఏదైతే, క్రింది సంతకందారు ది **టాటాక్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్** యొక్కఅధీకృత అధికారిగా, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, దిగువ చూపినట్లుగా తేదీన డిమాండ్ నోటీసుజారీచేసి, రుణగ్రహీతలను సదరు నోటీసు తేదీ నుండి 60రోజుల్లోగా నోటీసులో పేర్కొనబడిన మొత్తాలను తిరిగిచెల్లించవలసిందిగా కోరబడినది.
రుణగ్రహీత, మొత్తాలను తిరిగిచెల్లించుటలో విఫలంచెందియున్నందున, ఇందుమూలంగా ప్రత్యేకించి రుణగ్రహీతను మరియు సర్వజనులకు ప్రకటన ఇవ్వడమేమనగా, క్రింది సంతకందారు సదరురూల్స్ యొక్క రూల్ 8తో చదువబడే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని ఇందు దిగువ వివరించిన ఆస్తిని స్వాధీనంలోకి తీసుకున్నారు.
ప్రత్యేకించి రుణగ్రహీత, మరియు సర్వజనులను ఇందుమూలంగా హెచ్చరించడమేమనగా, ఆస్తితో లావాదేవీలు జరుపరాదని మరియు ఆస్తితో ఏవేని లావాదేవీలు జరుపుట అనునది, **టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్** వారికి దిగువ పేర్కొన్న మొత్తాలను మరియు డిమాండ్ నోటీసు తేదీ నుండి దానిపై వడ్డీ మరియు పెనల్ వడ్డీ, చార్జీలు, ఖర్చులు మొ॥వాటిని చెల్లించుటకులోబడి ఉంటుంది.
సెక్యూర్డ్ అసెట్స్‌ను విడిపించుకొనుటకు, అందుబాటులోగల సమయానికి సంబంధించి, చట్టంలోని సెక్షన్ 13లోని సబ్-సెక్షన్ (8) యొక్క నియమాలపై రుణగ్రహీత శ్రద్ధ వహించవలసిందిగా కోరబడుచున్నది.

రుణ ఖాతా నెం	బాధ్యు(ల)/చట్టబద్ధ వారసు(ల)/ చట్టబద్ధ ప్రతినిధు(ల) పేరు	డిమాండ్ నోటీసు మొత్తం & తేది	స్వాధీనతా తేది
9910512.	శ్రీ.ముసునూరు వంశీ కృష్ణ (రుణగ్రహీత) మరియు శరశ్చంద్రిక గ్రూప్ మరియు శ్రీమతి దోనేపుడి స్వప్న (సహ-రుణగ్రహీతలు)	13-01-2025 నాటికి రూ.11075316/- (రూపాయలు ఒక కోటి పదిలక్షల డెబ్బైఐదు వేల మూడు వందల పదహారు మాత్రమే) మరియు డిమాండ్ నోటీసు తేదీ: 13-01-2025	25-07-2025

సెక్యూర్డ్ ఆస్తులు/స్థిరాస్తుల వివరణ: సెటిల్‌మెంట్ డీడ్ నెం.12105/2016 ద్వారా శ్రీ.ముసునూరువంశీ కృష్ణ పేరున గల రాయపూడి గ్రామం, రాయపూడి గ్రామపంచాయతీ ప్రాంతం, తుళ్లూరు మండలం, మంగళగిరి సబ్ రిజిస్ట్రీ, గుంటూరు జిల్లా పరిధిలోని డి.నెం.304, డోర్ నెం.3-50/1, అసెస్‌మెంట్ నెం.266 లోగల అన్ని ఈస్‌మెంట్ మరియు అనుబంధపు ఫిక్సర్లతో పాటుగా అందులోని నిర్మాణాలతో నివాస సైట్ యొక్క 881.66 చ.గ.లు లేదా 737.16 చ.మీ.ల విస్తీర్ణపు మొత్తం భాగం మరియు ఈ క్రింది విధంగా సరిహద్దులు: **సరిహద్దులు: తూర్పు:** సర్కార్ బజార్-165.0; **దక్షిణం:** మల్లెల మల్లిఖార్జున రావు ఆస్తి-30.0; **పడమర:** సర్కార్ బజార్-180.0; **ఉత్తరం:** ఇతరుల ఆస్తి 62; సరిహద్దుల లోపల 881.66 చదరపు గజాలు లేదా 737.16 చదరపు మీటర్ల స్థలం బంగాళ పెంకు ఇల్లు, 960 చ.అ.ల విస్తీర్ణపు ప్లింత్ ఏరియాతోకలదు.

ప్రదేశం: గుంటూరు
తేది: 28-07-2025
సం/- అధీకృత అధికారి
టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

ఆసుపత్రి నుంచి స్టాలిన్ డిశ్చార్జ్

చెన్నై : తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ ఆదివారం ఆపోలో ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. ఈ నెల 21న స్వల్ప అనారోగ్యంతో స్టాలిన్ ఆసుపత్రిలో చేరిన సంగతి తెలిసిందే. స్టాలిన్‌కు యాంజియోగ్రామ్‌తో సహా అనేక పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ సెంగోట్టువేలు నేతృత్వంలోని నిపుణుల బృందం నిర్వహించిన చికిత్స ప్రక్రియ ద్వారా ముఖ్యమంత్రి విజయవంతంగా కోలుకున్నారని ఆపోలో ఆసుపత్రి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. స్టాలిన్ డిశ్చార్జ్‌కు ఆరోగ్యంగా ఉన్నారని ప్రకటించింది. తాను సురక్షితంగా ఇంటికి తిరిగి వచ్చినట్లు సోషల్ మీడియా ద్వారా స్టాలిన్ తెలిపారు. తన ఆరోగ్యం బాగుండాలని కోరుకున్న రాజకీయ పార్టీల నాయకులు, ఎన్నికైన ప్రజాప్రతినిధులు, న్యాయమూర్తులు, ప్రభుత్వ అధికారులు, నటులు, తమిళనాడు ప్రజలకు స్టాలిన్ తన కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తన చికిత్సలో పాల్గొన్న వైద్యులు, నర్సులకు కూడా స్టాలిన్ కృతజ్ఞతలు తెలిపారు. 'మీ సంక్షేమం కోసం నేను నా విధులను నిర్వర్తిస్తూనే ఉంటాను' అని స్టాలిన్ తెలిపారు.

గాజాలో మూడు ప్రాంతాల్లో రోజుకు 10 గంటలసేపు సైనిక విరమణ

టెల్ అవీవ్ : గాజాలోని అధిక జనసాంద్రత కలిగిన మూడు ప్రాంతాల్లో రోజుకి 10 గంటల పాటు యుద్ధాన్ని విరమించనున్నట్లు ఇజ్రాయిల్ సైన్యం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. నిరాశ్రయులైన పాలస్తీనియన్లకు సాయం అందించేందుకు సురక్షితమైన మార్గాలను తెరవనున్నట్లు పేర్కొంది. అధిక జనాభా కలిగిన గాజా నగరం, డెయిర్ అల్-బలాహ్, మువాసి అనే మూడు ప్రాంతాల్లోకి మానవతా సాయాన్ని భారీస్థాయిలో అనుమతించేందుకు సైన్యం వ్యూహాత్మక విరామం చేపట్టనుందని ఒక ప్రకటనలో తెలిపింది. ఆదివారం నుండి తదుపరి నోటీసు వచ్చే వరకు ఈ మూడు ప్రాంతాల్లో స్థానిక సమయం ప్రకారం.. ఉదయం 10 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు (మధ్యాహ్నం 12.30 నుండి రాత్రి 10.30 గంటల వరకు) సైనిక కార్యకలాపాలను నిలిపివేయనున్నట్లు తెలిపింది. గాజా అంతటా ప్రజలకు ఆహారం, ఇతర సామాగ్రిని అందించేందుకు సురక్షిత మార్గాలను ఏర్పాటు చేస్తామని వెల్లడించింది.

హరిద్వార్‌లో ఘోరం

(మొదటిపేజీ తరువాయి)

బాధపడుతున్నట్ట ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. మిగతావారంతా తొక్కిసలాట వల్లే గాయపడ్డారని తెలుస్తున్నది. తొక్కిసలాట ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. ఈ ఘటనపై సోషల్ మీడియా ద్వారా స్పందించిన ప్రధాని మోడీ.. విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి విచారం వ్యక్తం చేశారు. ఘటనా స్థలంలో సహాయక చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఘటనకు గల కారణాలపై దర్యాప్తు కొనసాగుతోందనీ, అధికారులతో తాను నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నానని ఆయన వివరించారు. ఉత్తరాఖండ్ పోలీసు విభాగానికి చెందిన స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎస్‌డిఆర్‌ఎఫ్)తో పాటు స్థానిక పోలీసులు సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారని సిఎం తెలిపారు. మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.2 లక్షల చొప్పున, గాయపడినవారికి రూ.50 వేల చొప్పున ఆర్థిక సాయాన్ని ఉత్తరాఖండ్ ప్రభుత్వం ప్రకటించింది. తొక్కిసలాట జరిగిన ప్రాంతమంతా ఆందోళనకరంగా ఉంది. ఆలయం వద్ద, ఆసుపత్రి వద్ద తమవారిని వెదుకుతూ ప్రజలు కనిపించారు.

నవంబర్‌లో ఇంధన రంగ కార్మికుల జాతీయ సదస్సు

- తిరువనంతపురంలో వివిధ కార్మిక సంఘాల సంయుక్త సమావేశంలో నిర్ణయం
- ఎలమరం కరీం చైర్మన్‌గా సన్నాహక కమిటీ ఏర్పాటు

తిరువనంతపురం : దేశ ఇంధన రంగ భద్రతను, సార్వభౌమత్వాన్ని రక్షించడమే లక్ష్యంగా ఇంధన రంగ కార్మికుల జాతీయ సదస్సు ఈ ఏడాది నవంబర్‌లో ఢిల్లీలో నిర్వహించనున్నారు. తిరువనంతపురంలోని బిటిఆర్ మెమోరియల్‌లో ఆదివారం జరిగిన దేశంలో ప్రధానమైన ఇంధన రంగ కార్మికుల సంఘాల సంయుక్త సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. బొగ్గు, పెట్రోలియం, విద్యుత్ రంగాలకు చెందిన కార్మికుల పోరాటాలను సమన్వయం చేసే లక్ష్యంతో ఈ సమావేశాన్ని నిర్వహించారు. ఆల్ ఇండియా కోల్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎఐసిడబ్ల్యూఎఫ్), పెట్రోలియం అండ్ గ్యాస్ వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (పిజిడబ్ల్యూఎఫ్ఐ), ఎలక్ట్రిసిటి ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఇఇఎఫ్ఐ)లకు చెందిన నాయకులు, ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. దేశ ఇంధన రంగ భద్రతను, సార్వభౌమత్వాన్ని రక్షించడానికి నిర్ణయం తీసుకున్నారు. దేశవ్యాప్తంగా ఇంధన రంగ కార్మికుల హక్కులు, సంక్షేమాన్ని కాపాడటానికి సమన్వయంతో పోరాటం ప్రారంభించడానికి ఇంధన రంగాల కార్మికులను సంఘటితం చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఇంధన రంగ కార్మికుల జాతీయ వేదికను ఏర్పాటు చేయడం కోసం ఒక సన్నాహక కమిటీని కూడా ఏర్పాటు చేశారు. ఎలమరం కరీం చైర్మన్‌గా స్వదేశ్ దేవ్‌రాయ్, ప్రదీప్ మాయేకర్, జికె శ్రీవాస్తవ్‌లు డిప్యూటీ చైర్‌పర్సన్‌లుగా డిడి రామానందన్, నోగెన్ చుటియా, సుదీప్ దత్తాలు కన్వీనర్లుగా ఈ కమిటీని నియమించారు.

ఆదివారం సమావేశంలో యావత్తు ఇంధన రంగంపై విధానపరమైన దాడుల గురించి, ప్రజాప్రయోజనాల రక్షించుకోవడం ప్రాముఖ్యతను గురించి చర్చించారు. నవంబర్‌లో జాతీయ ఇంధన కార్మికుల సమావేశాన్ని ఢిల్లీలో నిర్వహించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. ఇంధన రంగ ప్రైవేటీకరణ, కాంట్రాక్టులైజేషన్‌కు వ్యతిరేకంగా కార్మికుల సమిష్టి స్వరాన్ని విస్తృతం చేయడం ఈ సమావేశం లక్ష్యమని కరీం తెలిపారు. స్వదేశ్ దేవ్‌రాయ్ బ్యాక్‌గ్రౌండ్ నోట్‌ను సమర్పించారు. సుదీప్ దుత్తా అనుబంధ నోట్‌ను ప్రవేశపెట్టారు. డిడి రామానందన్, నోగెన్ చుటియా కీలక ఉపన్యాసం చేశారు. దీపా కె రాజన్, ప్రదీప్ మాయేకర్, జికె శ్రీవాస్తవ్, ఎంజి సురేష్ కుమార్, ప్రదీప్ శ్రీధరన్, ఆర్‌పి సింగ్, బి బాలగోపాల్, ఎంజి అజి సమావేశంలో ప్రసంగించారు.

స్పోర్ట్స్, స్పేస్ స్టార్టప్‌లు పెట్టేందుకు రండి

- మన్‌కీ బాత్‌లో ప్రధాని మోడీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో స్పోర్ట్స్, స్పేస్ స్టార్టప్‌లు పెట్టేందుకు యువ పారిశ్రామిక వేత్తలు ముందుకు రావాలని ప్రధాని నరేంద్ర మోడీ పిలుపునిచ్చారు. ఈ రంగంలో ఎన్నో అవకాశాలు ఉన్నాయని, యువత ఆ దిశగా ఆలోచనలు చేయాలని కోరారు. ఆదివారం 124వ మన్‌కీ బాత్ కార్యక్రమంలో ప్రధాని మోడీ మాట్లాడారు. క్రీడా రంగంలోని స్టార్టప్‌లకు పూర్తి మద్దతు ఇస్తానన్నారు. ఇటీవల కాలంలో భారత్‌లో చాలా విశేషాలు చోటుచేసుకున్నాయని, అవన్నీ ప్రతి భారతీయుడికీ గర్వకారణమని అన్నారు. శుభాన్షు శుక్లా ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్ (ఐఎస్ఎస్)కు వెళ్లి వచ్చాక దేశమంతా ఆనందంతో పొంగిపోయిందన్నారు. అలాగే, చంద్రయాన్-3ని విజయవంతంగా ల్యాండింగ్ చేసిన తరువాత దేశంలో ఓ ప్రత్యేకమైన శాస్త్రీయ వాతావరణం ఏర్పడిందన్నారు. ప్రస్తుతం విద్యార్థులు, చిన్నారులు సైతం అంతరిక్ష రంగం మీద ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. దేశంలో విద్యార్థులు స్పేస్ రంగంలో అంతర్జాతీయ స్థాయిలో సత్తాచాటుతున్నారని, ప్రతి విద్యార్థి ఓ కొత్త ఆలోచనతో ముందుకు వస్తున్నారని పేర్కొన్నారు. దేశంలో ఐదేళ్ల క్రితం 50 కంటే తక్కువ స్పేస్ స్టార్టప్స్ మాత్రమే ఉండేవని, ప్రస్తుతం స్పేస్ రంగంలో 200 కంటే ఎక్కువ స్టార్టప్స్ ఉన్నాయని వివరించారు. 'ఇన్‌స్పైర్ మనక్ అభియాన్' ఈ పథకం విద్యార్థులను ఆవిష్కరణలు చేసేలా ప్రోత్సహించే కార్యక్రమమని, ప్రతి పాఠశాల నుంచి ఐదుగురిని దీనికి ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఆగస్టు 23న నేషనల్ స్పేస్ డే సందర్భంగా నమో యాప్ ద్వారా దేశ ప్రజలు తమ సూచనలు, సలహాలు పంపాలని కోరారు.

కాల్పుల విరమణ చర్చలకు థాయ్, కాంబోడియా అంగీకారం

- ట్రంప్ ప్రకటన

ఎడిన్‌బర్గ్ : కాల్పుల విరమణపై చర్చల కోసం వెంటనే సమావేశం కావడానికి థాయిలాండ్, కంబోడియా అంగీకరించాయని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. సరిహద్దు వివాదంపై థాయ్, కాంబోడియా మధ్య మూడు రోజులుగా జరుగుతున్న ఘర్షణల్లో 30 మంది ప్రాణాలు కోల్పోగా 1,30,000 మంది నిరాశ్రయులయ్యారు. ప్రస్తుతం స్కాట్లాండ్ పర్యటనలో ఉన్న ట్రంప్ తన సామాజిక మాధ్యమ వేదిక ట్రూత్ సోషల్‌లో ఓ పోస్ట్ పెడుతూ కాంబోడియా ప్రధాని హున్ మానెట్, థాయిలాండ్ తాత్కాలిక ప్రధాని పుంతం వెచాయచైతో విడివిడిగా మాట్లాడానని తెలిపారు. ఘర్షణలను కొనసాగిస్తే అమెరికాతో వాణిజ్య ఒప్పందాలకు విఘాతం ఏర్పడుతుందని ఇరువురు నేతలను హెచ్చరించానని చెప్పారు. వెంటనే కాల్పుల విరమణ ఒప్పందాన్ని కుదుర్చుకొని, శాంతిని నెలకొల్పాలని ఇరు పక్షాలు భావిస్తున్నాయని అన్నారు.కాల్పుల విరమణ ఒప్పందాన్ని కుదుర్చుకునేందుకు సుముఖంగా ఉన్నామని వెచాయచై తెలిపారు. కాంబోడియా కూడా నిజాయితీతతో వ్యవహరించాలని అభిప్రాయపడ్డారు. దీర్ఘకాలిక శాంతి కోసం ద్వైపాక్షిక చర్చలు జరిపేందుకు థాయిలాండ్ సుముఖంగా ఉన్న విషయాన్ని కాంబోడియాకు తెలియజేయాలని ఆయన ట్రంప్‌ను కోరారు.

గాజాకు సాయం అందాల్సిందే

- అభిప్రాయపడుతున్న అమెరికా కాంగ్రెస్ సభ్యులు

వాషింగ్టన్ డీసీ : ఆకలితో ప్రాణాలు కోల్పోతున్న గాజా ప్రజలకు తక్షణమే ఆహార పదార్థాలు, ఇతర నిత్యావసరాలను అందించాలని అమెరికా ప్రతినిధి సభలోని పలువురు సభ్యులు అభిప్రాయపడ్డారు. గాజాకు అత్యవసర సామగ్రి అందకుండా ఇజ్రాయిల్ దిగ్బంధనం చేయడాన్ని కొందరు తీవ్రంగా నిరసించారు. అమెరికా, ఇజ్రాయిల్ మద్దతుతో నడుస్తున్న జిహెచ్‌ఎఫ్ ఆహార పంపిణీ కేంద్రాల వద్ద సాయం కోసం ఎదురుచూస్తూ వెయ్యి మందికి పైగా పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోవడంపై వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహూ గాజాను నిర్మూలించాలన్న ఏకైక లక్ష్యంతో పనిచేస్తున్నారని ప్రోగ్రెసివ్ సెనెటర్ బెర్నీ సాండర్స్ ఓ ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఇది వాస్తవం. తీవ్రవాద ఇజ్రాయిల్ ప్రభుత్వం ఇప్పటికే రెండు లక్షల మంది పాలస్తీనియన్లను చంపడమో గాయపరచమో చేసింది. వీరిలో మహిళలు, చిన్నారులే ఎక్కువగా ఉన్నారు. గాజాను తుడిచిపెట్టడానికి ఇజ్రాయిల్ ప్రభుత్వం ఆకలిని వాడుకుంటోంది' అని విమర్శించారు.

HINDUJA LEYLAND FINANCE
కార్పొరేట్ ఆఫీసు: 27ఎ, డెవెలప్డ్ ఇండస్ట్రియల్ ఎస్టేట్, గ్యూండీ, చెన్నై-600032.
CIN: U65993MH2008PLC384221.

స్వాధీనతా ప్రకటన
ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(2) క్రింద.

ఏదైతే, క్రింది సంతకందారు **హిందుజా లీలాండ్ ఫైనాన్స్ లిమిటెడ్ (హెచ్‌ఎల్‌ఎఫ్)** యొక్క అధీకృత అధికారిగా, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్ 2002 క్రింద మరియు ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, తేది: **02.08.2022** నాటి డిమాండ్ నోటీసు జారీచేసి, **రుణగ్రహీతలు & సహ-రుణగ్రహీతలు (1) మెసర్స్ లీలా కృష్ణ ఆటోమొబైల్స్ ప్రైవేట్ లిమిటెడ్- రుణగ్రహీత, (2) శ్రీ సుబ్రమణ్యం మాగంటి-సహ-రుణగ్రహీత** (మరణించినప్పటి నుండి వీరి తెలిసిన & తెలియని చట్టబద్ధ వారసులు & సక్సెసర్స్) శ్రీమతి మాగంటి శారద, భర్త & చట్టబద్ధ వారసులు (కీ॥శే॥) సుబ్రమణ్యం మాగంటి, శ్రీ ఎం.వి.శ్రీనివాస్, చట్టబద్ధవారసులు ఆఫ్ (కీ॥శే॥) సుబ్రమణ్యం మాగంటి, శ్రీ చంద్రమౌళి మాగంటి- చట్టబద్ధవారసులు ఆఫ్ (కీ॥శే॥) సుబ్రమణ్యం మాగంటి, శ్రీమతి జానకి నేతి తండ్రి సుబ్రమణ్యం మాగంటి చట్టబద్ధ వారసులు ఆఫ్ (కీ॥శే॥) సుబ్రమణ్యం మాగంటి, శ్రీ మాగంటి వేణుగోపాల్ చట్టబద్ధ వారసులు ఆఫ్ (కీ॥శే॥) సుబ్రమణ్యం మాగంటి, శ్రీ మాగంటి మధుసుధన శర్మ చట్టబద్ధ వారసులు ఆఫ్ (కీ॥శే॥) సుబ్రమణ్యం మాగంటి, (3) శ్రీ ఎంవి శ్రీనివాస్-సహ-రుణగ్రహీత, (4) శ్రీ చంద్రమౌళి మాగంటి-సహ-రుణగ్రహీత, (5) మెసర్స్ కృష్ణప్రియ ఆటోమొబైల్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్- సహ-రుణగ్రహీత, (6) మెసర్స్ విజయలక్ష్మి బొట్లెలర్స్ ప్రైవేట్ లిమిటెడ్- సహ-రుణగ్రహీత, అనువారు మా చెన్నై బ్రాంచి నుండి **లోన్ అకౌంట్ నం. టిఎన్‌సిహెచ్‌సిహెచ్‌సి000143** ఆధారంగా ఆస్తి తాకట్టుపై రుణం పొందియున్నారు, వారిని సదరు నోటీసు స్వీకరణ తేది నుండి 60 రోజుల్లోగా, నోటీసులో పేర్కొనబడిన **2 ఆగస్టు 2022** నాటికి గల మొత్తాలు **రూ.12,73,11,969/- (రూపాయలు పన్నెండు కోట్ల డెబ్బై మూడు లక్షల పదకొండు వేల తొమ్మిది వందల అరవై తొమ్మిది మాత్రమే)**ల మొత్తాలను తిరిగి చెల్లించవలసిందిగా కోరబడినది.
రుణగ్రహీతలు మొత్తాలను తిరిగి చెల్లించుటలో విఫలంచెందియున్నందున, ఇందుమూలంగా రుణగ్రహీతలు మరియు సర్వజనులకు ప్రకటన ఇవ్వడమేమనగా, క్రింది సంకతందారు ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ ఎన్ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002 యొక్క రూల్ 8తో చదువబడే సదరు చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, ఇందు దిగువ వివరించిన ఆస్తిని **25.07.2025న స్వాధీనంచేసుకున్నారు.**
సెక్యూర్డ్ అసెట్స్‌ను విడిపించుకొనుటకు, అందుబాటులోగల సమయంకు సంబంధించి, చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) యొక్క నియమాలపై రుణగ్రహీతలు శ్రద్ధవహించవలసిందిగా కోరబడుచున్నది.
రుణగ్రహీతలు మరియు సర్వజనులను ఇందుమూలంగా హెచ్చరించడమేమనగా, ఆస్తితో లావాదేవీలు జరుపరాదని మరియు సదరు ఆస్తితో ఏవేని లావాదేవీలు జరుపుట అనునది, **హిందుజా లీలాండ్ ఫైనాన్స్ లిమిటెడ్** కు పై పేర్కొన్న మొత్తాలను చెల్లించు తేదీ వరకు దానిపై వడ్డీ, తోసహా చెల్లించుటకులోబడి ఉంటుంది.
ఖాతా నంబరు టిఎన్‌సిహెచ్‌సి000143కు సంబంధించి ఇటీవలి పత్రికా ప్రకటన తేది 13.07.2025 నాటి న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ & ప్రజాశక్తిలో టెక్నికల్ ఎర్రర్‌ను దయచేసి గమనించగలరు.
(సెక్యూర్డ్ ఆస్తి యొక్క వివరాలు): కృష్ణా జిల్లా, పటమట సబ్-రిజిస్ట్రీ, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధుల్లో మొగల్‌రాజ్‌పురం, విజయవాడ వద్దగల ఎన్.టి.ఎస్.నం.512, రెవెన్యూ వార్డు నం.17, బ్లాక్ నం.21, విజయవాడ లబ్బీపేట్, గాంధీ కాలనీ, పిచ్చయ్య వీధి, డోర్ నం.40-17-3 లో 1.87 1/4 సెంట్ల (9062చ.గ.లు లేదా 7576.58 మీ.లు) విస్తీర్ణంతో ల్యాండ్స్ మొత్తం భాగం. మరియు సరిహద్దులు: ఉత్తరం: ఎన్.టి.ఎస్.నం.511లో శ్రీ సామినేని వెంకట విష్ణువర్ధన రావు ఆస్తి, దక్షిణం: మున్సిపల్ రోడ్డు, తూర్పు: విజయలక్ష్మి బొట్లర్స్ ప్రైవేట్ లిమిటెడ్ యొక్క ఆదీనంలో ఆస్తి, పడమర: వల్లూరు వెంకట సుబ్బారావు ఆస్తి.

తేది: 25.07.2025,
ప్రదేశం: చెన్నై.
మెసర్స్ హిందుజా లీలాండ్ ఫైనాన్స్ లిమిటెడ్ తరపున
అధీకృత అధికారి.

సిసిఆర్‌సి కార్డు ఉన్నా 'అన్నదాతా సుఖీభవ'కు దూరం

(మొదటిపేజీ తరువాయి)

చోట ల్యాండ్ పార్సిల్ మ్యాప్ ఆధారంగా 1,72,604 మందికి అందించింది. కౌలు రైతులను గుర్తించి సిసిఆర్‌సి కార్డుల జారీని సులభతరం చేస్తామని చెప్పిన టిడిపి కూటమి ప్రభుత్వం... వైసిపి ప్రభుత్వం 2019లో తీసుకొచ్చిన పంట సాగు హక్కుదారుల చట్టం-2019నే యథాతథంగా అమలు చేసింది. దీంతో, భూ యజమానుల దయాదాక్షిణ్యంపైనే కార్డుల జారీ ప్రక్రియ సాగుతోంది. తమ భూమిపై భవిష్యత్తులో కోర్టులకు వెళ్తారన్న భయం, పిఎం కిసాన్, రైతు భరోసా, అన్నదాతా సుఖీభవ వంటి పథకాలు తమకు రావనే ఉద్దేశంతో అంగీకార పత్రాలపై సంతకాలు చేసేందుకు చాలాచోట్ల భూ యజమానులు అంగీకరించలేదు.

వ్యవసాయం గిట్టుబాటు కాకపోవడంతో ఒకట్రెండు ఎకరాల భూమి ఉన్న రైతుల్లో కొందరు తమ భూములను కౌలుకి ఇచ్చి వలస వెళ్లిపోతున్నారు. ఆధార్ కార్డు, పాస్ పుస్తకం కాపీలు ఇవ్వడానికి, రాతపూర్వక సమ్మతి తెలపడానికి వారు అక్కడి నుంచి ఇక్కడికి రావడానికి ఇష్టపడడం లేదు.

అధిక శాతం జిల్లాల్లో సగం మందికి కూడా అందని వైనం

చాలా జిల్లాల్లో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యంలో సగం మందికి కూడా కార్డులు అందలేదు. తూర్పుగోదావరి జిల్లాలో 1.10 లక్షల మందికి కార్డులు జారీ చేయాలనేది లక్ష్యం కాగా, ఇప్పటివరకూ 4,63,595 మందికి మాత్రమే అందింది. ఎన్‌టిఆర్ జిల్లాలో 56 వేల మందికి కార్డులను అందించాలనేది లక్ష్యం కాగా, ఇప్పటివరకూ 37,739 మందికి జారీ అయ్యాయి. వైఎస్‌ఆర్ కడపలో 11 వేల మందికి కౌలు కార్డులు ఇవ్వాలనే లక్ష్యం కాగా, 2,919 మందికి మాత్రమే అందాయి. అనంతపురంలో 8,500 మందికి ఇవ్వాలనేది లక్ష్యం కాగా, 559 మందికి, చిత్తూరు జిల్లాలో 4,200 మందకి జారీ చేయాలనేది లక్ష్యం కాగా, 213 మందికి మాత్రమే అందజేశారు. శ్రీసత్యసాయిలో 31 మందికి, విశాఖపట్నంలో 34 మందికి, అల్లూరి సీతారామరాజు జిల్లాలో ముగ్గురికి మాత్రమే సిసిఆర్‌సి కార్డులు జారీ అయ్యాయి. అర్హులైన వారందరికీ సిసిఆర్‌సి కార్డులు మంజూరు చేయాలని, అందరికీ అన్నదాతా-సుఖీభవ పథకాన్ని వర్తింపజేయాలని కౌలు రైతులు కోరుతున్నారు.

Home First Finance Company India Limited
homefirst We'll take you home
CIN: L65990MH2010PLC240703
Website: homefirstindia.com Phone No.: 180030008425
Email ID: loanfirst@homefirstindia.com

స్వాధీనతా నోటీసు
రెఫ్ : సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8 యొక్క సబ్ రూల్ (1) కింద స్వాధీనతా నోటీసు.

ఏదైతే, హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్ యొక్క ఆధీకృత అధికారి అయిన దిగువసంతకందారుడు, క్రింద ఇవ్వబడిన దాని సంబంధిత తేదీలలో డిమాండ్ నోటీసుకు అనుగుణంగా, సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్ 2002 (2002 యొక్క యాక్ట్ నం.54) కింద మరియు సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 3తో చదువుతూ సెక్షన్ 13(2) క్రింద అతని అందించబడిన అధికారాలను ఉపయోగిస్తూ సంబంధిత నోటీసుల స్వీకరణ తేది నుండి 60 రోజులలోపట మిగిలిన బకాయిలు చెల్లించమని పేరు క్రింద మిమ్మల్ని/రుణగ్రహీతలను కోరడమైనది. మీరు/రుణగ్రహీతలు, ఏది ఏమైనా నిర్ణీత సమయంలోపట మిగిలిన బకాయిలు చెల్లించుటలో విఫలం చెందినారు, కావునా **హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్** వారు అధ్యాయనం చేసి మరియు ఆక్కడ క్రింద రూల్స్‌తో చదువుతూ SARFAESI చట్టం, 2002 యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (4) నిబంధనల క్రింద నిర్ణయించే హక్కులు కలిగి ఉండి, ఇక్కడ దిగువ పేర్కొన్న సెక్యూర్డ్ అస్సెట్స్ స్వాధీనం చేసుకోవడమైనది :

క్ర సం.	రుణగ్రహీతలు/సహ రుణ గ్రహీతలు/హామీదారుల పేరు	తనఖా ఆస్తి వివరణ	సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసు తేది	డిమాండ్ నోటీసు తేది నాటికి మొత్తం బకాయిలు (రూ.లో)	స్వాధీనతా తేది
1.	లింగిశెట్టి శివప్రసాద్, లింగిశెట్టి లక్ష్మీరమాదేవి	ఇల్లు- డో.నం.4-229, మూల్యాంకనం నం.164, డో.నం.362, గుడిపూడి గ్రామం, గుడిపూడి గ్రామ పంచాయతీ ఏరియా, సత్తెనపల్లి మండలం, సత్తెనపల్లి ఉపజిల్లా ఇలాక, నరసరావుపేట రిజి.జిల్లా, పల్నాడు జిల్లా-522403, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522403. **హద్దులు :** తూర్పు: కంచర్ల ఆంజనేయులు ఆస్తి 41.6", దక్షిణం: ఆర్ అండ్ బి రోడ్డు 38", పడమర : లింగిశెట్టి రాఘవయ్య ఆస్తి 46.6", ఉత్తరం : లింగిశెట్టి మల్లేశ్వరరావు ఆస్తి 46.6".	03-02-2025	16,13,665	24-07-2025

రుణగ్రహీత మొత్తం తిరిగి చెల్లించుటలో విఫలమైనందున, ముఖ్యంగా రుణగ్రహీత/హామీదారుడు మరియు సాధారణ ప్రజలకు నోటీసు ఇవ్వడమేమనగా, సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8తో చదువుతూ సదరు చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (4) క్రింద అతను అధికారాలు అధ్యాయనం చేస్తూ ఇక్కడ వివరించిన ఆస్తిని దిగువ సంతకందారుడు స్వాధీనపరుచుకొన్నాడు. ప్రత్యేకంగా **రుణగ్రహీతలు/హామీదారులు మరియు సాధారణ ప్రజలను** హెచ్చరిండమేమనగా పైన సూచించిన ఆస్తులు/సెక్యూర్డ్ అస్సెట్స్ ఎలాంటి లావాదేవీలు జరుపరాదు మరియు ఏవైనా లావాదేవీలు జరుపదలచిన వారు పూర్తి మొత్తం చెల్లింపు వరకు తదుపరి వడ్డీతో ఆస్తులు/సెక్యూర్డ్ అస్సెట్స్ ఎదురుగా పైన పేర్కొన్న మొత్తం **హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్** చార్జ్‌కు లోబడి ఉండవలెను. సెక్యూర్డ్ అస్సెట్స్ విడిపించుకొనుటకు మీకు లభించిన సమయం మేరకు చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనలు అహ్వానించడమైనదని రుణగ్రహీతలు శ్రద్ధ వహించవలెను.

తేది : 28.07.2025
ప్రదేశం : ఆంధ్రప్రదేశ్
సం. ఆధీకృత అధికారి
హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్

జీవన సారథం

మనిషి స్థాయిని నిర్ణయించేది అతని ప్రవర్తనే. పొగడ్త కాదు..

మీ కోసం

గాజులు ఎక్కువుండా ఇబ్బందిపెడుతుంటే ఒక పాలిథిన్ కవర్ చేతికి తొడుక్కుని ఎక్కించుకోవాలి.

తాతయ్య - పిల్లలు



వేసవి సెలవులకు పల్లెలో ఉన్న తాతయ్య ఇంటికి వెళ్లారు ఉమ, రమ, రవి, రాజు. పిల్లలు వచ్చింది మొదలు సెల్‌ఫోన్‌తో గడుపుతున్నారు. తాతయ్య ఇది చూసి చాలా బాధపడ్డారు.

ఓ రోజు తాతయ్య, పిల్లలందరినీ పిలిచి రాజులు, ఎగిరే గుర్రాలు, మాట్లాడే జంతువులతో కూడిన అద్భుతమైన కథలు చెప్పాడు. పిల్లలకి కథలు బాగా నచ్చాయి. ఒకదాని తరువాత మరొకటి చెప్పమని అడిగారు.

వాళ్ళు పూర్తిగా తన దారిలోకి వచ్చారన్న నమ్మకం తాతయ్యకి కలిగింది. అప్పుడు 'పిల్లలూ ఇప్పటివరకు మీరు కథలు విన్నారు కదా! ఇప్పుడు నేను ఒక ప్రశ్న అడుగుతాను. సమాధానం చెబుతారా' అని అడిగాడు. 'పెద్దయ్యాక మీకు ఏమవ్వాలని ఉందో చెప్పండి' అనడిగాడు తాతయ్య.

రమ 'శాస్త్రవేత్తనై కొత్త వస్తువులు కనిపెడతాను' అంది. ఉమ 'పైలట్ అయ్యి విమానాలు నడుపుతానని' చెప్పింది. 'ఇంజినీరునయ్యి కంప్యూటర్ మీద పని చేస్తా' అన్నాడు రవి.

ఇక మిగిలింది రాజు. 'నీకేమవ్వాలని ఉంది రాజు' అనడిగాడు తాతయ్య. తెలీదని చెప్పాడు రాజు. 'వీళ్లందరూ చెప్పినట్టే ఏదో ఒకటి ఎంచుకోవచ్చు కదా' అనడిగాడు తాతయ్య. 'అదీ తెలీదు. ఏమయితే మంచిదో నువ్వే చెప్పు' అనడిగాడు రాజు. 'నువ్వేమవ్వాలో చెప్పలేను కానీ మనమెలా ఉండాలో చెబుతాను. మనిషిగా పుట్టినవాళ్ళు దీపమైనా కావాలి. లేదంటే అద్దమైనా కావాలి. దీపం వెలుగునిస్తుంది. అద్దం ప్రతిబింబిస్తుంది. ప్రతివారు లోకానికి దారి చూపించే దీపం కాలేకపోవచ్చు. కనీసం అద్దమైనా చాలు. తనకి తెలిసిన జ్ఞానాన్ని మరొకరికి పంచగలుగుతూ సమాజానికి ఉపయోగపడాలి' అన్నాడు తాతయ్య.

అలాగే 'ఏమవ్వాలని ఉందో చెబితే సరిపోదు. అందుకు ఏమేమి చదవాలో, ఎలా చెయ్యాలో అవగాహన తెచ్చుకోవాలి. ఆ రంగంలో నైపుణ్యం సంపాదించేలా కృషి చేయాలి. పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి. సెల్‌ఫోన్‌ని జ్ఞానం పెంచుకోవడానికి మాత్రమే వాడాలి. సరేనా!' అన్నాడు తాతయ్య.

– నారంశెట్టి ఉమామహేశ్వరరావు,
94907 99203.

దారి చూపండి

పిల్లలూ, బయట ఉన్న క్యూటీ, లోపల ఉన్న పప్పీని కలుసుకోవాలి. దారి చూపి సాయం చేయరూ!



నేను గీసిన బొమ్మ

కే. జయశ్రీ,
5వ తరగతి,
సెయింట్ జోసెఫ్స్ ఇంగ్లీషు స్కూల్,
ఎన్‌ఆర్‌.పేట, కర్నూలు.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

వర్షాకాలం పిల్లల చెప్పులు..

వర్షాకాలంలో పిల్లల కోసం చెప్పులు ఎంచుకునేటప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. పిల్లలు నీటిలో ఆడుకోవడానికి ఇష్టపడతారు కాబట్టి, వారి చెప్పుల ఎన్నికపై శ్రద్ధ పెట్టాలి.

జారిపోని చెప్పులు : వర్షంలో రోడ్లు జారిపోయే అవకాశం ఉంది కాబట్టి, జారిపోని చెప్పులు ఎంచుకోవాలి.

త్వరగా ఆరే చెప్పులు : వర్షంలో తడిసిన చెప్పులు బ్యాక్టీరియా, ఫంగస్ పెరుగుదలకు కారణమవుతాయి. కాబట్టి, త్వరగా ఆరే చెప్పులు ఎంచుకోవాలి.

సౌకర్యవంతమైన చెప్పులు : పిల్లలు ఎక్కువసేపు చెప్పులు వేసుకుని తిరుగుతుంటారు, కాబట్టి చెప్పులు సౌకర్యవంతంగా ఉండాలి.

పాదాలకు సరిపోయే చెప్పులు : పాదాలకు సరిపోని చెప్పులు ధరించడం వల్ల బొబ్బలు, ఇతర చర్మ సమస్యలు వస్తాయి. కాబట్టి, పాదాలకు సరిపోయే చెప్పులు ఎంచుకోవాలి.

కొన్ని రకాల చెప్పులు

రెయిన్ బూట్లు : వర్షంలో నడిచేటప్పుడు రెయిన్ బూట్లు ఉత్తమమైన ఎంపిక. ఇవి పిల్లల కాళ్లను పొడిగా ఉంచుతాయి.

ప్లాస్టిక్ చెప్పులు : ప్లాస్టిక్ చెప్పులు తేలికగా ఉంటాయి. త్వరగా ఆరతాయి.

షవర్ చెప్పులు : షవర్ చెప్పులు కూడా త్వరగా ఆరతాయి. జారిపోవు.

స్లిప్పర్లు : స్లిప్పర్లు ఇంట్లో ధరించడానికి అనుకూలంగా ఉంటాయి.

పదార్థాలు పాడవకుండా..

వర్షాకాలంలోని తేమ వల్ల ధాన్యం, పప్పు దినుసులపై ఫంగస్, శిలీంధ్రాలు పెరుగుతాయి. కీటకాల దాడి కూడా ఎక్కువ అవుతుంది. ఎయిర్‌టైట్ కంటైనర్లలో నిల్వ చేసినా, కొన్నిసార్లు ఇబ్బంది పడాల్సి వస్తుంది. అయితే పదార్థాలు పాడవ్వకుండా ఇంట్లో ఉండే వస్తువులతోనే వీటిని జాగ్రత్తగా కాపాడుకోవచ్చు.

- ధాన్యం, పప్పు ధాన్యాల కంటైనర్లలో కొన్ని బగారా ఆకులు, వేప ఆకులు, లవంగాలు, ఎండిన ఎర్ర మిరపకాయలను ఉంచాలి. సహజసిద్ధమైన ఈ పదార్థాలు, పప్పు ధాన్యాలకు పురుగులు పట్టకుండా కాపాడతాయి. తేమను కూడా శోషించుకుంటాయి.
- 10–15 రోజులకు ఒకసారైనా.. వాతావరణం పొడిగా ఉన్న సమయంలో పప్పు ధాన్యాలను కొన్ని గంటలపాటు ఆరుబయట ఆరబెట్టాలి.
- తడి వాతావరణం కారణంగా చెక్క అల్మారాలు, ప్లైవుడ్ షెల్ఫ్‌లలో బూజు పెరుగుతుంది. దీన్ని నివారించడానికి ఒక లీటర్ నీటిలో కొద్దిగా వెనిగర్ కలిపి.. అల్మారాలను శుభ్రంగా తుడవాలి. పూర్తిగా ఆరబెట్టిన తర్వాత వంట సామగ్రిని సర్దుకోవాలి.
- నిత్యం చేరే తేమను నివారించడానికి అల్మారాల మూలల్లో యాక్టివేటెడ్ చార్‌కోల్, బేకింగ్ సోడా, వేప ఆకుల పొడిని ఉంచాలి.
- వర్షాకాలం పూర్తయ్యేదాకా ప్రతి 10–15 రోజులకు ఒకసారి వంటగది షెల్ఫ్‌లను శుభ్రం చేసుకోవాలి.

వర్షాకాలం వంటిల్లు..

వర్షాకాలంలో వైరస్, బ్యాక్టీరియా వ్యాప్తి ఎక్కువగా ఉంటుంది. కాబట్టి ఈ సమయంలో కిచెన్ మరింత శుభ్రంగా ఉంచుకోవాలి.

అవసరంలేనివి వద్దు

కిచెన్ క్లీన్ చేసేప్పుడు ముందుగా అవసరం లేని వస్తువులు తీసివేయాలి. వంటిగదిలో ఆరు నెలలకు పైగా ఉపయోగించని పాత్రలు, వస్తువులు తీసేయడం మంచిది. మరీ అవసరం అనుకున్నవి తప్ప మిగిలినవి పడేస్తే మేలు. దీనివల్ల వంటింట్లో ప్లేస్ పెరుగుతుంది. చూసేందుకు ప్రశాంతంగా కూడా ఉంటుంది.

డీప్ క్లీనింగ్

డీప్ క్లీనింగ్‌లో భాగంగా దెబ్బతిన్న, పాడైన వస్తువులు, పిండి వంటివి పడేయాలి. వంటగది చిమ్నీలు, ఎగ్జాస్ట్ ఫ్యాన్స్‌లు కూడా క్లీన్ చేసుకోవాలి. ఎందుకంటే వాటిపై ధూళి, గ్రీజు ఎక్కువగా ఉండిపోతాయి. వీటిని శుభ్రపరిచేటప్పుడు.. ముందుగా కాసేపు నానబెట్టాలి. గోరు వెచ్చని నీరు, బేకింగ్ సోడా, డిష్ క్లీనింగ్ సబ్బుతో మిశ్రమాన్ని తయారు చేసి.. వాటితో ఎగ్జాస్ట్ ఫ్యాన్ లేదా చిమ్నీపై చల్లి శుభ్రం చేసుకోవచ్చు.

షెల్ఫ్‌లు, కౌంటర్ టాప్‌లు

వంట చేసేటప్పుడు పిండి, వంట నూనె వంటి మరకలు కౌంటర్‌టాప్‌పై పేరుకుంటాయి. వాటిపై ధూళి పడితే మురికిగా మారి ఎండిపోతాయి. అలాగే షెల్ఫ్‌లు కంటి స్థాయి కంటే ఎత్తులో ఉంటాయి కాబట్టి అరుదుగా శుభ్రపరచడం వల్ల జిడ్డు పేరుకుపోతుంది. కాబట్టి ఈ ప్రాంతాలను వెనిగర్, గోరువెచ్చని నీటి మిశ్రమంతో శుభ్రం చేయవచ్చు. షెల్ఫ్‌ల నుంచి అన్ని వస్తువులను తీసివేసి ఆ మిశ్రమాన్ని చల్లి క్లీన్ చేసుకోవాలి.

బొద్దింకలు లేకుండా..

వంటగదిలో బొద్దింకలు ఎక్కువగా కనిపిస్తాయి. ఇవి ఆహారంపై, స్టవ్‌లపై వాలిపోతూ ఉంటాయి. కిచెన్ శుభ్రంగా ఉంచుకోకపోవడం వల్లే ఇలా జరుగుతుంది. పురుగులు, బొద్దింకలు రాకుండా స్ప్రేలు, వికర్షక జెల్స్ ఉపయోగించవచ్చు. మింట్ ఆయిల్‌ను నీటిలో కలిపి వంటగది మూలల్లో చల్లితే పురుగులు, బొద్దింకల బెడద తప్పడమే కాకుండా ఫ్రెష్‌గా ఉంటుంది.

సింక్ క్లీనింగ్

వంటగదిలో రోజూ ఉపయోగించే వాటిలో సింక్ ముఖ్యపాత్ర పోషిస్తుంది. దానిని శుభ్రం చేసేందుకు డిష్ సబ్బు లేక లిక్విడ్స్ వాడొచ్చు. సింక్ డ్రైన్‌ను ఎప్పటికప్పుడు శుభ్రపరుచుకోవాలి. బేకింగ్ సోడాను వేడినీటిలో కలిపి పైపులోని గొట్టాలలో వేయవచ్చు. దీనివల్ల దుమ్ము, లోపలి మురికి తగ్గుతుంది.

ఫ్రిజ్ క్లీనింగ్

ఫ్రిజ్‌లో పెట్టిన మిగిలిపోయిన, అవసరం లేని ఆహార పదార్థాలను బయటకు తీసేయాలి. గడువు ముగిసిన ఫుడ్స్ పడేయాలి. ఎలాంటి కెమికల్స్ లేకుండా గోరువెచ్చని నీటితో వాటిని శుభ్రం చేయాలి.

మేక్‌ఓవర్

కిచెన్‌లో ఎప్పటికప్పుడు చిన్న మేక్‌ఓవర్ చేసుకోవాలి. రిఫ్రెష్‌గా ఉండేందుకు వంటింట్లో కొన్ని మొక్కలు పెట్టుకోవచ్చు. లేదంటే కిచెన్ క్లాత్స్, కర్టెన్స్ మార్చుకోవచ్చు.

వారసులొస్తున్నారు...

తెలుగు సినీ పరిశ్రమలో కథానాయకుల వారసులకు కొదవేమీ లేదు. నాటి పెద్ద తరం నుంచి నేటి యువతరం వరకూ కథానాయకులు రాణిస్తూ తమ వారసులను సైతం అరంగ్రేటం చేయిస్తున్నారు. నందమూరి తారకరామారావు మనవడు, బాలకృష్ణ తనయుడు మోక్షజ్ఞ కూడా త్వరలోనే కథానాయకుడిగా ఎంట్రీ ఇవ్వబోతున్నాడు. త్వరలోనే ఆదిత్య 369కి సీక్వెల్‌గా ఆదిత్య 999 టైటిల్‌లో తనే డైరెక్ట్ చేస్తానని బాలకృష్ణ ప్రకటించారు. ఈ సీక్వెల్‌లో బాలకృష్ణ, మోక్షజ్ఞ ఇద్దరూ హీరోలు. పవన్‌కళ్యాణ్ తనయుడు అకిరానందన్ కూడా కూడా త్వరలో కథానాయకుడిగా మారబోతున్నారు. హరిహర వీరమల్లు సినిమా తర్వాత పవన్‌కళ్యాణ్ చేస్తున్న ఓజిలో అకిరానందన్ ఎంట్రీకి సంబంధించిన విజువల్స్ ఉంటాయని సమాచారం. అకిరానందన్ ఇప్పటికే మార్షల్ ఆర్ట్స్‌తోపాటుగా సినిమాల్లో నటనపై మెళకువలు నేర్చుకుంటున్నారు. ఓజి, ఉస్తాద్‌భగత్‌సింగ్ సినిమాల విడుదల సమయానికి అకిరానందన్ ఎంట్రీ ఇచ్చి ఆ తర్వాత పవన్‌కళ్యాణ్ సినిమాలకు కొన్నాళ్లపాటు విరామం ఇస్తారనేది సమాచారం. హరిహర వీరమల్లు ప్రమోషన్ కార్యక్రమాల్లో పవన్‌కళ్యాణ్ ఇలాంటి సందేశమే ఇచ్చారు. మహేష్‌బాబు తనయుడు గౌతమ్, తనయి సితార కూడా స్క్రీన్‌పై మెరవబోతున్నారు. ఘట్టమనేని వారసుల్లో మహేష్ బాబు అన్నయ్య రమేష్ బాబు తనయుడు జయకృష్ణ తన చదువులన్నింటినీ పూర్తిచేసుకుని అమెరికాలో నటన పరంగా శిక్షణ కూడా తీసుకున్నాడు. ఇప్పటికే అతడి ఎంట్రీ జరిగింది. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. ఈ సినిమా వ్యవహారాలన్నింటినీ దగ్గరుండి మహేష్ బాబు చూసుకుంటున్నారు. జయకృష్ణ తర్వాత గౌతమ్ ఘట్టమనేని సినీ ఎంట్రీ కూడా లాంఛనమేనని తెలుస్తోంది. తన కుమార్తె ఏ రంగంలోకి వెళ్లినా ప్రోత్సహిస్తామంటూ మహేష్ బాబు, నమ్రత శిరోద్కర్ దంపతులు ప్రకటించటం ద్వారా ఆమె ఎంట్రీ కూడా లాంఛనమే. ఇదే ఫ్యామిలీకి చెందిన సుధీర్‌బాబు 'ప్రేమ కథా చిత్రం'తో హిట్‌కొట్టారు. 'హరోం హర', 'మా నాన్న సూపర్ హీరో' చిత్రాల్లో నటించారు. ఇప్పుడు సుధీర్ బాబు పెద్ద కొడుకు చరిత్ మానస్ కథానాయకుడిగా ఎంట్రీ ఇస్తున్నారు. మహేష్‌బాబు మేనల్లుడు అశోక్ గల్లా ఇప్పటికే కథానాయకుడిగా రాణిస్తున్నారు.



సీనియర్ ఎన్టీఆర్ మునిమనవడు, హరికృష్ణ మనవడు కీర్తిశేషులు జానకిరామ్ పెద్ద కుమారుడు నందమూరి తారక రామారావు ఎంట్రీ ఇవ్వటం, సినిమా షూటింగ్ కూడా జరుగుతోంది. రవితేజతో కలిసి అతని కొడుకు మహాధన్ 'రాజా ది గ్రేట్'లో చిన్ననాటి రవితేజగా కనిపించాడు. అతడు కథానాయకుడిగా నటించేందుకు దర్శకులు ఇప్పటికే సంప్రదింపులు జరుపుతున్నారు. జూనియర్ ఎన్టీఆర్ బావమరిది నితిన్ చంద్ర ఇప్పటికే మ్యాడ్ సినిమాతోపాటుగా సీక్వెల్‌లోనూ అలరించిన విషయం తెలిసిందే. టాలీవుడ్ బిగ్ ప్రొడ్యూసర్లలో ఒకరైన బెల్లంకొండ సురేష్ పెద్ద కొడుకు బెల్లకొండ సాయిశ్రీనివాస్ కథానాయకుడిగా రాణిస్తున్నారు. తన తమ్ముడు గణేష్ బాబు కూడా ఎంట్రీ ఇవ్వబోతున్నారు. శతమానం భవతి సినిమాతో జాతీయ అవార్డు అందుకున్న దర్శకుడు సతీష్ వేగేశ్న. తన కుమారుడు సమీర్ వేగేశ్నను స్వీయ దర్శకత్వంలో 'కోతికొమ్మచ్చి' అనే సినిమాతో హీరోగా పరిచయం చేశారు. ఇందులో శ్రీహరి కొడుకు మేఘాంశ్ శ్రీహరి కూడా హీరోగా నటించారు. అల్లు అర్జున్ బావమరిది విరాన్ ముత్తంశెట్టి 'బతుకు బస్టాండ్'తో కథానాయకుడిగా మారారు.

ప్రముఖ నిర్మాత దగ్గుబాటి రామానాయుడు కుటుంబం నుండి వెంకటేష్ ఆ తర్వాత రానా హీరోలుగా పరిచయమైన సంగతి తెలిసిందే. ఇప్పుడు దగ్గుపాటి సురేష్ తనయుడు దగ్గుబాటి అభిరామ్ కథానాయకుడిగా మారుతున్నారు. శ్రీ వెంకటేశ్వర సినీ క్రియేషన్స్ బ్యానర్స్ నిర్మాతలు దిల్‌రాజు, శిరీష్. శిరీష్‌రెడ్డి తనయుడు ఆశిష్ కథానాయకుడుగా 'రౌడీ బాయ్స్'లో నటించారు.

పెద్ద కథానాయకుల వారసత్వంలో...

తెలుగు సినిమాను మూడు తరాలుగా విభజిస్తే మొదటి తరంలో ఎన్టీఆర్, ఎన్నార్, కృష్ణ...ఆ తర్వాత చిరంజీవి, బాలకృష్ణ, నాగార్జున, వెంకటేష్..ప్రస్తుతం పవన్‌కల్యాణ్, ప్రభాస్, మహేష్‌బాబు, రామ్‌చరణ్, ఎన్టీఆర్, రానా ఇంకా చాలామందే ఉన్నారు. అయితే ఒకనాడు హీరోలుగా అలరించిన తారలు తమ వారసుల సినిమాల్లో తళుక్కుమని మెరుస్తున్నారు. వారసులు కూడా తమ తండ్రి సినిమాల్లో బాలనటులుగా మెరిసిన వాళ్లున్నారు. ఇలా.. రియల్ తండ్రీకొడుకులు రీల్లో కనిపించిన సినిమాలెన్నో ఉన్నాయి. అందులో కొన్ని చూస్తే. 'ఆచార్య' సినిమాలో చిరంజీవి ప్రధానపాత్ర పోషించగా, కీలకపాత్రను రామ్‌చరణ్ చేశారు. రామ్‌చరణ్ 'మగధీర' చిత్రంలో చిరంజీవి ఓ పాటకు స్టెప్పులేశారు. అక్కినేని కుటుంబం నుంచి ఒకే సినిమాలో ఏకంగా తాత, తండ్రి, మనవలు నటించి రికార్డు సృష్టించారు. 2014లో డైరెక్టర్ విక్రమ్‌కుమార్ తెరకెక్కించిన 'మనం' చిత్రంలో అక్కినేని నాగేశ్వరరావు, నాగార్జున, నాగచైతన్య, సమంత నటించారు. ఈ చిత్రంలో అఖిల్ కూడా అతిథి పాత్రలో మంచిగా నటించారు. శ్రీరామదాసు చిత్రంలో ఎన్నార్ కబీర్‌దాస్‌గా కనిపించారు. నాగార్జున భక్తరామదాసుగా ప్రధానపాత్ర పోషించారు. అఖిల్ సినిమా తెరంగేట్రం చేసిన చిత్రం 'సిసింద్రీ'లో నాగార్జున కనిపించారు. ఆ తర్వాత 'అఖిల్' పేరుతో వచ్చిన చిత్రంలోనూ 'అక్కినేని అక్కినేని' పాటలో నాగార్జున తళుక్కున మెరిశారు. 1979లో 'నీడ' సినిమాతో బాలనటుడిగా తెరంగేట్రం చేసిన మహేష్‌బాబు 1983లో తన తండ్రి కృష్ణతో కలిసి 'పోరాటం'లో నటించారు. 'రాజకుమారుడు' చిత్రంలో కథానాయకుడిగా మహేష్‌బాబు, ఆయనకు తండ్రిగా కృష్ణ నటించారు. 'బిల్లా', 'రాధేశ్యామ్'లో సినిమాలో ప్రభాస్‌తో తన పెదనాన్న కృష్ణంరాజు కీలకపాత్రలు పోషించారు. బాబాయ్ వెంకటేష్, అబ్బాయ్ రానా కలిసి నటించిన చిత్రం 'కృష్ణం వందే జగద్గురుమ్. సీనియర్ నటుడు మంచు మోహన్‌బాబు తన కుమారులు విష్ణు,, మనోజ్‌లతో కలిసి పలు చిత్రాల్లో నటించారు. 1974లో ఎన్టీఆర్ హీరోగా వచ్చిన 'తాతమ్మ కల' చిత్రంలో బాలకృష్ణ, హరికృష్ణ ఇద్దరూ బాలనటులుగా సందడి చేశారు. అదే ఏడాది ఇద్దరు సోదరులూ కలిసి 'రామ్ రహీమ్'లో ప్రధాన పాత్రదారులుగా నటించారు. బాలకృష్ణ తన తండ్రి ఎన్టీఆర్‌తో కలిసి తొమ్మిది చిత్రాల్లో నటించారు.



ఇక తేలేది టై బ్రేకర్‌లోనే

- హంపి, దివ్య రెండో గేమ్ సైతం డ్రా
- ఫిడె మహిళల చెస్ ప్రపంచకప్



ఫిడె మహిళల చెస్ ప్రపంచకప్ రసవత్తరంగా సాగుతుంది. ప్రపంచ మహిళల చెస్ కిరీటం భారత్ ఖాతాలో పడినా.. ఆ ఘనత దక్కించుకునే రేసులో వెటరన్ గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి, యువ గ్రాండ్‌మాస్టర్ దివ్య దేశ్‌ముఖ్‌లు బటుమిలో ఎత్తులకు పైఎత్తులు వేస్తున్నారు. క్లాసికల్ ఫార్మాట్‌లో జరిగిన తొలి రెండు గేముల్లో హంపి, దివ్య సమవుజ్జీలుగా నిలిచారు. దీంతో చాంపియన్‌ను టైబ్రేకర్‌లో తేల్చనున్నారు. సోమవారం టైబ్రేకర్‌లు జరుగుతాయి.

బటుమి (జార్జియా) : ఫిడె మహిళల చెస్ క్వీన్ ఎవరనే ఉత్కంఠ కొనసాగుతోంది. భారత వెటరన్ గ్రాండ్‌మాస్టర్, తెలుగు తేజం కోనేరు హంపి, భారత యువ గ్రాండ్‌మాస్టర్ దివ్య దేశ్‌ముఖ్‌లు ప్రపంచ చెస్ ప్రపంచకప్‌లో అమీతుమీ తేల్చుకుంటున్నారు. శనివారం జరిగిన తొలి గేమ్‌లో అటు హంపి, అటు దివ్యలు పొరపాటు చేసినా.. ఆది వారం జరిగిన రెండో గేమ్‌లో ఇద్దరూ ఎంతో జాగ్ర త్తగా ఎత్తులు వేశారు. తెల్ల పావులతో ఆడిన కోనేరు హంపి.. ఓ సమయంలో దివ్య నుంచి క్వీన్ ట్రేడ్‌ను తిరస్కరించినా.. ఆఖరుకు డ్రా ఆఫర్‌ను అంగీకరించింది. క్లాసికల్ ఫార్మాట్‌లో జరిగిన తొలి రెండు గేములు డ్రాగా ముగిశాయి. 1–1తో హంపి, దివ్య సమవుజ్జీలుగా నిలిచారు. చెస్ ప్రపంచకప్ విజేతను తేల్చేందుకు గేమ్ ఫార్మాట్ టైబ్రేకర్‌కు మారనుంది. వరుసగా ఏదేని రెండు టైబ్రేకర్లలో పైచేయి సాధించిన గ్రాండ్‌మాస్టర్ అంతిమ విజేతగా నిలువనుంది.

34 ఎత్తుల్లోనే.. : తొలి గేమ్ డ్రాగా ముగియగా.. రెండో గేమ్‌లో విజయం సాధిస్తే టైటిల్ సొంతం చేసుకునే అవకాశం ముందుండగా.. కోనేరు హంపి, దివ్య దేశ్‌ముఖ్‌లు ఆచితూచి ఆడారు. తీవ్ర ఒత్తిడిలోఎవరూ రిస్క్ తీసుకునే ప్రయత్నం చేయలేదు. దీంతో రెండో గేమ్ సాదాసీదాగా సాగింది. టెక్స్ట్‌బుక్ ఫార్మాట్ తరహాలో సాగిన మ్యాచ్‌లో తెల్ల పావులతో ఎత్తులు వేసిన కోనేరు హంపి.. 34 ఎత్తుల తర్వాత దివ్య దేశ్‌ముఖ్ డ్రా ప్రతిపాదనకు సమ్మతించింది. దీంతో ఇరువురు చెరో అర పాయింట్ ఖాతాలో వేసుకున్నారు. క్వార్టర్‌ఫైనల్ నుంచి మేటి గ్రాండ్‌మాస్టర్లను మట్టికరిపించి టైటిల్ పోరుకు చేరుకున్న దివ్య దేశ్‌ముఖ్ అండర్‌డాగ్ ట్యాగ్‌తో సీనియర్ జీఎం హంపిని ఒత్తిడిలో పడేసేందుకు ప్రయత్నిస్తుంది. సెమీఫైనల్లో సహచర భారత గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారికను టైబ్రేకర్‌లోనే ఓడించిన దివ్య దేశ్‌ముఖ్.. మరి ఫైనల్లో ఏం చేస్తుందో చూడాలి.

ఒకే రోజు మూడు శతకాలు

నాలుగో టెస్టును డ్రాగా ముగించిన భారత్



మాంచెస్టర్: భారత్– ఇంగ్లాండ్ మధ్య జరిగిన నాలుగో టెస్ట్ డ్రాగా ముగిసింది. భారత్ రెండో ఇన్నింగ్స్‌లో ముగ్గురు సెంచరీలతో కదం తొక్కారు. దీంతో రెండో ఇన్నింగ్స్‌లో భారత్ ఐదో రోజు ఆట ముగిసే సరికి నాలుగు వికెట్ల నష్టానికి 425 పరుగులు చేసింది. భారత్ రెండో ఇన్నింగ్స్‌లో కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (103, 12 ఫోర్లు)– కేఎల్ రాహుల్ (90, 230 బంతుల్లో 8 ఫోర్లు) జోడీ తరువాత రవీంద్ర జడేజా (107, 185 బంతుల్లో 13 ఫోర్లు, 1 సిక్స్) –వాషింగ్టన్ సుందర్ (101, 206 బంతుల్లో 9 ఫోర్లు, 1 సిక్స్) జంట సెంచరీలు చేసి భారత్‌ను గట్టెక్కించారు. ఆదివారం రెండు వికెట్ల నష్టానికి 174 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో భారత్ రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించింది. 188 పరుగుల వద్ద రాహుల్ మూడో వికెట్‌గా అవుటయ్యాడు. సెంచరీ తరువాత 222 పరుగులతో గిల్ నాలుగో వికెట్‌గా అవుటయ్యాడు. తరువాత జడేజా–సుందర్ జోడీ ఇంగ్లంగ్ బౌలర్లకు చక్కలు చూపించింది. రెండో ఇన్నింగ్స్‌లో ఖాతా ప్రారంభించకుండానే రెండు వికెట్లు.. (యశస్వి జైస్వాల్ (0), సాయి సుదర్శన్ (0)) కోల్పోయినప్పటికీ భారత్ వీరోచితంగా పోరాడింది.తొలుత రాహుల్– శుభ్‌మన్ జోడీ మూడో వికెట్‌కు రికార్డు స్థాయిలో 188 పరుగులు జోడించగా.. సుందర్–జడేజా జోడీ ఐదో వికెట్‌కు అజేయమైన 203 పరుగులు జోడించింది. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 358, ఇంగ్లాండ్ 669 పరుగులకు ఆలౌటయ్యాయి. సుందర్ శతకం చేసిన తర్వాత మ్యాచ్ డ్రాగా ముగిసినట్లు అంపైర్లు ప్రకటించారు. మ్యాచ్ ఫలితం తేలే అవకాశం లేకపోవడంతో 10 ఓవర్లు మిగిలుండగానే మ్యాచ్‌ను డ్రాగా ముగించేందుకు ఇరుజట్లు అంగీకరించాయి. ప్లేయర్ ఆఫ్ మ్యాచ్‌గా బెన్ స్టోక్స్ నిలిచాడు. నాలుగో టెస్ట్ డ్రా కావడంతో సిరీస్‌లో ఇంగ్లండ్ ఆధిపత్యం 2–1తో కొనసాగుతుంది. చివరిదైన ఐదో టెస్ట్ జులై 31 నుంచి లండన్‌లోని కెన్నింగ్టన్ ఓవల్‌లో ప్రారంభమవుతుంది. ఈ సిరీస్‌లో ఒకటి, మూడు మ్యాచ్‌లు ఇంగ్లండ్ గెలువగా.. భారత్ రెండో మ్యాచ్‌లో విజయం సాధించింది.

ఈ టెస్టులో ఇంగ్లండ్‌తో తొలి ఇన్నింగ్స్‌లో 669 పరుగులకు ఆలౌటైంది. జో రూట్ (150), బెన్ స్టోక్స్ (141) భారీ శతకాలతో కదంతొక్కగా.. జాక్ క్రాలే (84), బెన్ డకెట్ (94) సెంచరీలకు చేరువలో ఔటయ్యారు. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 358 పరుగులకు ఆలౌటైంది.

ఆస్కార్ పియాస్ట్రి సిక్సర్

- బెల్జియం గ్రాండ్‌ప్రిలో మెరుపు విజయం

స్టావెలోట్ (బెల్జియం) : ఈ ఏడాది ఎఫ్1 ట్రాక్‌పై మెక్‌లారెన్ జోరు కొనసాగుతుంది. వరుస రేసుల్లో దుమ్మురేపుతున్న ఆస్కార్ పియాస్ట్రి ఈ సీజన్‌లో ఆరో టైటిల్ సొంతం చేసుకున్నాడు. ఓవరాల్ డ్రైవర్ చాంపియన్‌షిప్ రేసులో ముందంజ వేశాడు. ఆదివారం జరిగిన బెల్జియం గ్రాండ్‌ప్రీలో ఆస్కార్ పియాస్ట్రి రయ్‌రయ్ సత్తా చూపించాడు. బెల్జియం గ్రాండ్‌ప్రీ 7.004కిమీ ట్రాక్‌పై 44 ల్యాప్‌లను ఒక గంట 25 నిమిషాల 22.601 సెకండ్లలో పూర్తి చేసిన ఆస్కార్ పియాస్ట్రి అగ్రస్థానంలో నిలిచాడు. మెక్‌లారెన్ మరో డ్రైవర్ ల్యాండో నోరిస్ (ఆస్ట్రేలియా) ఆస్కార్ రేసు ముగించిన 3.415 సెకండ్ల తర్వాత ఫినిషింగ్ లైన్‌ను దాటాడు. రెడ్‌బుల్ డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ నాల్గో స్థానంలో నిలువగా..ఫెరారీ డ్రైవర్ లూయిస్ హామిల్టన్ ఏడో స్థానంలో నిలిచాడు. వర్షం కారణంగా రేసు గంటన్నరకు పైగా ఆలస్యంగా ఆరంభమైనా.. మెక్‌లారెన్ డ్రైవర్లు టాప్–2లో నిలిచి ఆ జట్టుకు డబుల్ ధమాకా అందించారు.

వెలువడినది



ఫెడరలిజాన్ని దెబ్బతీస్తున్న మోడీ పాలన

– బి.వి.రాఘవులు

రూ. 10/-

ప్రతులకు
ప్రజాశక్తి బుక్‌హౌస్
డోరు నెం.27-1-54, కారల్‌మార్క్స్‌రోడ్, విజయవాడ – 2
ఫోన్ : 9490099061, 9490099057

బ్రాంచీలు
విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, ఒంగోలు, నెల్లూరు

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68